# శంబళ



మాస్టర్ పార్వతీకుమార్



శంబళ ముఖద్వారము

# శంబళ

మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ

ప్రథమ ముద్రణ : 2021 ప్రతులు : 1,000
(మాస్టర్ సి.వి.వి. 60వ గురుపూజా మహోత్సవములు)

వెల : రూ॥ **100-00**

© ధనిష్ఠ ఫౌండేషన్, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్, ఇండియా.

*ప్రతులకు :*

**ధనిష్ఠ ఫౌండేషన్,**

15-7-1, ఏంజిల్స్ ఎన్క్లేవ్,

కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.

ఫోన్ : 0891-2701531, 2509154.

e-mail : www.dhanistha.org.
info@dhanistha.org.

ISBN : 978-81-89467-49-4

*ముద్రణ :*

**సత్యం ఆఫ్‌సెట్ ఇంప్రింట్స్**

మధురానగర్,

విశాఖపట్నం - 530 016.

ఫోన్ : 0891-2796538, 9849996538.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువ లేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ"** మాస్టర్ పార్వతీకుమార్‌గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపము లోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## సంకలనకర్త : మాస్టర్ పార్వతీకుమార్

**మా**తృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయు లకు వెలుగుదారి చూపించు చున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ పార్వతీకుమార్**గారు. వారి బోధనలు లెక్కకుమించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియవచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణ యోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించు చున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళారంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ 1997వ సంవత్సరములో **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టా నందించినది. 2013వ సంవత్సరములో గౌరవ ఆచార్యులుగా నియమింపబడిరి.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో – మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే దానికి

సాఫల్యత, సార్థకత ఉండునని, *"మానవ సేవయే మాధవ సేవ"* అను మాటకు సరియైన అర్థము యిదేనని మాస్టరుగారు తమ ప్రవర్తన ద్వారా తెలియ పరచుచున్నారు. మాస్టర్ పార్వతీకుమార్‌గారు బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక – మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, శతాధిక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొనుచుండు ననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు మాస్టరుగారి దృఢ విశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

మాస్టర్ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశ విదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము పరమధర్మ" మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించుచున్నది. భగవద్ధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠా ఫౌండేషన్**

# ముందుమాట

"శంబళ" అను పదము అత్యంత పవిత్రము. శంబళ స్మరణము శంబళ అనుమతించిననేగాని వీలుపడదు. శంబళ నుండియే శ్రీమహావిష్ణువు కల్కియై ఉద్భవించి, ఈ భూమిని, ఈ భూమిపై ప్రజలను వర్ధిల్లజేయునని, కలి ధర్మమును నిర్జించు నని వేదవ్యాస మహర్షి తెలిపినాడు.

శంబళ గోబి ఎడారిలో అంతర్గతముగ నున్నదని, అచ్చటకు దారి శ్రావస్తి గుహ నుండి అంతర్గత మార్గమున ఏర్పడి యున్నదని, శంబళ చేరుటకు అత్యంత పవిత్రమూర్తులకే సాధ్యమని తెలియ వలెను. ప్రస్తుతము జగద్గురువగు మైత్రేయుడు, గౌతమబుద్ధుడు, మనువు శంబళ మార్గమును సత్యశోధకులకు అందింతురని ప్రతీతి.

శంబళ గ్రామమున సనత్కుమార మహర్షి దివ్యదేహముతో వసించి యున్నాడు. అతడే ఈ భూమికి ప్రభువు. అతని ఆజ్ఞలోనే జగద్గురువగు మైత్రేయ మహర్షి, గౌతమబుద్ధుడు, మనువు శిరసా వహించి, దివ్యప్రణాళికను తన శిష్యవర్గము ద్వారా నిర్వర్తింపజేయు చున్నాడు. సర్వసంగ పరిత్యాగియగు సనత్కుమారుడే సుబ్రహ్మణ్యుడు కూడ. అతడే శరవణభవుడు. శ్రీకృష్ణుని కుమారుడగు ప్రద్యుమ్నునిగ పాండవులకు సహాయపడినవాడు కూడ సనత్కుమారుడే.

శ్యామల దివ్యకాంతితో, కృష్ణునికి ప్రతిరూపముగ శ్రీకృష్ణుని

కోరికపై సనత్కుమారుడే శంబళ యందు వసించి యున్నాడు. శంబళ అను నామము కూడ శ్యామబాల అను నామము నుండి ఏర్పడినది. శంబళ గ్రామ మంతయు హిరణ్మయ కిరణములతో నిండి శంబళ గ్రామస్తులు కూడ హిరణ్మయ దేహకాంతులతో కూడియుందురు. శంబళ దర్శనము పూర్ణ అనుగ్రహము వలన లభించును. పూర్ణా నందము కలిగించును.

ఈ భూమండలము ననుగ్రహించుటకే సనత్కుమారుడు దైవాజ్ఞగ శంబళ యందుండుట భూమికి అనుగ్రహము. భూమిపై గల సమస్త జీవకోటి శంబళచే పరిశుద్ధి చెంది పరిపుష్టిగ వర్ధిల్లు తున్నది.

భూమిపైగల మానవులు శంబళతో భక్తి జ్ఞాన వైరాగ్య సిద్ధితో చేరు మార్గమున్నది. భూమిపై సిద్ధులు శంబళ చేరుటకు అనుమతి పొంది యుందురు. ఆదిశంకరులు, శ్రీపాద శ్రీవల్లభుడు, సదాశివ బ్రహ్మేంద్ర సరస్వతి, త్రైలింగస్వామి, రామకృష్ణ పరమహంస, రమణ మహర్షు లంతటివారు శంబళను దర్శించినవారు. అంతేకాక శంబళ వాసులై భూహితము నుద్దేశించి శంబళయందు తమ తపస్సులను కొనసాగించు చున్నారు. భూమిపై సిద్ధులకు శంబళయే పరమపదము.

ప్రస్తుతకాలమున శంబళ తనకు తానుగ ప్రకటించుకొను చున్నది. అందులకై అన్ని ఖండములయందు పర్వతశ్రేణుల లోయ లలో, గుహలలో వాసము లేర్పరచుకొనుచున్నది. భూమిని, సత్య ధర్మములను పాటించు ఆస్తికులను రక్షించుటకు, ఉద్ధరించుటకు పూనుకొని యున్నది. శంబళ క్రమముగ మానవజాతి ఎరుకలో

ప్రవేశించ గలదు. మానవుల ద్వారా మానవజాతి కేర్పడు అపాయములను నిర్వీర్యము చేయుటకై భూమి యంతయు తన ప్రజ్ఞచే ఆవరించు చున్నది. యుద్ధములను, యుద్ధోత్సాహమును శంబళ నిర్వీర్యము చేయుట వలననే మరల ప్రపంచ యుద్ధము చాలమార్లు నిర్జించినది. ఇటుపై కూడ నిర్జించగలదు.

మానవజాతిని పాలించు ప్రభుత్వముల వలన ఏర్పడిన అపసవ్యములను, అధర్మములను కూడ వారించుచున్నది. అవినీతి, అధికార దుర్వినియోగములను ప్రతిఘటించి శిక్షించుచున్నది. భూమిపైగల అంటువ్యాధులను కూడ మానవజాతిలోని ఆస్తికులచే నిరోధించి, నిర్జించి నిర్వీర్యము చేయుచున్నది.

శంబళ స్మరణయే తరింపు నీయగలదు. సత్యధర్మములను, అహింసను పాటించుచు, లోకహితము గావించు వారికి బలము నిచ్చు చున్నది. శంబళను అందరికిని ప్రకటింప జేయుటకే శంబళ నామమును, శంబళ బోధనలను ఈ పుస్తకమున సమర్పింపబడు చున్నవి. ఈ ప్రయత్నమంతయు శంబళ అనుగ్రహమే.

భక్తి శ్రద్ధలతో, శంబళ స్మరణతో ఈ పుస్తకమును పఠింపుడు. శంబళ స్పర్శను పొందుడు. ఈ పుస్తకము ప్రచురించుటకు మూల్యమును సమర్పించిన శ్రీ అన్నలూరు రామకోటేశ్వరరావు గారి కుటుంబమునకు అమూల్యమగు అనుగ్రహము లభింప వలెనని ప్రార్థిస్తూ....

ధనిష్ఠ కార్యకర్తలకు నా హృదయపూర్వక శుభాశీస్సులు...

తేది **25-12-2020** ఇట్లు

వైకుఠ ఏకాదశి **కంభంపాటి పార్వతీకుమార్**

## విషయసూచిక

| | | |
|---|---|---|
| 1. | శంబళ | 13 |
| 2. | గోబి ఎడారి | 15 |
| 3. | శంబళ స్మరణము | 17 |
| 4. | నీలిమకాంతి | 19 |
| 5. | ప్రస్తావన | 21 |
| 6. | భవిష్యత్ వాణి | 23 |
| 7. | అనుసంధానము | 24 |
| 8. | గురువు-ప్రభువు | 26 |
| 9. | దివ్య గ్రామము | 28 |
| 10. | దివ్య సంకల్పము | 30 |
| 11. | శాస్త్ర పర్వతము | 32 |
| 12. | సంకల్పశక్తి | 34 |
| 13. | పరిరక్షించుట | 35 |
| 14. | శంబళ తత్త్వము | 37 |
| 15. | స్థితప్రజ్ఞత్వము | 39 |
| 16. | శంబళ ప్రజ్ఞ | 41 |
| 17. | మానవజాతి రక్షణ | 43 |
| 18. | సర్వ సమర్పణము | 45 |
| 19. | సర్దుబాట్లు | 47 |
| 20. | శంబళ స్పర్శ | 49 |
| 21. | శంబళ శక్తి | 51 |
| 22. | ప్రచోదనము | 53 |
| 23. | దివ్య ప్రణాళిక | 55 |
| 24. | మహా వైశాఖి | 57 |
| 25. | సమన్వయము | 59 |
| 26. | కలిహరణము | 61 |
| 27. | పవిత్రీకరణము | 63 |
| 28. | వెలుగు ప్రవేశము | 65 |
| 29. | దివ్య ప్రయత్నము | 67 |
| 30. | దివ్యావతరణము | 69 |
| 31. | శంబళ వాక్కు | 71 |
| 32. | మకర జ్యోతి | 73 |
| 33. | శంబళ ప్రార్థన | 75 |
| 34. | పవిత్రీకరించుట | 77 |
| 35. | ఉన్నత స్థితి | 79 |
| 36. | యజ్ఞార్థము | 81 |
| 37. | సంకల్పశక్తి | 83 |
| 38. | సంకల్పబలము | 85 |
| 39. | మైత్రీ భావములు | 87 |
| 40. | సత్సంకల్పము | 89 |
| 41. | సేవ చేయుట | 91 |
| 42. | శ్రేయస్సు | 93 |
| 43. | లోకహితము | 95 |
| 44. | విశిష్టుడు | 97 |
| 45. | సర్వహుత యజ్ఞము | 99 |
| 46. | లోకశ్రేయస్సు | 101 |
| 47. | మానవుడే వాహిక | 103 |
| 48. | ప్రేమ మార్గము | 105 |

49. సేవానిరతి 106
50. ప్రతినిధులు 108
51. ధీమంతులు 110
52. కలి ప్రభావము 112
53. సంకల్పబలము 114
54. ధ్యానము 116
55. పంచరాత్ర దీక్ష 117
56. భూమి ఋణము 118
57. రూప మరణము 120
58. క్షాళణ చెందుట 122
59. ఉన్నతత్త్వము 124
60. లోకాంతర యానము 126
61. శాశ్వత సత్యము 128
62. పురుషోత్తమ ప్రాప్తి 130
63. దైవమే తాను 132
64. దివ్యసాధన 134
65. స్వభావ విసర్జన 136
66. బృంద సహకారము 138
67. పరిణామక్రమము 140
68. సన్నివేశములు 142
69. దండోపాయము 144
70. వెలుగు వంతెన 146
71. దివ్య క్షేత్రములు 148
72. మనో పరిణామము 150
73. అమృతత్వ స్థితి 152
74. ప్రేమతత్త్వము 154
75. ఈశ్వర దర్శనము 156
76. మూడు సూత్రములు 158
77. దివ్య విషయములు 160
78. నవ శ్రేణులు 162
79. ముందు చూపు 165
80. పురుషమేధము 167
81. మార్గదర్శకత్వము 169
82. లోకసేవ 171
83. ప్రజ్ఞావతరణము 173
84. మోక్షద్వారము 175
85. బహుమతులు 177
86. శంబళ ప్రవేశము 179
87. శంబళ మార్గము 181
88. తత్త్వ వికాసము 183
89. నూతన విధానము 185
90. ప్రజ్ఞా మార్గములు 187
91. ధారణ స్థితి 189
92. త్రిగుణములు 191
93. ఈశ్వర లక్షణము 193
94. అమృతత్త్వ సిద్ధి 195
95. యోగదండము 197
96. యోగదండ స్పర్శనము 199
97. చైతన్యశక్తి 201
98. సప్త సోపానములు 203
99. మహా సిద్ధులు 205
100. పూర్ణిమా ధ్యానములు 207

# శంబర

# 1

## శంబళ

**శంబళను స్మరింపుము. శంబళ ప్రభువగు సనత్కుమారునికి నమస్కరింపుము. జగద్గురువు మైత్రేయుని అనుసరింపుము.**

నిత్యము శంబళను స్మరించుము. శంబళ భూమ్యాకాశముల కూడలి స్థలము. అనగా వ్యక్తము, అవ్యక్తము కూడు చోటు. అవ్యక్తము నుండి వ్యక్తము లోనికి దివ్య ప్రణాళికను ప్రసాదించు కేంద్రము. దీనిని 'గౌరీ శంకర కేంద్ర'మని ప్రాచీనులు తెలుపుదురు. శంకరు డవ్యక్తుడు. గౌరి, శంకర తత్త్వముయొక్క వ్యక్తరూపము. ఈ కేంద్రమును పరిపాలించు సనత్కుమారుడు పురాణములందు తెలుపబడిన సుబ్రహ్మణ్య స్వామియే.

పురాణములందు తెలిపిన శంబళ గ్రామము మహర్షులకు మాత్రమే విదితము. వారు శంబళ విషయమున మౌనము వహింతురు. ఆదేశములు, నిర్దేశములు ఊర్ధ్వలోకముల నుండి అందుకొనుటకే వారు శంబళను దర్శింతురు. అట్టి మహర్షులు భూమిపై దైవదూతలుగ పనిచేయుచు నుందురు.

శంబళ సభ్యులు ప్రపంచమున వర్తించుచునే యుందురు. తరచు సంచారము కూడ చేయుదురు. దివ్యకార్యములకు ప్రేరణ

నిచ్చుచు, తాము ను దివ్యకార్యములు నిర్వర్తించుచు నుందురు. తాము శంబళ సభ్యులమని యెట్టి సంకేతములు చేయరు. వారి జీవితము యజ్ఞార్థమై యుండును. వారు శంబళయే స్ఫూర్తిగ జీవించుచుందురు.

శంబళను, గౌరీ శంకరులను, సనత్కుమారుని మీ ధ్యానము నందు స్మరింపుడు. స్మరణ మాత్రమున పవిత్రీకరణము జరుగును.



## 2


## గోబి ఎడారి

శంబళ గోబి ఎడారిలో నున్నట్లు పురాణములు తెలుపుచున్నవి. గోబి ఎడారి హిమాలయములకు ఉత్తరమున నున్న మంగోలియా దేశమందున్నది. ఎడారియందు అంతర్హితముగ, సూక్ష్మముగ నిహితమై, తేజోమయమై సూక్ష్మముగ యున్నదని పరమ గురువు జ్వాలాకూలుడు తెలిపియున్నాడు. ఒకప్పటి మానవులే త్యాగము, తపస్సు ఆధారముగ జ్ఞానులై శంబళ సభ్యులైనారు. ప్రపంచము నలుదిశల శంబళ సభ్యులు గుప్తముగా యజ్ఞార్థము జీవితమును నిర్వహించుచు, ఇతరులకు ప్రేరణ నిచ్చుచున్నారు.

శంబళ సభ్యులలో కొందరు అత్యంత ధనవంతులై ప్రపంచమున నున్నప్పటికి, వారా ధనమునకు ధర్మకర్తలుగనే యున్నారు. తమ యందలి జ్ఞానసంపద నుండి భౌతిక సంపద వరకు అన్నియు దైవదత్తములే అని భావించుచు లోకహితమునకే వినియోగించుచు నుందురు.

శంబళ సభ్యులు ధీరులు. నిజమగు అసంగులు. తమ వద్ద చేరిన సంపదను తమదిగ భావింపక, పరహితమునకే వినియో

గింతురు గనుక, సంపద పెరిగినను తరిగినను, అదృశ్యమైనను చలనము చెందరు. ప్రకృతి సంపదలు వారి ద్వారమున లోకహితము నకై పంచబడుచుండును. వారు సత్యము నాశ్రయించి అహర్నిశలు పరిసరములకు సహాయము నందజేయుచు నుందురు.



# 3

## శంబళ స్మరణము

శంబళ సత్యమును చేరు మార్గమును బోధించుచు నుండును. శంబళ బోధలు వినువారికి స్వస్థత కలిగించి, ప్రచోదనము కలిగించును. యజ్ఞార్థము జీవించు సంకల్పముగల వారివద్దకు శంబళ బోధలు సూటిగ అంతరంగ మార్గమున చేరును. నిద్రయందుగాని, ధ్యానము నందుగాని జీవులు సూక్ష్మలోకముల లోనికి ఉద్ధరింపబడి బోధనలు వినుట, చూచుట కూడ జరుగును.

శంబళ కొరకై ఎడారిలో వెదుక నవసరము లేదు. అది ఒక తేజోమయమగు ఆశ్రమము. మీ భావనా సిద్ధిని బట్టి, శంబళ యందు మీకున్న పరమ భక్తినిబట్టి శంబళయే మిమ్ము సమీపించును. శంబళతో మీ అనుసంధానము మీ జీవితములను పరిపుష్ఠము చేయును. తలచిన మాత్రముననే సద్యోజాతమగు ప్రజ్ఞ శంబళ. శంబళ స్మరణవలన మీయందలి ప్రాణశక్తి రెట్టింపై బలము కూర్చును.

శంబళ స్మరణమునకు ఆర్తియే ప్రధానము. ఇతర అర్హతలు క్రమముగ శంబళయే కూర్చుకొనగలదు. శంబళ స్మరణమునకు దేశ కాల నిర్దేశములు లేవు. నిష్ఠ, నియమములు లేవు. పరిశుద్ధ మనస్సుతో, ఆర్తితో స్మరించుటయే విధానము. స్మరించిన వారిని తగు విధముగ

స్పృశించి, ఉద్ధరించుటయే శంబళ కార్యము. శంబళ స్మరణమున దుర్గమ కార్యములు సుగమమై కృతకృత్యులైన జీవులెందరో గలరు.

శంబళ స్మరణము దైనందిన ప్రాతఃస్మరణముగ అలవరచుకొని తరింపుము.



# 4

## నీలిమకాంతి

శంబళ యనగ “శ్యామబాల” అని కొందరి ప్రగాఢ నమ్మకము. పూర్వమీ భూగోళము జలప్రళయమునకు గురియైనపుడు ఈ భూమిపై సూక్ష్మ శరీరముతో చిరంజీవి మరియు మృత్యుంజయుడు అయిన మార్కండేయ ముని ఒంటరిగ సంచరించునపుడు ఒకానొక ప్రదేశమున నీలిమకాంతితో కూడిన బాలుడొకడు మఱ్ఱియాకుపై నవ్వుచు పరుండి యుండి, భూ జలములపై తేలుచు నుండెనట. ఆ శ్యామబాలుని దర్శించి మార్కండేయ ముని గోళాంతర విజ్ఞానమును పొందెనట. మఱ్ఱియాకుపై తేజోమయమగు రూపమున తేలుచున్న శ్యామబాలుని మార్కండేయ మహర్షి దర్శించిన ప్రదేశమే ‘శంబళ’ యని గుర్తింప బడినది. ఈ భూమి మొత్తము జలమయ మైనపుడు కూడ చిద్విలా సముగ వెలుగొందుచున్న నీలిమకాంతిని ఈ భూమికి ప్రభువుగ గుర్తించిరి. అతనినే శ్యామ బాలుడని, బాలకృష్ణుడని, శివబాలు డగు సనత్కుమారుడని సంబోధించినట్లు హిమాలయములందు గల నానుడి. ఈ భూమిని నిజముగ కోట్లాది సంవత్సరములనుండి పరిరక్షించుచు, పరిపాలించు చున్న శంబళ ప్రజ్ఞ శ్రీమహావిష్ణువు యొక్క యశస్సు నుండి వెలువడిన ఒక తేజో పుంజముగ కూడ భావింతురు.

విష్ణుయశస్సు కుమారుడుగ కల్కి అవతార మేర్పడునని పురాణములు తెలుపు అంశము ఈ ప్రజ్ఞను గూర్చియే. ఈ ప్రజ్ఞయే మైత్రేయ బుద్ధుడుగ దిగివచ్చునని టిబెట్టునందుగల బౌద్ధ మతస్తుల విశ్వాసము. మైత్రేయ మహర్షి సాక్షాత్తు భూమిపై నిలచిన విష్ణుస్వరూపమే అని భాగవతము ఘోషించు చున్నది.

పాఠకులు పై అంశములను సమన్వయించుకొందురు గాక!

# 5

## ప్రస్తావన

శంబళ అతి ప్రాచీనకాలము నుండి, అనగా భూమి పుట్టుక నుండి కూడ, భూమి కాధారమై యున్నది. హిందూ పురాణములందు, టిబెట్ గ్రంథములందు, చైనీయుల గ్రంథములందు శంబళ కీర్తింపబడి యున్నది. తంత్ర రాజమగు కాలచక్ర తంత్రమందు కూడ శంబళ ప్రస్తావన యున్నది. శంబళను గూర్చి అనేకానేక ఉపాఖ్యానములు ఉత్తర ఏషియా ఖండమున నున్నవి. అనేకములగు బోధనలున్నవి. శంబళ నుండియే దైవపరమగు చికిత్సా విధానములు, దైవమును చేరు యోగాభ్యాస విధానములు శ్రుతి రూపమున ప్రపంచము నలుమూలలకు చేరినవి. అన్ని ప్రాచీన ఆధ్యాత్మిక సాధనా విధానము లందు శంబళ ప్రస్తావన యున్నది. పురాతనమగు సమస్త జ్ఞానము నకు, శాస్త్రములకు శంబళయే మూలము.

మన మెరిగిన మతములు రెండువేల ఐదు వందల సంవత్సర ముల నుండి ఏర్పడినవి. అంతకు పూర్వము కోటి ఎనభై లక్షల సంవత్సరముల నుండి మానవుడు భూమిపై యున్నాడు. అప్పటి నుండి కూడ శంబళ మానవ జాతులకు దివ్య స్ఫూర్తి కేంద్రమై యున్నది. అగ్ని ఆరాధకులు, సూర్య ఆరాధకులు శంబళ స్ఫూర్తితోనే

సిద్ధులైరి. మహర్షులుగ నేటికిని మానవజాతి ననుగ్రహించు చున్నారు. సనాతనమైన చైనా, హిందు, టిబెట్ సంప్రదాయములందు శంబళ ప్రస్తావన యున్నది.

కాలక్రమమున హిందువులు, చైనీయులు, బౌద్ధులు శంబళను వారివారి గ్రంథముల యందు కూడ నిక్షిప్తము గావించుకొనిరి. ప్రస్తుతము ప్రాక్-పశ్చిమములందు శంబళ ప్రసిద్ధి గాంచుచు నున్నది.

# 6

## భవిష్యత్ వాణి

బౌద్ధమతస్తులు, వారి కాలచక్ర తంత్ర గ్రంథమున శంబళను గూర్చి ప్రస్తావించుచు ఇట్లని వివరించుకొనిరి. శంబళయందలి ప్రభువును ప్రాథమికముగ "మంజు శ్రీ కీర్తి" అని పేర్కొనిరి. చైనీయులు శంబళ ప్రభువును "రిగ్‌దాన్ తద్వా" అని లిఖించుకొనిరి. ప్రస్తుతము శంబళను పరిపాలించు ప్రభువు మైత్రేయ బుద్ధుడని పేర్కొనిరి. కాలచక్ర తంత్రమందు భవిష్యత్ వాణిగ ఇట్లు చెప్పబడినది.

*"ప్రపంచమంతయు దురాశతో నిండి, యుద్ధములు పెచ్చు పెరిగి, మానవజాతి అల్లకల్లోలమై యున్నప్పుడు అజ్ఞానపు చీకటులను పారద్రోలుటకై, శంబళ ప్రభువు మహత్తర పరాక్రమముగల సైన్యముతో ఉద్భవించి, విజృంభించి ధర్మ సంస్థాపనము చేయును."*

పై విధముగ శంబళ ప్రభువు క్రీ॥శ॥ 2424 సం॥న ఏతెంచునని కాలచక్ర శాస్త్రజ్ఞులు ప్రబోధించు చున్నారు. వీరి సంప్రదాయము ననుసరించి ఇప్పటినుండి 407 సంవత్సరములలో 'కల్కి అవతారము' ఉద్భవించవలసి యున్నది. అనగా ఈ భూమిపై జనులు ఇంకనూ 407 సం॥లు కలియుగ బాధలు అనుభవించవలసి యున్నది. ఇదియొక అవగాహన.

7

## అనుసంధానము

శంబళ యందు ప్రాథమికముగ కాలమే దైవముగ వర్ణింప బడుట యుండెడిది. పురాణముల యందు కూడ దైవము కాలము రూపమున సృష్టి నిర్వర్తించుట తెలుపబడినది. కాలక్రమమున అగ్ని ఆరాధన మేర్పడినది. అటుపైన సూర్య ఆరాధన ఏర్పడినది. సూర్యుని ప్రత్యక్ష దైవముగ ఆరాధించుట, అగ్నిని సృష్టికి మూలమగు దైవముగ ఆరాధించుట ఏర్పడినది. వేదములందు అగ్ని ఆరాధనము మిక్కుటము. అగ్నిని కాలాగ్ని రుద్రుడుగ, త్రికాగ్ని కాలుడుగను స్తుతించిరి. కాలము రూపముననే దైవమగు అగ్ని సమస్త సృష్టిని నియమించునని తెలుపబడినది. వేదములందలి అగ్నినే పురాణము లందు పరమ శివునిగ, మహా దేవునిగ ఋషులు కీర్తించిరి. ఇట్టి కాలతత్త్వమును అనుసరించు విధానమునుండి క్రమముగ సూర్య ఆరాధనము ప్రారంభమైనది.

శంబళయందు కాలము ననుసరించు విధానము నుండి వైదొలగి, సూర్యారాధనము నందు జీవు లాసక్తిగొనుట ఒక పతనముగ భావింపబడినది. కాలము ననుసరించువారు ఋతువులు, పూర్ణిమ అమావాస్యలు, తిథుల లక్షణములు, ద్వాదశరాశుల

విలక్షణములు తెలిసి, అన్ని కాలముల యందు ప్రకృతిచే అనుసంధానము చెంది సామరస్యముతో జీవించెడివారు. అనుసంధానమే ప్రధానముగ నుండెడిది. అనుసంధాన జ్ఞానము విసర్జించి, ఆరాధనా మార్గమును పట్టుట శంబళ ప్రభువు అగు మంజుశ్రీకీర్తి అనుమతించ లేదు. ఆచరణ మార్గమున అనుసంధానముండి, సమదర్శనము, సమభావము, సమవర్తనము ఉండునని, అట్టి జ్ఞానము లోపించినపుడు జీవులు భజనపరులై ఆచరణను కోల్పోవుదురని మంజుశ్రీకీర్తి ప్రభువు ఆందోళన చెందెను. అందువలన కాలచక్ర తంత్రమే నిర్వర్తింపబడ వలెనని, సూర్యారాధనము నిషేధింపబడ వలెనని శాసించెను. కాని కాలక్రమమున ఆరాధనా విధానమునకు ప్రాముఖ్యత పెరుగుచుండగ, మంజుశ్రీకీర్తి మౌనము వహించెను.

శంబళ, జ్ఞానముతో కూడిన ఆచరణకే ప్రాధాన్యము నిచ్చును గాని, ఆరాధన కంత ప్రాముఖ్యత నీయలేదు. కలియుగమున ఆచరణ శూన్యమై, ఆడంబరముగ ఆరాధనలు సాగుట కలిచూపు ఇంద్ర జాలము.

# 8

## గురువు - ప్రభువు

తన ప్రజలు జ్ఞానముతో కూడిన ఆచరణము నుండి వైదొలగి, ఆరాధనము నాశ్రయించుట గమనించిన శంబళ ప్రభువు ప్రజాభీష్ట మును ప్రేమతో నంగీకరించి, సూర్యారాధనమున కంగీకరించెను. ఆరాధనా మార్గమున దైవముతో అనుసంధానము చెందవలెనని, అట్టి అనుసంధానమున అంతరంగమున జ్ఞానమును పొందవలెనని, అట్టి జ్ఞాన మాధారముగ ఆచరణ యుండవలెనని మంజుశ్రీకీర్తి శాసన మేర్పరచెను.

శంబళ ప్రభువు కేవలము ప్రభువేకాక, సద్గురువు కూడ. అతడు ధర్మమును ఆచరించుచు, బోధించుచు ప్రజలను పరిరక్షించుచు నుండెడివాడు. పూర్వకాలమున గురు ధర్మమును, ప్రభు ధర్మమును నిర్వర్తించెడి రాజయోగు లుండెడివారు. జనకాదు లట్టివారే. వారు దైవానుసంధానము కలిగి, బోధన పాలన కూడ నిర్వర్తించెడి వారు. కాలక్రమమున బోధనము, పాలనము విభజింపబడినది. నిజమునకు అది పతన కారణమే. పూర్వకాలమందు గురువే రాజుగ నుండెడి వాడు. రాజే గురువుగ నుండెడివాడు. తండ్రియే గురువైనపుడు,

అది యొక సౌలభ్యమై యుండును. తండ్రి వేరుగను, గురువు వేరుగను యుండునపుడు జీవునకు ఘర్షణము కలుగు అపాయమున్నది. సద్గురువులకు, పాలకులకు నడుమ గల అవగాహనా భేదము నుండి కలి యుద్భవించి తాండవము చేయును.

శంబళ యందు అప్పటికిని ఇప్పటికిని గురువు, ప్రభువు ఒక్కరే.



9

## దివ్య గ్రామము

ఆధునిక యుగమున శంబళను గూర్చి మానవజాతికి వెల్లడి గావించిన పాశ్చాత్యులలో దివ్యజ్ఞాన సమాజ వ్యవస్థాపకురాలగు హెలీనా పెట్రోవ్నా బ్లావెట్స్కీ ఒకరు. H.P.B. అని ప్రేమతో పిలువబడు బ్లావెట్స్కీ ఆధునిక యుగమున ఒక అత్యద్భుతమగు జ్ఞానయోగిగ, క్రియాశక్తిగ వెలుగొందినది. ఆమెకు శ్వేతద్వీపవాసుల పరిచయము, సన్నిహితత్వము, సాన్నిధ్యము యుండుటవలన అత్యంత పురాతనమగు అనేక భౌగోళిక విశేషములను, చరిత్రను ఉటంకించినది. శంబళ గ్రామమును గూర్చి తన రచనలలో పలుచోట్ల ప్రస్తావన గావించినది. శంబళ ఒక దివ్య గ్రామ మని, అందుండు సభ్యులు దివ్య దేహధారు లని, యోగవిద్య ద్వారా హిరణ్మయమగు సూక్ష్మశరీరము పొందిన వారు శంబళను దర్శింపగలరని సూచనప్రాయముగ తెలిపినది.

బ్లావెట్స్కీ అనుయాయి అయిన ఏలిస్ ఎ. బెయిలీ కూడ పరమగురువుల సహచర్యమున తాను రచించిన గ్రంథములలో శంబళను ప్రస్తావించినది. మేడమ్ బెయిలీ ప్రకారము శంబళ ఒక ఆధ్యాత్మిక సత్యము. అతీంద్రియ గ్రహణము గలవారు శంబళను

దర్శింపగలరు. శంబళ ప్రభువగు సనత్కుమారుడు ఈ భూమికి ఆత్మ మరియు దైవము. సనత్కుమారుడు దివ్యసంకల్పమును భూమిపై నిర్వర్తింపజేయు దైవ ప్రతినిధి. ఇట్టి విషయములు ఏలిస్ ఎ. బెయిలీ ద్వారా ప్రకటితమైనవి.

20వ శతాబ్దము మొదటి పాదమున శంబళయందాసక్తి గల నికోలారోరిక్ అను ఒక సాహసి మేడమ్ బ్లావెట్స్కీ రచనలకు ప్రభావితమై, హిమాలయములకు చని రెండున్నర దశాబ్దములు హిమాలయ పర్వత శిఖరములయందు, లోయల యందు యాత్ర గావించెను. తాను దర్శించిన సత్యములను చిత్రీకరించి శంబళ ప్రభావమును చిత్రలేఖనము ద్వారా ప్రపంచమున కందించెను.

## 10

## దివ్య సంకల్పము

శంబళ గ్రామ మందు వసించు సభ్యులందరు అమరులు. పూర్ణ ఆరోగ్యవంతులు, జ్ఞానులు. వందల సంవత్సరములు ముదుసలి తనము లేక జీవించు వారు. అచ్చట పంచభూతములు అత్యంత పవిత్రములై, సామరస్యముతో కూడియుండుట వలన వృక్షములు, జంతువులు, మానవులు, పక్షులు పరిపుష్ఠము, ఆరోగ్యకరము అగు దేహములను ధరించి యుందురు.

భౌగోళికముగ జరుగుతున్న పరిణామము లన్నియు శంబళ పర్యవేక్షించుచు నుండును. సభ్యు లందరు ధ్యానము ద్వారా దివ్య సంకల్పమును గ్రహించి భూమిపై ప్రసరింపజేయుచు నుందురు. కొందరు సభ్యులు ప్రపంచమున ఇమిడియుండి, దివ్య సంకల్పమును నిర్వర్తింపజేయుచు నుందురు.

మరియొక ముఖ్యమగు అంశ మేమనగ, దక్షిణ హస్తమును ఊర్ధ్వమునకు చాపి, ఒక దీపపు సమ్మెను ధరించి, ఆ దీపపు కాంతి నలుదిశల చేరునట్లు ఒక యూపస్తంభము శంబళనగర మధ్యమున యున్నది.

నవీన యుగమున అమెరికా ఖండము పునరావాసము నేర్పరచుకొను సందర్భమున ఈ స్తంభమునే లిబర్టీ స్టాట్యూగా ఏర్పరచుకొనిరి. లిబర్టీ స్టాట్యూ మూల సూత్రము శంబళయందున్నది. షం–ఇ–బల అను పదమును పర్షియన్ దేశస్తులు ఎత్తి పట్టుకొనిన, వెలుగుచున్న కొవ్వొత్తికి వాడుచు నుందురు. పర్షియన్ భాషలో షం–ఇ–బల శంబళకు సంకేతముగ వాడుట యుండెడిది.

పరమగురువు గుర్జీఫ్ అనుయాయులు షం–ఇ–బల్కా అను నామమును సూర్య దేవాలయమున కేర్పరచుకొని ఆరాధన గావించుచు నుండెడివారు. శంబళ అనేకమగు వికృతి చెందిన నామములతో ప్రపంచమంతయు వ్యాప్తి చెందుచు యున్నది.



# 11


## శాస్త పర్వతము

శంబళ ప్రభువు ప్రబోధకుడు, ప్రచోదకుడు మరియు పాలకుడు. అతని యందు ఇచ్ఛా జ్ఞానశక్తులు మిళితమై యుండుట వలన పురాణములందు అతనిని ధర్మశాస్త్ర అని పేర్కొనిరి. ధర్మశాస్త అనగా శివకేశవ సమన్వయ ప్రజ్ఞ. సనత్కుమారుడు శంబళ కేంద్రముగ భూగోళమును పరిపాలించుచు, పశ్చిమమున కూడ ఒక అగ్ని పర్వతమును కేంద్రముగ నేర్పరచుకొని యున్నాడు. అదియే శాస్త పర్వతముగ కాలిఫోర్నియా రాష్ట్రమందలి కస్కాదె పర్వత శ్రేణియందు దక్షిణముగ నున్నది. పశ్చిమ భూభాగమున ప్రస్తుతము తన దివ్య సంకల్పము నిర్వర్తింపబడుటకై శాస్త పర్వత కేంద్రమును ప్రచోదనము గావించు చున్నాడు. అమెరికా ఖండము మానవజాతి భవిష్యత్తునకు ప్రధాన ఖండముగ మారుటకు కారణము సనత్కుమారుడు శంబళ ప్రజ్ఞను శాస్త పర్వతము ద్వారా ప్రసారము గావించుటయే. ప్రపంచ వ్యాప్తముగ కాలిఫోర్నియా రాష్ట్రము గత పాతిక సంవత్సరములలో ప్రఖ్యాతమైనది. కుంభచైతన్యమును సనత్కుమార ప్రజ్ఞ శాస్త పర్వత కేంద్రముగ ప్రసారము గావించుట వలననే ఆధునికమగు ఎలక్ట్రానిక్

మరియు కంప్యూటర్ యుగమునకు కాలిఫోర్నియా రాష్ట్రము భౌగోళిక కేంద్రమైనది.

మరియొక సత్యమేమనగ ఆసియా ఖండములోని శంబళ కేంద్రము, అమెరికా ఖండములోని శంబళ శాఖయగు శాస్త పర్వతము ఇంద్ర ధనుస్సు వలె సమ్మిళితమై ప్రాక్-పశ్చిమములను సమన్వయ పరచు మహాయజ్ఞము నిర్వర్తింపబడుచు నున్నది. ప్రస్తుతము శాస్త పర్వతము అనేకానేకమగు విభూతులను అందించుచు, ఆస్తిక జనులను, శాస్త్రజ్ఞులను కూడ ఆకర్షించుచు నున్నది.

శంబళ తూర్పు పడమరల నుండి తన ప్రజ్ఞను ప్రస్ఫుటముగ వ్యాప్తి గావించుచు 2424 సం॥నకు సత్యయుగము భూమిపై ఏర్పాటు చేయునను వినికిడి సత్యము కాగలదనిపించును.



# 12

## సంకల్పశక్తి

భూమిపై నిర్వర్తింపబడు దివ్య సంకల్పమునకు శంబళయే కేంద్రము. ఊర్ధ్వలోకముల నుండి దివ్య సంకల్పము శంబళను చేరును. ప్రతి సంవత్సరము ఉగాది ఆరంభముగ చైత్ర పౌర్ణమి వరకు ఈ సంకల్పము శంబళయందు వివరముగ అందుకొనబడును. అప్పటి నుండి వైశాఖ పౌర్ణమి వరకు దిగివచ్చిన దివ్య సంకల్పమునకు రూపకల్పన చేయబడును. అటుపైన వైశాఖ పూర్ణిమ సందర్భమున మైత్రేయాది గురుపరంపరకు అందింపబడును.

పరమ గురువుల అనుయాయి లందరును చైత్ర పౌర్ణమిని దృష్టియందుంచుకొని ఉగాది నుండి పౌర్ణమి వరకు శంబళను గూర్చి ధ్యానింతురు. ఇట్టి ధ్యానము అనుయాయుల యందు సంకల్ప శక్తిని వృద్ధి చేయుటయే గాక క్రమముగ శంబళతో అనుసంధానము కలిగించును.

13

## పరిరక్షించుట

భూమిపైగల అత్యుత్తమము, అత్యంత పవిత్రము అగు కేంద్రము శంబళ. భూమికి అపాయకరమగు శక్తుల నన్నిటిని నిర్వీర్యము చేయుట, భూమిని కాపాడుట శంబళ ప్రధాన కర్తవ్యము. భూమిని రాజు పాలించునట్లు శంబళరాజగు సనత్కుమారుడు భూగోళము మొత్తమును విధ్వంసక శక్తులనుండి కాపాడుచు నుండును.

అంతరిక్షము నుండి అనేకానేక శక్తులు భూమికి తోడ్పాటు గావించుచున్నట్లే, విద్రోహక శక్తులు కూడ భూమిపైకి దండెత్తు చుండును. పర రాజ్యముల నుండి తన రాజ్యమును కాపాడుకొను రాజువలె శంబళరాజు భూమిని కాపాడుచు నున్నాడు. ఎన్నియోమార్లు అంతరిక్షమునుండి ఉల్కలు భూమి వినాశనమునకై భూమి దిశగ అత్యంత వేగవంతముగ వచ్చు వానిని సనత్కుమారుడు నివారించుట జరిగినది. భూమికెట్టి ఆపద కలుగకుండ కాపాడుకొనుట శంబళ నుండి నిర్వర్తింపబడు చున్నది.

భూమి సంబంధితమగు సమస్తమును సమగ్రముగ పరి

రక్షించుట శంబళ వహించు చున్నది. భూమిపై ఏ మానవజాతిగాని, ఎటువంటి విజ్ఞానమును గాని భూమి సమగ్రత్వమునకు విద్రోహము తలపెట్టలేరు. మానవుడు ఎంత ఆసురీ తత్త్వమున పెరిగినను అట్టి ఆసురీ తత్త్వమును నిర్వీర్యము చేయుట యందు శంబళ అప్రమత్తమై యున్నది. అట్లాంటియన్ మహా యుద్ధము జరిగినపుడు భూమి కేర్పడిన అతి తీవ్రమైన అపాయమును శంబళయే నివారించినది.

ప్రాక్–పశ్చిమములందు శంబళ కేంద్రముల నేర్పరచుకొని, ఎప్పటికప్పుడు భూమిని, భూమి నావరించిన పంచభూతములను, భూమియందేర్పడిన దివ్య ప్రజ్ఞలను కాపాడుకొనుచునే యున్నది. అణుబాంబులు కాని, మరి యే ఇతర విధ్వంసక శక్తులు గాని భూమికి అపాయము కలుగకుండ సనత్కుమారుడే నిర్వర్తించు చున్నాడు. దివ్యశస్త్రాస్త్రము లేవియు సనత్కుమారుని శక్తికి మించినవి కావు.



# 14

## శంబళ తత్త్వము


భూమి సహస్రారము నందు శంబళ గ్రామ మున్నది. దానినే 'శ్వేతద్వీప'మని కూడ సంబోధింతురు. మానవుని సహస్రారమునందు శంబళను దర్శింపవచ్చును. "నేనను" వ్యక్తిగత ప్రజ్ఞ "నేనను" ఈశ్వర ప్రజ్ఞతో అనుసంధానము చెంది ఈశ్వరుడే తానుగ నున్నాడు అను జ్ఞానము స్థిరమైనపుడు అట్టి తపస్వి శంబళ గ్రామస్థుడు కాగలడు. కలియుగమున ఇట్లు శంబళ గ్రామము చేరిన వారిలో మైత్రేయాది మహర్షులు ప్రథములు. ఆదిశంకరులు, గౌతమబుద్ధుడు ఇటీవలి కాలమున శంబళ అనుగ్రహము పొందినవారు.

శంబళ చేరుటకు తనయందలి ఈశ్వరుని చేరుటయే ప్రధానాంశము. సమస్త సిద్ధాంతములకు, ఆచారములకు అతీతమై మెలగుచుండు ప్రజ్ఞయే శంబళ ప్రవేశమున కర్హత సంపాదించు కొనును. నామరూపముల కతీతమైన తత్త్వమే శంబళ యందు ఆరాధింపబడును.

సహస్రారమునుండి ఆజ్ఞ, విశుద్ధి ద్వారమున హృదయము వరకు నేర్పడిన ఒక జ్యోతిర్మయమైన గదను అనునిత్యము ధ్యానము

చేయుచు, ఆ జ్యోతిర్మయ మార్గమున తాను సంచరించు చున్నట్లుగ ధ్యానమున భావన చేసినవారు శంబళ స్పర్శకు అర్హులు కాగలరు. ప్రస్తుత కాలమున ఈ జ్యోతిర్మయ మార్గము జిజ్ఞాసువులకు ఉన్ముఖమై యున్నది. కుంభయుగము భూమిపై క్రమముగ స్థిరపడుచుండగ శంబళ తత్త్వము తదనుగుణముగ భూమి నలుమూలలను వ్యాపించు చున్నది.

కుంభయుగమున తత్త్వపరమగు దైవమే ప్రధానముగ తెలియ బడుట, అట్టి తత్త్వముతో అనుసంధానము చెందుట జరుగును. ఈ మహత్తర కార్యము పరిపూర్ణము గావించుటకే ఇతర గోళముల సహాయమును కూడ శంబళ స్థిరపరచు చున్నది. కుంభయుగమున భూమి ప్రకృతి దివ్యప్రకృతిగ మారగలదు. ఇట్టి మార్పు చేరువులోనే యున్నది.



15

## స్థితప్రజ్ఞత్వము

శంబళ భూమియొక్క సహస్రారము. భూమిపై జీవుల పరిణామ కథను శంబళయే నడిపించుచున్నది. జీవులందరికిని జీవన ప్రయోజన మొకటున్నది. భౌతిక జీవనమును పరిపూర్ణముగ ఆస్వాదించి, దాని పరిమితత్వమును గ్రహించి, అటుపై జీవనమును ఆత్మపరముగ పరిపూర్ణము గావించుకొని, పరమాత్మను చేరుట ప్రధాన ప్రయోజనము.

శంబళను చేరుటకు భక్తి, జ్ఞాన, వైరాగ్య యోగములు తప్పని సరియై యున్నవి. వానిని క్రమబద్ధముగ అభ్యసించి, వాని ఆధారమున జీవించు సిద్ధులకు శంబళ పరిచయము కాగలదు. శంబళ చేరినవారు అపురూపమగు స్థితప్రజ్ఞత్వము పొందుదురు. దివ్యసంకల్పమును నిరంతరము భూమిపై నిర్వర్తించుచు నుందురు.

భూమిపై వలసిన సృజనాత్మక శక్తి, జ్ఞానము, క్రియాబలము శంబళ ఆరాధనమున లభించును.

మన సూర్యుని నుండి లభించు శక్తిని భూమిపై సరాసరిగ అందుకొను కేంద్రము శంబళ. దివ్యలోకముల నుండి భూలోకమునకు

దివ్యశక్తిని ప్రసారము చేయునది శంబళ. శంబళను స్మరించువారు సులభగతిని తమయందు ఇచ్ఛా జ్ఞాన క్రియా శక్తులను పొందగలరు.

మన సూర్యమండల మందలి శుక్రుని నుండి, సూర్యుని నుండి, సవితృ మండలము నుండి, సప్తర్షి మండలము నుండి, సారమేయ మండలము నుండి వెలువడు చైతన్యమును తానుగ అందుకొని, శంబళ భూమిపై పంచుచు నుండును.

శంబళ ప్రభువగు సనత్కుమారుని అనుయాయులగు జ్ఞానులు, యోగులు శంబళ తత్త్వమును భూమియందలి అన్ని జాతులకు నిత్యము పంచుచు నుందురు. ద్వాదశరాశి తత్వమును కూడ పంచుదురు.

# 16

## శంబళ ప్రజ్ఞ

సనత్కుమారుడు బ్రహ్మ మానసపుత్రుడు. అతడే సుబ్రహ్మణ్యుడు కూడ. ఆదిత్యలోకముల కావల వసించు సనత్కుమారస్వామి దివ్య ప్రణాళిక ననుసరించి భూమియందు వసించుటకు యిచ్ఛగించినాడు. త్యాగమునకు మారుపేరుగ నిలచి యున్నాడు. సింహాసనమును అలంకరించవలసిన చక్రవర్తి ఒక కుగ్రామమున, పామరుల నడుమ అతిహీనమైన సౌకర్యములతో వసించి, గ్రామస్థులను తీర్చిదిద్దుట ఎట్టిదో, సనత్కుమారులు భూమిపై వసించి భూమిజీవుల ఉద్ధారణము నకు కృషి సల్పుట అట్టిది. భూమిపై త్యాగమూర్తులుగ పేరు పొందిన వారెవ్వరును సనత్కుమారునికి సాటిరారు. అనునిత్యము ఊర్ధ్వ లోకముల నుండి ఉత్తమోత్తమ చైతన్యమును భూమికి, భూమిజీవులకు తన ముఖము నుండి, హస్తముల నుండి ప్రసరింపజేయుచు తనను తాను మరచిన పరమ పవిత్రమూర్తి.

అనంతకాలముగ త్యాగనిరతితో భూమిని పరిరక్షించుచున్న శంబళ ప్రభువును అనునిత్యము స్మరించుట, అతడికి నమస్కరించుట మన కర్తవ్యమై యున్నది. అతి సామాన్యులకు కూడ స్మరణ మాత్రము చేత శంబళ ప్రజ్ఞ సన్నిహిత మగుచున్నదని తెలియవలెను.

శంబళ, శంబళ ప్రభువుల అస్థిత్వము తెలియుటకు మానవుడొక జాతి రక్షకుడువలె ఎదగవలెను. ప్రతి ఒక్కరిని ఒక రక్షకునివలె తీర్చిదిద్దుటయే దీక్షగా సనత్కుమారులు పనిచేయుచున్నారు. భూమిపై పరిణామము చెంది, దైవములుగ ఆరాధింపబడుతున్న వారందరికిని దైవము సనత్కుమారుడు. దేవాలయము శంబళ గ్రామము.

శంబళ స్పర్శ పొందదలచినవారు యితరుల ఉద్ధారణకు నిస్వార్థముగ కృషి సలుపుట, ఇతరులను క్షమించుట, తమను తాము మరచుట సిద్ధింప చేసుకొన వలెను.



17

## మానవజాతి రక్షణ


శంబళ ప్రస్తుతము పరమగురువుల పరంపర నుండియే భూమిపై పనిచేయుచు నున్నది. మానవజాతికి శంబళ ప్రజ్ఞను గురుపరంపర అతి సున్నితముగ కౌశలముతో అందించుచున్నారు. శంబళ ప్రజ్ఞను సాధారణ మానవులు అందుకొనినచో, దాని ప్రభావమును భరింపలేక, అనేకానేక అపాయములకు గురియగుదురు. అపుడపుడు భూమిపై సర్దుబాట్లు చేయుటకై శంబళ ప్రజ్ఞ సరాసరి ప్రసారము చేయబడును. అపుడు అగ్ని పర్వతములు ప్రచోదన మగుట, సముద్రమున సునామీలు వచ్చుట జరుగుచు నుండును.

మానవజాతి పురోగతికి కూడ శంబళ ఒక్కొక్కమారు తన స్పర్శ నందించుచు నుండును. మానవజాతి పారిశ్రామిక దిశగ పయనించుటకు 1825వ సం॥న ఒక స్పర్శ నిచ్చినది. గత 175 సం॥లలో మానవజాతి పారిశ్రామికముగ చాల పురోభివృద్ధి సాధించినది. శాస్త్రపరమగు అనేక విషయములను గ్రహించినది.

ప్రపంచ యుద్ధములు మానవజాతి యొక్క మితిమీరిన ఆశ,

అసహనము, ద్వేషముల పర్యవసానము. అట్టి పర్యవసానము నుండి జాతిని రక్షించుటకు కూడ శంబళ సరాసరి తన ప్రజ్ఞను ప్రసరింపజేసి, జాతి అవగాహనను పెంచుచు నుండును. నూతన ఆశయముల నేర్పరచుచు నుండును. మానవ జీవన విధానమున అనేకానేక రంగములలో వికాసము కలుగుటకు విత్తనము వేయును. ఇట్టి సమయములలో గురుపరంపరకూడ అమితమగు కృషి సలుపును. కాలచక్రమున మానవజాతికి, భూగోళమునకు ఆపద సంభవించి నపుడు తండ్రివలె పరిరక్షించునది శంబళయే.

మనయందలి సహస్రార పద్మమున మహిమాన్వితమగు శంబళ గ్రామము ధగద్ధగాయమానముగ వెలుగుచున్నట్లుగ ధ్యానమున భావించుట, ఆ వెలుగే మనలను నడిపింపవలెనని ప్రార్థించుట శంబళతో అనుబంధము పెంచుకొను విధానము. ఓంకారమును అనుసంధానము చేయుట ఉపాయము.



18

## సర్వ సమర్పణము

జీవితమును సర్వహుత యజ్ఞముగ నిర్వర్తించుకొనువారికి శంబళ ప్రవేశము లభించును. సర్వహుత యజ్ఞమనగ తనను, తనకున్నది యితరుల హితము కొరకై నిస్సంకోచముగ సమర్పణ చేయుట. దీనిని పురుషమేధ యజ్ఞమని ఋషులు కీర్తించిరి. తమను తాము సర్వసమర్పణము చేసుకొనుట అసామాన్యమగు విషయము. లోకహితము కొరకై వెన్నెముకను సమర్పించిన దధీచి, దేహభాగము లను సమర్పించిన శిబిచక్రవర్తి, శరీరమును సమర్పించిన ఏసుక్రీస్తు మనకు ఉదాహరణలుగ గోచరింతురు.

దీనులను, హీనులను కాపాడుటలో తమనుతాము త్యాగము చేసుకున్నవారు శంబళ స్పర్శను పొందుదురు. త్యాగమూర్తులకు శంబళ సత్యమై నిలచియున్నది.

వ్యక్తిగతముగ తనకు జరిగిన అన్యాయమును క్షమించుట కూడ త్యాగమే. లోకహితము కొరకు అవసరమగు సంసిద్ధత, సమర్పణ త్యాగమునకు ప్రతీకలు. మహా భారతమందలి అసాధారణమగు వ్యక్తులలో యుధిష్ఠిరు డొక్కడు మాత్రము అట్టి క్షమాగుణమును

ప్రదర్శించినాడు. కనుకనే మహా ప్రస్థానమున అతడు ఉత్తర దిశగ పయనించి శంబళ చేరగలిగినాడు.

మనమెరిగిన పరమగురువు పరంపరలోని సభ్యులందరూ కూడ నిరుపమాన మగు త్యాగమును, క్షమను ప్రదర్శించిన వారే. ఇట్టి గుణములను నేర్చుట (ఆచరించుట) జ్ఞాన సముపార్జనముకన్న అత్యంత ప్రశస్తము. ఎంత చదివినను, ఎన్ని నేర్పులు నేర్చినను క్షమ, త్యాగములు లేనివారు పరిణామము చెందుట కల్ల.

శతాబ్దమునకు ఒకరిద్దరు త్యాగమూర్తులు తమను తాము త్యాగము చేసుకొనుట వలననే, ఆ పుణ్యఫలము బలమై, మానవజాతికి రక్షణను కల్పించుచున్నది.

తనయందున్న శంబళను తాననుసరించు వానికి యితరము లన్నియు అప్రధానములై, త్యజించి సాగుట యుండును. గౌతమ బుద్ధుడు శంబళనట్లే చేరెను.

## 19

## సర్దుబాట్లు

సాధారణముగ శంబళ శ్రావస్తి, కలాప గుహలలోగల పరమ గురువుల ద్వారమున వ్యక్తమై జీవపరిణామమునకు అవసరమగు సంకల్పశక్తి నిచ్చును. శంబళ సంకల్పము అమిత శక్తివంత మగుటచే, ఆ సంకల్పమును సరాసరి భూమిపై ప్రసరింపజేయుట– ఆత్మవంతులు శక్తివంతులు జ్ఞానవంతులు అగు పరమగురువుల ద్వారమున ప్రసరింపజేయబడును.

జీవపరిణామము వేగవంతము కావలసిన సందర్భ మేర్పడి నపుడు శంబళ సరాసరిగ తన శక్తిని భూగోళముపై ప్రసరింపజేయును. అట్టి సమయములందు భూమిపై యుద్ధములు, మారణహోమములు, జలప్రళయములు, అగ్ని పర్వతములు ప్రచండమగుట జరుగును. మార్పునకు కొంత విధ్వంసము తప్పనిసరి యగును. అట్టి సమయము లందు హిమాలయ గురుపరంపర వెనుకనుండి సర్దుబాట్లు చేయును.

దేహభాగమున కొంతభాగము రుగ్మతకులోనై, ఇతర భాగము లకు కూడ నష్టము కలిగించు సంబంధ మేర్పడినపుడు, రుగ్మత

చెందిన భాగమును శస్త్రచికిత్స చేసి, నిర్మూలించి యితర భాగములను పరిరక్షింతురు. శస్త్రచికిత్స చేయు వైద్యుని పని శంబళతో పోల్చదగినది. శస్త్రచికిత్స పిమ్మట జరుగు రక్షణ పోషణములు గురుపరంపర వర్తించు కార్యము వంటిది. మొత్తము కార్యము జీవునకు నూతన జీవిత మిచ్చుటకొరకే కదా! అదేవిధముగ శంబళ ప్రజ్ఞ, జగద్గురు ప్రజ్ఞ జీవులను రక్షించుచు పోషించుచు, అవసరమగుచో శిక్షించుచు, బోధించుచు దివ్యకార్యములు సలుపుచున్నారు. ఒక ప్రభుత్వమునకు శంబళ రాజువంటి ప్రజ్ఞ. మైత్రేయాది మహర్షులు అమాత్యులవంటి ప్రజ్ఞ. రాజు, రాజగురువు రాజ్యమును సుభిక్షము చేయుచున్నట్లు– సనత్కుమారులు, మైత్రేయులు మానవజాతిని పరిరక్షణము చేయుచున్నారు.



## 20

## శంబళ స్పర్శ

మారుచున్న కాలమును బట్టి కొన్ని సంప్రదాయములకు స్వస్తి పలుకుట సహజము. భవిష్యత్తునకు వినియోగపడని సంప్రదాయములు ప్రస్తుతమున నసింపు చెందుచు నుండును. సంప్రదాయములకు మార్పు సహజము. కాలమును, దేశమును, జీవన విధానమును బట్టి మార్పులు చేసుకొనుట ఉన్నతికి దోహదపడును.

ప్రయాణమున తెరచాపను గాలివాటమును బట్టి మార్చుకొనుచు, పడవ గమ్యమును చేరుటకు ప్రయత్నము చేయుదము గదా! అట్లే సంప్రదాయము జీవుని గమ్యము చేరుటకై వినియోగ పడవలెనే గాని అవరోధము కారాదు.

అతి ప్రాచీన కాలము నుండి ఎన్నియో నాగరికతలు భూమిపై వచ్చి పోయినవి. ప్రస్తుతమున గల నాగరికత కూడ భవిష్యత్తున మార్పు చెందును.

ఇట్టి మార్పులు అవసరమగుచో నిక్కచ్చిగ నిర్వర్తింపవలసి యుండును. అట్టి నిక్కచ్చి తత్త్వము శంబళ నుండియే ఉద్భవించును.

జీవుల శ్రేయస్సు నుద్దేశించి యిట్టి మార్పులు నిర్మోహమాటముగ చేయబడును.

శంబళ సంకల్పము భూమిపైగల నాలుగు జాతులను పరిణామమునకు గురిచేయును. ఖనిజములు, వృక్షములు, జంతువులు పరిణామము చెందుటకు వలయు ప్రజ్ఞ ప్రసారము జరుగుచుండును. నాల్గవ జాతియైన మానవుల యందు కొందరికి శంబళ స్పర్శ లభించి, మానవజాతియందు విశిష్టమగు మార్పులను చేయుటకు కృషి సల్పుదురు. వారినే నిర్మాణకర్తలుగను, దిశానిర్దేశకులుగను క్రమముగ మానవజాతి గుర్తించును. ఇట్లు మానవ పురోగతికి విశిష్టముగ తోడ్పడిన మానవులు జ్ఞాతాజ్ఞాతముగ శంబళ స్పర్శను పొందినవారు.

నాగరికత యందుగాని, సంప్రదాయముల యందుగాని జరుగుచున్న మార్పులను సవ్యమగు దృష్టితో అవలోకించుట ప్రధాన మని తెలియును.

## 21


## శంబళ శక్తి

సంకల్పశక్తిలో భాగమే జీవించవలెనను ఆసక్తి. కనుక జీవితమునకొక ఆశయ మేర్పరచుకొని, ఆ ఆశయ పరిపూర్తికొరకై జీవించువారికి సంకల్పశక్తి నుండియే ప్రాణశక్తి అందివచ్చు చుండును. ఏదియో ఒక పరమ ప్రయోజనము నుద్దేశించి పనిచేయు వారికి ప్రయోజనము పరిపూర్తియగు వరకు ప్రాణములుండును. ఈ సంకల్ప శక్తి మన భూమి వరకు శంబళ శక్తిగ ఋషులు గుర్తించిరి. శంబళ కారణముగనే భూమి ప్రయోజనము నిర్వర్తింపబడు చున్నది. భూమి ప్రాణము కూడ ఈ శక్తి ననుసరించియే పనిచేయుచున్నది. శంబళ శక్తి వలననే భూమిపై ఖనిజములు, వృక్షములు, జంతువులు, మానవులు వృద్ధి చెందుచున్నారు. మానవులయందు కూడ తమ సంకల్పము అను భావముతో ప్రతిజీవి తనదైన జీవితమును నిర్వర్తించుకొనుటకు శంబళ శక్తియే కారణము.

ప్రయోజనము లేనపుడు జీవుని ప్రాణశక్తి సన్నగిల్లును. కనుకనే పదవీ విరమణ చేసిన మానవులు మరియొక ప్రయోజనము నేర్పరచు కొననిచో త్వరితముగ వృద్ధులగుదురు. మరణింతురు కూడ. అట్లే

శంబళ శక్తి భూమిపై సన్నగిల్లినచో భూమి క్రమముగ శిథిలము కాగలదు.

ఎప్పటికప్పుడు శంబళ నూతన తరంగములను భూమిపై ప్రసరింపజేయుచు నుండును. తత్కారణముగ నూతనోత్సాహము, నూతన శక్తిని పొంది, మానవజాతి వినూత్నమగు కార్యక్రమములను చేపట్టి, జీవనము శక్తిమంతముగ చేసుకొనుచున్నది. భూమి చుట్టును ఉపగ్రహముల నేర్పరచుకొనుట, అంతర్‌గ్రహ ప్రయాణములు, నూతన పరిశోధనలు, నూతన సాంకేతిక ప్రయోజనములు, యిత్యాది కార్య క్రమము లన్నియు జీవనమునకు నవ్యత్వ మాపాదించుకొనుటకే. ఎప్పుడు నిత్య నూతనముగ జాతి పురోగమించుటకు వెనుక నుండి ఊత మిచ్చుచున్నది శంబళ సంకల్ప శక్తియే.



## 22

## ప్రచోదనము


భూమిని పవిత్రీకరించుట, పాపగ్రహముగ అవస్థితి చెంది యున్న భూమిని దివ్యగ్రహముగ నుద్ధరించుట, భూమి కాలుష్యము లను నిర్మూలించుట, భూమిని పుణ్యభూమిగ నేర్పరచుట కర్తవ్యముగ శంబళ యున్నది. తమను తాము పవిత్రీకరించు కొనుచు, తమ పరిసరములను గూడ పవిత్రము చేయువారికి శంబళ శక్తి తోడ్పడును. పవిత్రత అంతర్ముఖముగను, బహిర్ముఖముగను నిర్వర్తించవలసిన బాధ్యత ప్రతి మానవునకు ఉన్నది. భావనము, భాషణము, వర్తనము నందు పవిత్రతను శంబళ ఆశించును. అట్టి పవిత్రులకు శంబళ తోడ్పడును. భూమి, నీరు, గాలి అపవిత్రము చేయుట మానవజాతి అజ్ఞానమునకు సంకేతము. భాషణా కాలుష్యము, భావనా కాలుష్యము కూడ జాతి అజ్ఞానమును వెల్లడి చేయును. పవిత్రత, స్వచ్ఛత శంబళ కోరు ప్రధాన లక్షణము.

మితిమీరిన అపవిత్రత భూమిపై నేర్పడినపుడు, అట్టి స్థితినుండి భూమిని రక్షించుటకు శంబళ కొంత విధ్వంసమును సృష్టించును.

అపవిత్రతకు కారణమైన సమస్తమును ధ్వంసముచేసి, మరల పవిత్రతకు శ్రీకారము చుట్టును.

వాతావరణమును పవిత్రము చేయుటలో శంబళ అగ్రగామి. సంగీతము, శబ్దోచ్చారణము ఆయుధములుగ మూడు లోకములను పవిత్రము చేయగల జ్ఞానము శంబళయందున్నది. కృష్ణుని వేణు గానము, అపోలో తంత్రీగానము, వేదవ్యాసుని ఛందోబద్ధమగు స్తోత్రములు, వేదపండితుల స్వరయుక్త వేదోచ్చారణము శంబళ ప్రచోదనము. పై తెలిపిన రెండు ఆయుధములు ప్రాణశక్తిని, జీవశక్తిని యినుమడింప జేయగలదు.

శంబళ భూమితో యున్నదిగాని, భూమిలో లేదు. శంబళను ఏశక్తియు బంధింపలేదు. స్వచ్ఛందముగనే శంబళ భూమితో కూడి, భూమిని చైతన్యవంతము గావించుచున్నది.



# 23

## దివ్య ప్రణాళిక

దివ్య ప్రణాళిక శంబళ నుండియే భూమికి దిగివచ్చును. సనత్కుమార ప్రభువు కేంద్రముగా అతని అనుయాయులు ముమ్వురు మరియు గౌతమబుద్ధుడు ఒక చతుర్భుజముగ నేర్పడి, సనత్కుమారుని ద్వారా భూమికి దిగివచ్చు దివ్య ప్రణాళికను ప్రసరింపజేతురు. ముమ్వురు అనుయాయులు సనత్కుమారుని మూడు శక్తులుగ (ఇచ్ఛ–జ్ఞాన–క్రియ) నిత్య మనుసరించుచు ధ్యానమున నుందురు. వీరిని ధ్యానీ బుద్ధులు అని బౌద్ధమతస్థులు పిలుతురు. సనత్కుమార ప్రభువు నుండి ఈ ముమ్వురును దివ్య సంకల్ప మందుకొని గౌతమబుద్ధుడు వాహికగ మైత్రేయాది గురుపరంపరకు ప్రజ్ఞా ప్రసారము చేతురని, అదియే 'మహా వైశాఖి' ఉత్సవముగ ఉత్తర హిమాలయ లోయలలో నిర్వర్తింపబడునని ప్రాచీన గ్రంథముల యందు లిఖింపబడి యున్నది. వైశాఖ పౌర్ణిమ గడియలలో ప్రతి సంవత్సరము ఈ కార్యము నిర్వర్తింపబడునని ప్రతీతి.

సనత్కుమార ప్రభువు అధ్యక్షునిగ, ధ్యానీబుద్ధులు, గౌతమ బుద్ధుడు మాధ్యమముగ దివ్యలోక సంకల్పము పృథివీ తత్వపు

రాశియైన వృషభ రాశియందు బీజప్రాయముగ భూతలమునకు వైశాఖ పౌర్ణిమ గడియలలో అందింపబడుచున్నది. మైత్రేయాది గురుపరంపర యజ్ఞార్థము ఈ సంకల్పము ఒక మాసము ధరించి, ఆకళింపు చేసుకొని తమ అనుయాయులకు జ్యేష్ఠ పౌర్ణిమ సందర్భముగ ఈ ప్రణాళిక నందింతురు. భూమి నలుచెఱగుల పరమగురువుల అనుయాయులు దివ్య ప్రణాళికను యజ్ఞార్థముగ ఒక సంవత్సరము పాటు నిర్వర్తించి, మరల జ్యేష్ఠ పౌర్ణిమ నాడు నూతన సంకల్పమునకై ఉన్ముఖ మగుదురు.

పై కారణముగ వైశాఖ, జ్యేష్ఠ పౌర్ణిమలు అత్యంత పర్వ దినములై యున్నవి.



# 24

## మహా వైశాఖి

సనత్కుమార ప్రభువు భూమి సహస్రారము నందు ఊర్ధ్వలోక ప్రతినిధిగ యజ్ఞార్థము వసించి యున్నారు. నూతన సంవత్సర ఆరంభమున రాబోవు సంవత్సరమునకు బీజప్రాయముగ దివ్య సంకల్పము లందించుటకు వారు ధ్యాన నిమగ్ను లగుదురు. వైశాఖ మాసమున సూర్యుడు కృత్తిక, రోహిణి నక్షత్రముల యందు సంచరించు చుండగ, ఊర్ధ్వలోకముల నుండి సంకల్పము దిగిరాగ, అత్యంత ప్రియముగ దానిని స్వీకరించి, సమన్వయించి ధ్యానిబుద్ధులకు అందజేయుదురు. చంద్రుడు అదే మాసమున విశాఖ, అనూరాధ నక్షత్రములలో సంచరించు సమయమున దివ్య సంకల్పమును మైత్రేయాది పరంపర కందింతురు.

వైశాఖమాసము లేక వృషభరాశి యందు కృత్తిక, రోహిణి అత్యంత శక్తివంతమగు నక్షత్ర భాగములు. ఈ నక్షత్రభాగముల నుండియే ఊర్ధ్వలోకముల నుండి దిగివచ్చు ప్రజ్ఞ శంబళ ద్వారా భూమిని చేరును. కృత్తికను కత్తెర్లని, రోహిణిని రోళ్ళు కూడ పగిలెడి సూర్యప్రజ్ఞగ సామాన్యులు కూడ గుర్తింతురు. సూర్యతేజస్సు అత్యంత

శక్తివంతముగ ప్రకాశించునది ఈ నక్షత్ర విభాగ సంచారమునందే. అది దాదాపు 27 దినములు సాగును. ఈ సూర్యతేజస్సును సత్సాధకులు ధ్యానమార్గమున అపారముగ గొనవచ్చును. కనుక ఈ కాలమును అత్యంత భక్తి శ్రద్ధలతో ధ్యానమునకే వినియోగింప వలెను. వృషభరాశియందలి ఈ నక్షత్రములు విష్ణు సహస్రనామము లందు కూడ "వృషభాక్షో వృషప్రియః" అని కీర్తించినారు.

కృత్తిక, రోహిణిలలో సూర్య సంచారము ద్వారా అందింపబడు దివ్య ప్రజ్ఞను విశాఖ, అనూరాధ నక్షత్రములలో చంద్రుడు సంచరించు చుండగ, భూమికి ఆహ్లాదము కలుగు రీతిని భూమిపై ప్రసరింప జేయుట 'మహావైశాఖి' క్రతువు సారాంశము.

# 25

## సమన్వయము

శంబళ నుండి ప్రసారమగు ప్రజ్ఞ యందు సప్త కిరణ ప్రభావము అమితముగ నుండును. సప్త గ్రహముల నుండి తదనురూపమగు లక్షణములు తానుగ గ్రహించి భూమండలముపై శంబళ ప్రసరింపజేయును. భూగోళము యితర గ్రహముల నుండి పొందు సహకారమును శంబళ యినుమడింప జేయును.

శంబళ నుండి ప్రసారమగు సప్తకిరణముల ప్రభావము భూమిపై గల సప్త ఋషుల ఆశ్రమములను, ఆశ్రమవాసులను ప్రభావితముచేయగ, ఆ ఆశ్రమవాసులు భౌగోళికముగ బాధ్యతతో ఆయా ప్రజ్ఞలను పరిసరములకు నిశ్శబ్దముగ  అందింతురు. ఈ సమస్తము సనత్కుమార ప్రభువుల అధ్యక్షతన సునిశితముగ నిర్వర్తింపబడు చుండును.

దివ్యలోకముల నుండి భూమికి అందివచ్చు అనేకానేక ప్రజ్ఞలను శంబళ సమన్వయించి భూమి కందించుట ఒక మహత్తర బాధ్యతగా  స్వీకరించి నిర్వర్తించును. ద్వాదశ రాశుల నుండి, ఇరువది ఏడు (27) నక్షత్రముల మండలము నుండి, సప్తఋషి మండలము

నుండి, కృత్తిక మండలము నుండి, దక్షిణమునగల శారమేయ మండలము నుండి, అష్టదిక్పాలకుల నుండి అనేకానేకమగు శక్తివంత మగు ప్రసారములు భూమి కేతెంచుచు నుండును. వీని నన్నిటిని గ్రహించి, సమన్వయించి, భూమి స్వీకరించుటకు అనువైన పద్ధతిలో శంబళ కృషి సల్పుచున్నది. భావ సమన్వయము, సిద్ధాంత సమన్వ యము, మత సమన్వయము, మానవజాతుల సమన్వయము బీజ ప్రాయముగ భూమిపై ప్రస్తుతము శంబళ నిర్వర్తించుచున్నది. మానవజాతి జాతి మత కుల భేదములు లేక సమన్వయముతో, సమభావముతో మెలగుటకు ప్రస్తుతము శంబళ అవిరళముగ కృషి సలుపుచున్నది. కలి ప్రభావమును నిర్వీర్యము చేయుటయే ప్రధానముగ శంబళ కృషి సలుపుచు నున్నది.

26

## కలిహరణము

కలి కల్మషహరణమునకు, కలి ప్రభావము నుండి తరించుటకు శంబళను స్మరించుట ప్రధానము. శంబళ నుండియే కలి అంతమగునని పురాణములు ఘోషించు చున్నవి. ఎచ్చట శంబళ స్మరింపబడుచుండునో అక్కడ కలి నిర్వీర్యమై యుండును. శంబళ ప్రజ్ఞ కల్కి ప్రజ్ఞ. కల్కి కలికి విరుగుడు. కలిని నిర్జీవము చేయుటయే శంబళ చేయు నిరంతర కృషి. ధర్మాధర్మములు, జ్ఞానా జ్ఞానములు, అలుపెరుగని పోరు భూమిపై సలుపుచు నుండును. దీనినే దేవాసుర నిరంతర యుద్ధముగ ఋషులు తెలిపిరి. అసురులు దేవతల నాక్రమించు ఉద్యమము ఎప్పుడునూ భూమిపై సాగుచు నుండును. అసురులను నిర్జించుటకు, సురలకు ఎప్పటికప్పుడు విష్ణు సహాయము అవసరమై యుండును. చెడుకున్న బలము మంచికి లేదు అనుట యథార్థము. సురలకన్నా అసురులెప్పుడునూ బలవంతులే. కనుక అసురత్వము (అజ్ఞానము) సురత్వముపై (జ్ఞానముపై) దాడి సలిపినపుడు సురలు దైవము నాశ్రయించుట, దైవబలమున అసురులను నిర్జించుట శాశ్వతమగు కథ. దైవము స్థితికారకుడైన విష్ణువుగ సురలకు

బలము కలిగించు అసురులను వారి స్థానములకు పరిమితము చేయును.

అట్టి విష్ణుతత్త్వము దిగివచ్చుటకు భూమిపై కేంద్రముగ శంబళ యున్నది. శంబళ భూమికి పాలనా కేంద్రమగుట చేత పృథివీపతి యగు విష్ణువునకు పీఠముగ నున్నది. శంబళయంతయు విష్ణు ప్రభావముతో కూడి యున్నది. విష్ణుయశస్సు శంబళ నెప్పుడు నాశ్రయించి యుండును. అట్టి విష్ణు యశస్సే అవసరమగునపుడెల్ల రూపమును దాల్చి ధర్మ సంస్థాపనము చేయును. కల్కి అవతారము కూడ శంబళ నుండియే ఆవిర్భవించి కలిని నిర్జీవము చేయునని పురాణములలో తెలుపుటలోని రహస్యమిదియే. శంబళ స్మరణమున కలిహరణము జరుగుట తథ్యము.

27

## పవిత్రీకరణము


శంబళ శక్తి భూమిపై దివ్యత్వము అవతరించుటకు నిత్యము కృషి సలుపుచు నుండును. శంబళ నుండి వీచు గాలియందు శక్తివంతమగు తరంగములు సనత్కుమారునిచే ప్రవేశపెట్టబడు చుండును. తత్కారణముగ అవరోధములు ఛేదింపబడు చుండును. శంబళ వాయువులు అత్యంత పవిత్రములు మరియు శక్తివంతములు. శంబళను స్పృశించిన వాయువులు పవనులుగ మారుదురు. పవనులు మరుత్తులలో దివ్యమగు వాయువు. "మరుత్తులలో పవనుడను నేను" అని భగవానుడు గీతయందు పలికినాడు. శంబళను స్పృశించిన వాయువు నిర్మలత్వము ప్రసాదింప గలిగిన వాయువై యుండును. శంబళను స్మరించుచు గాలి పీల్చినపుడు జీవుని పవిత్రీకరించు వాయువుగ ప్రాణవాయువు దేహమున చేరును. ఇది ఒక రహస్యము.

శంబళ వాయువునందు తేజస్సు నిబిడీకృతమై యుండును. కనుక పవిత్రీకరణమే కాక సాధకులను తేజోవంతులుగ కూడ తీర్చిదిద్ద గలదు.

భూమిపై కష్టనష్టములు, దుఃఖములు అధికముగ నుండుట

సహజము. భూమి, అందలి జీవులకు పాఠశాల వంటిది. పాఠశాల యందు శిక్షణతోపాటు శిక్షకూడ అమలు జరుపబడును. ఇట్లు శిక్షకు గురి కాబడిన జీవుడు శంబళను స్మరించుట వలన పునీతుడై కష్ట నష్టముల నుండి, దుఃఖముల నుండి కడతేరగలడు.

ప్రత్యేకించి వైశాఖమాసమందలి సూర్య కిరణముల ద్వారా కూడ శంబళ తన ప్రజ్ఞను ప్రవేశింపజేయుచు నుండును. వైశాఖ మందలి సూర్య కిరణములను దివ్య వృషభములుగ కీర్తింతురు. ఆ కాంతి కిరణములను వైశాఖమందు బడయుట కూడ సాధకులకు ఊతమిచ్చును. శంబళ, సనత్కుమారుల స్మరణము అధికముగ వైశాఖమున గావించుకొనవలెను.



28

## వెలుగు ప్రవేశము

యమ గ్రహమును, భూ గ్రహమును వృషభరాశితో సంధించి, సనత్కుమార ప్రభువు భూమిని త్వరితగతిని పరిణమింపజేయు చున్నాడు. వృషభరాశి కిరణములందు సప్తర్షి మండల ప్రభావము, కృత్తికామండల ప్రభావము ఎట్లునూ భూమిని చేరుచు నున్నవి. వానిని యముని తరంగములతో జోడించుట వలన భూమిపై శిక్షణా కార్యక్రమము అధికమైనది. మొదటి ప్రపంచ యుద్ధమునుండి క్రమముగ భూమిపై సర్దుబాట్లు అధికమైనవి. వరుణ గ్రహ ప్రభావము వలన త్వరితమైనవి కూడ. శంబళ ప్రభువు వైశాఖమునందలి వృషభ తత్త్వమును దూసుకొనిపోవు వృషభముగ తీర్చిదిద్దుట ఒక విశేషము. తత్కారణముగ భూమిపై వేడిమి పెరుగు చున్నది. వేడిమి కారణముగ అనేకమగు మార్పులు జరుగుచున్నవి. భూమిపై జలముల తలము తగ్గుట కూడ ఈ ప్రణాళిక యందలి భాగమే. భూగర్భజలములు తగ్గుచు నుండుట, ధృవములయందు మంచు కరుగుట యిత్యాది వన్నియు వేడిమి కారణముగనే జరుగుచున్నవి.

మానవ శరీరమునందు కూడ నీటి ఆవశ్యకత తగ్గుచునున్నది.

క్రొత్త తరముల మానవులు మునుపటి తరములవలె నీరు త్రాగుట లేదు. శరీరమందు దాహార్తి తగ్గుట గమనింపవచ్చును. ప్రత్యేకముగ సాధకులయందు దీనిని గుర్తింపవచ్చును. వెలుగు ప్రవేశము శంబళ వాయువులనుండి, సూర్యకిరణములనుండి అధికమగు చుండగా, ప్రాథమికముగ పదార్థమునందు వేడిమి పెరుగుచు నున్నది. వెలుగు ప్రవేశమునకు పూర్వకథగ వేడి హెచ్చుగుట శంబళ యొనర్చు ప్రక్రియలలో నొకటి. యముని శిక్షణమును కూడ సనత్కుమార ప్రభువు యుక్తిగ నిర్వర్తించుట ఒక విశేషము.



29

## దివ్య ప్రయత్నము

ప్రపంచమునందు జీవులకు వ్యామోహము అధికమై యుండుటవలన శంబళ నుండి జరుగు ప్రసారము వక్రీభవించుట పరిపాటియైనది. సత్సాధకులము అనుకొనెడి వారు కూడ వ్యక్తిగత వ్యామోహములకులోనై యుండుట వలన, సత్సంకల్పము వక్రీభవించు చున్నది.

సత్పురుషులు, సత్కార్యములు చేయువారు, సంఘమునకు మేలుకోరువారు కార్యముల ద్వారా తమ వ్యక్తిత్వము పెంచుకొను వ్యామోహములో పడియుండుట వలన వారి కార్యముల ప్రభావము పరిమిత మగుచున్నది. సత్కార్యములతోపాటు తమ కీర్తి ప్రతిష్ఠలు కూడ పెంచుకొను అంతర్హిత భావము సత్సంకల్పమును వక్రీకరించు చున్నది.

పరమగురువుల బృందములు ఎంత కృషి సలుపుచున్నను, శిష్యబృందములు వ్యామోహ ఆవరణమును దాటి స్వచ్ఛముగ కార్యములు నిర్వర్తింప లేకున్నారు. స్వభావమందలి వ్యక్తిగత వ్యామోహములు దాటలేకపోవుట వలన శంబళ సంకల్పము వక్రమై

అవతరించు చున్నది. "నానాజాతి సమితి", ఐక్యరాజ్య సమితి" వంటి మహత్తరమైన భౌగోళిక శ్రేయోదాయకమైన సంకల్పములు కూడ నిర్వీర్యమగుట  కన్పట్టుచునే యున్నది. ఉదాత్త భావములు, ఉన్నత భావములు ఎప్పటికప్పుడు అందింపబడుచున్నను సమైక్యత మృగ్యమై విపత్తుల నాహ్వానించు చున్నది.

దివ్యప్రణాళిక ఐక్యత నుద్దేశించి సంకల్పములను చొప్పించి నను, అది వక్రతచెంది విభజనలు పెరుగుచున్నవి. ఐరోపా ఖండ ఐక్యతను గూర్చి శతాబ్దముల తరబడి సూక్ష్మలోకముల యందు ప్రయత్నము సాగుచుండగ, నేటికిని అది ఎండమావియై నిలచినది. అట్లే ఆసియా ఖండము నందుగాని, యితర ఖండములందు గాని ఐక్యతాభావము తరుగుట, వేర్పాటు భావము పెరుగుట కలి ప్రభావమై శంబళను ధిక్కరించు చున్నది. సామరస్య మార్గము లేవియు పరిష్కారము లేకపోవుట కలియుగమున సహజమే అయినను దివ్య ప్రయత్నము కొనసాగుచునే యున్నది.

30

## దివ్యావతరణము

మకరరాశి, ఉత్తరాయణ పుణ్యకాలమందు దేవత లుద్భవించి విజృంభింతురని, మకరము దేవతలకు పుట్టిల్లని, దివ్య సంకల్పములకు మూలమని వేద సంప్రదాయము తెలుపుచున్నది. ఈ సమయముననే శంబళ గురుపరంపరకు వలసిన సంకల్ప బీజములను సూక్ష్మముగ నాటునని, పరంపరాగత సభ్యులకు నూతన తేజస్సును చేకూర్చునని జ్వాల్‌కూల్ మహర్షి తెలిపియున్నారు. భూమిపై దివ్య సంకల్ప అవతరణకు వలసిన బీజము లన్నియు మకరమునందే అంకురార్పణ జరుగునని కూడ తెలిపియున్నాడు. పరమగురువులు ఉత్తరాయణ పుణ్యకాల సందర్భమున శంబళతో తమ సంబంధమును పటిష్ఠము గావించుకొని కార్యములు నిర్వర్తింతురని తెలియజేసినాడు.

డిసెంబరు 22 రాత్రి జరుగు క్రతువుతో పరమగురువు పరంపర శంబళతో అనుసంధానము చెందు క్రతువు నిర్వర్తింతురని, సూత్ర ప్రాయముగ శంబళతో ముడిపడుదురని పరమగురువు తెలిపి యున్నాడు.

శంబళ సంకల్పమును భూమిపై నిర్వర్తించుటలో భాగముగ

పుష్య మాసమంతయు అను సంధానమునకై పరమగురువుల పరంపర వినియోగించును. మకరరాశి సూర్యోదయ కాంతులు శంబళమీదుగా పరమగురువు లందుకొని జగద్రక్షకుని స్ఫూర్తిని పొంది, భూమిపై త్యాగనిరతితో పరమగురువులు కార్యక్రమము నిర్వర్తించుచు నుందురు. భూమిపై గల పవిత్ర క్షేత్రము లన్నిటికిని పవిత్రమగు క్షేత్రము శంబళ. మానవుల సహస్రార పద్మమందు శంబళ స్పర్శ లభింపగలదు. పరమగురువులు సహస్రారమును చేరి, శంబళ నుండి అందివచ్చు సంకల్పములు నిత్య ప్రార్థనల ద్వారా అందుకొని తమవంతు కర్తవ్యమును నిత్యము నిర్వర్తించు చుందురు. శంబళకు పరమ గురువుల పరంపర విలువైన మాధ్యమము. వారి నుండే దివ్యావతరణము భూమిపై జరుగు చుండును. మానవజాతి యొక్క అన్ని రంగముల కార్యకలాపముల యందును పరమగురువు బృందముల సభ్యులు వుండి యథోచితముగ ప్రచోదనము చేయుచు నుందురు. శంబళ, శ్రావస్తిల అనుసంధానమే మానవజాతి ఉద్ధారణకు కలి యుగమున మిగిలిన ఏకైక ఉపాయము.



# 31

## శంబళ వాక్కు


శంబళకు, శ్రావస్తికి గల సూక్ష్మము, దివ్యము అగు సంబంధము ఇచ్ఛా జ్ఞాన సంబంధము. సహస్రారమునకు, ఆజ్ఞకు, హృదయమునకు గల సంబంధము. ఈ సంబంధము ప్రేమ-జ్ఞానముల సమ్మిళిత సూత్రమై విరాజిల్లుచున్నది. కేవలము శ్రావస్తి వాసులే శంబళ కార్యక్రమమును తెలియగలరు.

శంబళకు శ్రావస్తియే ముఖద్వారము. శ్రావస్తికి భూమిపై సప్తకేంద్రము లున్నవి. శంబళ నుండి శ్రావస్తికి చేరు వాక్కు శ్రావస్తి నుండి సప్త భూకేంద్రములకు తెలుపబడును. అటుపైన శంబళవాక్కు అంతరంగ వాసులైనటువంటి శిష్యపరంపరకు చేరును. ప్రపంచము నకు వాక్కు వైఖరిగ అందింపబడును. ఇదియొక పవిత్ర యజ్ఞము.

దివ్యలోకముల నుండి వ్యక్తమగు పరావాక్కు శంబళయందు పశ్యంతియై, శ్రావస్తి ద్వారా సప్తకేంద్రములకు మధ్యమా వాక్కుగ లభించును. శిష్యపరంపర నుండి వైఖరిగ ప్రపంచమున ధృవపడును.

భగవంతుని వాక్కు భూమిపై అవతరింప చేయుటయే దివ్యప్రణాళిక. దాని ప్రయోజనము జీవోద్ధరణము. తద్వారా భూమి

ఉద్ధరణము కూడ. వాక్కును అవతరింపజేయుటకు వలసిన శబ్దము "శం". శంబళయందు, శ్రావస్తియందు, శాస్త్రయందు 'శం' శబ్దమును దర్శింపవచ్చును. 'శం' శబ్దమునకున్న బలము అనిర్వచనీయము. స్థిరపరచుటకు మూడు లోకముల యందును 'శం' శబ్దమునే 'తెలిసి' వినియోగింతురు. కనుకనే 'శం'కరుడు పరమపూజ్యుడుగ వేదము కీర్తించు చున్నది. 'శం' శబ్దముతోనే శనైశ్చరుడు సూర్య మండలమును సైతము స్థిరపరచు చున్నాడు.



## 32

# మకరజ్యోతి

రెండువేల సంవత్సరముల క్రితము భూమిపై ఒక అద్భుతము జరిగినది. జగద్గురువు మైత్రేయులు నిర్వర్తించుచున్న ప్రేమ – జ్ఞాన యజ్ఞమునకు సనత్కుమార ప్రభువు నిర్వర్తించుచున్న ధీశక్తి ఇచ్ఛాశక్తిగ తోడైనది. ప్రేమ, జ్ఞానములకు ఇచ్ఛాబలము తోడగుటవలన ప్రేమ, జ్ఞానములు ఇచ్ఛాబలముతో కూడి భూమిపై అవతరించుటకు ద్వారములు తెరువబడినవి. జ్ఞానమార్గమునకు నిర్దిష్టమగు దిశా నిర్దేశము అందింపబడినది. అది కారణముగ దివ్యావతరణమునకు మార్గము సుగమమైనది.

ఇచ్ఛా జ్ఞానముల సమ్మిళితము ఒక అద్భుత జ్యోతిగ అవత రించినది. దానినే పరమగురువుల ఆశ్రమములందు మకరజ్యోతిగను, పుష్యమీ చంద్రునిగను భావించుట జరిగినది. పుష్యమీ చంద్ర విభ్రాజిత కాంతియే మకరజ్యోతి.

చంద్రుడు పుష్యమీ నక్షత్రము నందు ప్రవేశించినపుడు, సూర్యుడు ప్రతి సంవత్సరము పదునాలుగు దినములు పుష్యమాసము నందు శ్రవణమున వర్తించునపుడు ఈ మకరజ్యోతి దర్శనము

అంతరంగమున జరుగును. దీనిని నిర్వర్తించు దివ్యప్రజ్ఞ శనీశ్వర ప్రజ్ఞ. శనైశ్చరుడు పుష్యమాసమున కధిపతియగుట చేతను, తత్త్వము నవతరింపజేయుటకు ప్రధాన అధికారి అగుట చేతను అతనిని పుష్యమాసము లేక మకరరాశి యందు మకర దేవతగ పరమ గురువులు పూజింతురు.

ప్రేమ–జ్ఞానములను పశ్చిమ ఖండమున పంచుటకై నియమింపబడిన ఏసు శిలువ వేయబడుటకు మునుపు సీమతోటలో తటపటాయించుచు తిరుగుచుండగ, ఈ మకర జ్యోతియే ఏసు నాశ్రయించి అతనిని శిలువ వేయబడుటకు సంసిద్ధుని చేసెను. అట్టి సంసిద్ధత వలననే ఏసు స్వచ్ఛందముగ సైనికులకు పట్టుబడి శిలువనెక్కి పునరుత్థానము పొందెను. ఈ ఘట్టము ద్వారా ఏసు అవతార పురుషుడనియేగాక మానవజాతికి మహోపకారము జరిగెను. ఇచ్ఛా జ్ఞానములు మిళితమై భూమిపై చురుకుగ మానవజాతి పరిణామము సాగుటకు ద్వారములు తెరువబడెను. నూతన శకమొకటి ఆరంభ మయ్యెను. కలియుగమున అనాహతము చేరు జీవులకు దివ్యసూత్ర మొకటి లభించి ఆజ్ఞను, సహస్రారమును చేరుటకు సౌలభ్యము పెరిగెను. అట్లే "అంతేవాసులకు" సహస్రారము నుండి అనాహతము నకు పరావాక్కు సూటిగ తెలియు సౌలభ్యము కలిగెను. ఈ సౌలభ్యము విలువ తెలిసిన వారికే తెలియును. తెలియని వారికి తెలియదు.

33

## శంబళ ప్రార్థన

శంబళయందు ఈ ప్రార్థన నిత్యము ప్రాతః సమయమందు, సాయం సమయమందు నిర్వర్తింపబడు చున్నది. ఈ ప్రార్థన ప్రయోజనము దివ్య సంకల్పమును భూమిపై అవతరింపజేయుట. శంబళ సభ్యులచే నిర్వర్తింపబడు ఈ ప్రార్థనను పురోహితుడై నిర్వర్తించునది శంబళ ప్రభువగు సనత్కుమారుడే. ప్రార్థనానంతరము బృందమంతయు ప్రార్థనా తరంగములను సూర్యకిరణముల వలె భూగోళము మొత్తము వ్యాపింపజేయుదురు. సాధుజనులచే అవతరింప జేయుదురు. భూమి జీవులయందు శంబళకుగల అవ్యాజమగు ప్రేమయే ఈ ప్రార్థన నిర్వర్తింపబడుటకు కారణము. దీని ప్రయోజనము ద్విజులకు మాత్రమే తెలియును. ద్విజులనగా మరల పుట్టినవారు. అనగా వెలుగునందు పుట్టి, వెలుగు శరీరములు ధరించినవారు.

పై తెలిపిన సాధుజనులలో అగ్రేసరుడు జగద్గురువగు మైత్రేయుడు. అతడు, అతని అనుయాయులు క్రింద తెలుపబోవు ప్రార్థనా బలమును స్వీకరించి కార్యరూపము లోనికి అవతరింప జేయుదురు.

## శంబళ ప్రార్థన :

“నేను ఒంటరిగ వెలుగు స్తంభమున నిలచి యున్నాను. నా యందలి బ్రహ్మదండమే నా వెలుగు స్తంభము. నా సహస్రారము ద్వారా దివ్య సంకల్పములు గర్భితము గావించుకొను చున్నాను. నన్ను పరిపూర్ణుడను గావించుకొనుచు, నా సహాధ్యాయుని గూడ పరిపూర్ణునిగ గుర్తించుచు మేమందరము బృందముగ అందివచ్చిన దివ్య సంకల్పమును వరకట్నముగ భూవలయమున ప్రవేశింపజేయు చున్నాము. ప్రతిఫల మాశించని ఈ వరకట్నము మానవజాతిని మేలుకొలుపుటకై వినియోగపడును.”

## 34

# పవిత్రీకరించుట

సనత్కుమార ప్రభువు యొక్క ప్రధాన కర్తవ్యము భూగ్రహమును పుణ్యగ్రహము చేయుట. తద్వారా భూలోకవాసులు కూడ పుణ్యలోక వాసులై వర్ధిల్లగలరు.

ప్రపంచమందు జరుగు దైవీబోధలు అన్నియు కూడ జీవులను పుణ్యమూర్తులుగ చేయుట కుద్దేశింపబడినవే. శంబళ భూమిని గూడ పుణ్యభూమిగ చేయుటకు కృషి సలుపుచున్నది.

భూమి మండలమందుగల పంచభూతములను పరిశుద్ధి గావించుచు, భూ తమస్సును హరించుచు, భూ రజస్సును అయస్కాంతీ కరణము చేయుట శంబళ ఆశయమై యున్నది. స్థితి కారకుడైన శ్రీమహా విష్ణువు భూమిని రసాతలము నుండి ఉద్ధరించి, అంతరిక్షమున నిలిపెను. దానిని పవిత్రీకరించుట అను కార్యక్రమము అనంతకాలము నుండి శంబళ నిర్వర్తించు చున్నది. మానవజాతి కార్యకలాపములు ఈ శంబళ కార్యములకు విరుద్ధముగ పరిణమించుచు కార్యములు క్లిష్టము చేయుచున్నది. కలియుగమున ఈ కార్యమత్యంత క్లిష్టమైనను శంబళ ధీరతతో ఆశయసిద్ధికై కృషి చేయుచున్నది.

మానవజాతి బాధ్యతలు నేర్వవలసిన అవసరమెంతయో యున్నది. అట్టి బాధ్యతను గుర్తు చేయుటకు పరమగురు పరంపర అహర్నిశము కృషి సలుపుచున్నది. ప్రాక్-పశ్చిమముల జ్ఞానము సమన్వయింపబడి తూర్పు దేశముల వారు, పడమర దేశముల వారు ఆధిక్యమునకై ప్రాకులాడక, ఒకరినొకరు మన్నించుకొనినపుడే శంబళ కార్యము సుగమ మగును. ఇట్టి ఉన్నతాశయమును ధరించిన మానవుడు క్రమముగ శంబళకు చేరువగుట, శంబళ సైనికునిగ శంబళ ఆశయసిద్ధికై కృషి చేయుట జరుగ గలదు.

35

## ఉన్నత స్థితి

ప్రసారము, పరివర్తనము, ఉద్ధారణము అను మూడు అంశములుగ శంబళ సంకల్పము పనిచేయుచు నుండును. ఈ మూడు కార్యములు భూమిపై మానవులకు మాత్రమే పరిమితము కాక జంతువులకు, వృక్షములకు, ఖనిజములకు, పంచభూతములకు కూడ ఉద్దేశింపబడి యున్నది.

మానవుని యజ్ఞార్థ జీవనమందు పై తెలిపిన శ్రేణి జీవు లందరికిని కూడ హితము చేయవలసిన అగత్య మున్నది. వస్తువులను వినియోగించు విధానము నుండి తోటి మానవుని వినియోగించు విధానము వరకు నాణ్యతను పెంచవచ్చును. మానవుడు ప్రతి స్పందించు ప్రతి విషయమునందును వానియందు నాణ్యతను పెంచు దృక్పథమున్నచో, మానవుని నాణ్యత కూడ పెరుగును. తన దరిచేరిన వస్తువుగాని, వృక్షముగాని, జంతువుగాని, తోటి మానవుడు గాని ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి చేర్చుటకు ప్రయత్నించు మానవుడు నిజమగు సాధకుడు.

భూమి పదార్థము తనవలన మెరుగు పడవలెను. తాను భూమికి బరువై యుండరాదు. నీటిని వినియోగించు విషయమున కూడ భక్తి శ్రద్ధ లుండవలెను. తనవలన భూమి, నీరు, వాతావరణము కాలుష్యములు పొందరాదు. భాషణము వలన గాని, భావముల వలన గాని కాలుష్యము పెంచరాదు. ఇట్లు తన పరిసరములతో శ్రద్ధతో ప్రతిస్పందించువాడు శంబళ ప్రసారమునకు అర్హుడై ఉన్నతి చెందుచు నుండును. తనవలన పరిసరములు కూడ ఉన్నతి చెందును. పరి వర్తనము, ఉన్నతి తనకు గాని, తన పరిసరములకు గాని జరుగు చుండుట వలన ఆత్మసాధన జరుగుచున్నదని తెలియవలెను. పరుల ఉద్ధారణమునందే తన ఉద్ధారణము కూడ యున్నదని తెలిసినవాడే తెలిసినవాడు.



36

## యజ్ఞార్థము

మన సూర్యమండలమును నడిపించుచున్న మహత్తర మండలములలో ఒకటి సప్తర్షి మండలము, రెండు కృత్తికా మండలము, మూడు శారమేయ మండలము. ఈ మూడు మండలముల చైతన్యము త్రివేణిగ నేర్పడి ద్వాదశాదిత్య మండలము ద్వారా మన సూర్యుడగు వివస్వతుని చేరి అటనుండి సప్తకిరణముల ద్వారా మన భూమిని చేరగ, వాని ప్రభావమును సమీకరణము గావించి శంబళ సప్త ఆశ్రమముల ద్వారా భూమి జీవులకు ఒక ప్రణాళిక ప్రకార మందించు చున్నది. భూమి యందలి సప్తాశ్రమ ములు శంబళతో అనుసంధానము చెందియున్నవి. ఇట్లు అంతరిక్ష మందలి మహత్తర మండలముల ప్రజ్ఞను మనకనువగు రీతిలో అందజేయుచు, మన పురోగతికి శంబళ తోడ్పాటు గావించు చున్నది.

ఈ అవరోహణ క్రమమును ధారణ చేయువారు త్వరితగతిని పరివర్తన చెంది ఉద్ధరింపబడుచున్నారు. పరమగురువుల ఆశ్రమము లందు శంబళ ప్రసరింపజేయు చైతన్యము నందుకొనుటకు మరల

ఆ చైతన్యమును స్థానికముగ ప్రసరింప జేయుటకు ఆశ్రమవాసులు దీక్షతో వర్తించు చున్నారు.

యజ్ఞార్థము జీవించగోరు వారు మానవ సంఘములలో కూడ నున్నారు. వారీ ప్రసారముతో ముడిపడి వారి వారి పరిధులలో శంబళ చైతన్యమును ప్రసరింపజేయుచు, మానవజాతి పరివర్తనమునకై కృషి సలుపుచున్నారు.

శంబళ మాధ్యమముగ అంతరిక్ష చైతన్యము భూమిపై పరిణామమునకు తోడ్పడుచున్నది. ప్రార్థన చేయు ఆస్తికులగు ప్రజలు శంబళతో అనుసంధాన మేర్పరచుకొనుటకు జీవితమును యజ్ఞార్థముగ మలచుకొనవలెను. యజ్ఞార్థ జీవులకు శంబళ తిరుగులేని సత్యము గను, మితిలేని బలముగను గోచరించును.

37

## సంకల్పశక్తి

సంకల్పశక్తియే సిద్ధికి మూలము. జ్ఞానశక్తి, క్రియాశక్తి కూడ సంకల్పశక్తిలోని భాగములే. క్రియకైనను, జ్ఞానమునకైనను, ప్రాణమున కైనను సంకల్పమే మూలము. కేవలము సంకల్పబలము చేత మరణ మును శాసించవచ్చును. శంబళ భూమిపై సంకల్పశక్తికి ప్రతిరూపము.

సర్వతోముఖాభివృద్ధికి సంకల్పశక్తి నాశ్రయించుటయే క్షేమము. సూర్యుని నుండి దిగివచ్చు సంకల్పమే సూర్యమండలమును పట్టి యుంచినది. సూర్య మండలమును పోషించుచున్నది. సూర్యమండల మంతయు ప్రాణముతో నింపినది. సంకల్పశక్తియే దిగువ లోకములలో కోరికగా, కామముగా అవస్థితి చెంది యుండును. కర్తవ్యము ననుసరించు కార్యము శుద్ధ సంకల్పముతో కూడి యుండును. కార్యం కర్మ నిర్వర్తించుచు, లోకశ్రేయస్సుకై జీవించు జీవుని యందు సంకల్పశక్తి సర్వమును సమన్వయించును. కాలము, దేశము అట్టి వానికి సహకరించును. సంకల్పశక్తికి సమర్పింపబడిన జీవుడు సర్వార్థములను సాధించగలడు. శంబళ స్మరణ మాత్రమున యిట్టి శక్తి లభ్యమగుట గమనార్హము.

భూమిపై లోకహితార్థము వర్తించు శ్వేతబృందము కూడ శంబళ శక్తిని నిత్యము ఆవాహనము గావించుచు నుండును. శంబళ బలము తోనే శ్వేతబృందము మానవజాతి పురోగతికై పరిశ్రమించు చున్నది. మనో లోకముల యందలి మానవులు స్వహితార్థము నుండి పర హితార్థమునకు మరలునట్లు కృషి సల్పుచున్నది.

38

## సంకల్పబలము

సూర్యకిరణములలోని ప్రథమ కిరణమును సుషుమ్న యందురు. మానవుని యందు కూడ సుషుమ్న నాడి యున్నది. సుషుమ్న నాడియందు ప్రవహించు శక్తి సంకల్పశక్తియే. సంకల్పము వలననే సుషుమ్నయందు ప్రజ్ఞ ఊర్ధ్వ అధో లోకములలో సంచరించు చుండును.


సుషుమ్న కనుబంధమగు రాశులు మేషరాశి, సింహరాశి, మకరరాశి. అనగా చైత్రమాసము, శ్రావణమాసము, పుష్యమాసము. ఈ మాసాధిపతులుగ గొఱ్ఱెపోతు, సింహము, మేకపోతు తెలుప బడినవి. ఎదురులేని పరాక్రమమును సూచించుటకు పై జంతువులను జ్యోతిషమున పేర్కొనిరి. పై మూడు రాశులును తిరుగులేని సంకల్ప బలము కలవి.

మేషమున కుజుడు, సింహమున సూర్యుడు, మకరమున శని అమిత సంకల్ప శక్తి గలవారు. ఈ మూడు గ్రహములును పై మూడు రాశుల ద్వారా సప్తర్షి మండలమందలి సుషుమ్న శక్తిని సూర్య మండలమున, భూమండలమున అవతరింప జేయుచున్నవి. ఇట్టి

అవతరణమునకు శంబళ తోడ్పాటు గావించుచున్నది. ఇరువది యైదు వేల (25,000) సం॥లు పై రాశులు, గ్రహములు శంబళకు తోడ్పాటు కాగ, శంబళ భూమిపై దివ్యసంకల్పమును నిర్వర్తించు చున్నది.

శంబళను గూర్చిన అవగాహనను మానవజాతి యందు కల్పించుట కూడ దివ్య ప్రణాళికలోని భాగమే.

ఆర్యజాతి అగ్నివలన నశించునని భవిష్యవాణి యొకటి యున్నది. అగ్నిని అగ్నితోనే జయించవలె నన్నది శంబళ ప్రభువగు సనత్కుమారుని సంకల్పము. ఇనుమడించిన సంకల్పశక్తి అగ్ని కన్న బలమై వినాశనము నుండి జాతిని రక్షించ గలదు.



39

## మైత్రీ భావములు

శంబళను స్మరించుట వలన సంకల్పశక్తి ప్రచోదన మగును. గాయత్రి స్మరణ మెట్టిదో, శంబళ స్మరణము కూడ అట్టిదే. శంబళను స్మరించుట వలన కుజుని దీక్షాశక్తి, బుధుని ధీశక్తి, సూర్యుని ఇచ్ఛాశక్తి త్రివేణి సంగమముగ సాధకుని యందు కుండలిని ప్రచోదనము చేయగలదు. మనసు పవిత్రీకరింపబడ గలదు. సాధకుని యందలి అసురశక్తులు నశింపగలవు.

ప్రస్తుతము భూగోళమందు ఎక్కువ ప్రమాదము లన్నియు అగ్ని సంబంధితములే. మానవ బాంబులనుండి క్షిపణుల ప్రయోగము వరకు అన్నియు అగ్ని విస్ఫోటములే. అవలోకించినచో భూమిపై అగ్నికార్యము మిక్కుట మగుచున్నది. అదియును విధ్వంసకరమై సాగుచున్నది. ఆర్యులు అగ్ని వలన నశింతురని, అట్లాంటియన్లు నీటివలన నశింతురని ఋషివాక్కు యున్నది. అట్లాంటియన్లు నిజము నకు నీటివలననే నశించిరి. సముద్రము పొంగగా అట్లాంటియన్లు మునిగిరి. ఆర్యులు కూడ ప్రస్తుతము అగ్ని విధ్వంసక అణుశక్తు లను పెంపొందించుకొనుచు, వినాశము దిశగా సాగుచు నున్నారు.

అణుశక్తిని జీవన ప్రయోజనమునకు కూడ వినియోగించుకొన వచ్చును. అట్టి శాంతియుతము, ప్రయోజనకరము అను వినియోగము శంబళ స్ఫూర్తి వలననే కలుగుచున్నది. విధ్వంసము కలి ప్రేరణగ కలుగుచున్నది. మానవజాతి యందు యుద్ధమును గూర్చిన కండూతి మెండైనచో యుద్ధము తప్పదు. పరస్పర శత్రు భావములను నిర్వీర్యము చేయుచు, మైత్రీభావములను పెంపొందించుటకు శంబళ నిర్విరామ మగు కృషి సలుపుచున్నది. ప్రతి ఒక్కరును తమ ఆలోచనను, తమ మాటను అత్యంత విలువైన శక్తులుగ భావించవలెను. ఈ శక్తులను పవిత్రముగనే వాడవలెను. అపవిత్రము గావించినచో తాను నష్ట పోవుటయేగాక, సామూహిక కష్టమునకు కూడ తోడ్పడిన వారగుదురు. విషబీజములను చల్లుకొనుచు పోవువారు అమృత తుల్యమగు జీవన మెట్లు సాగించగలరు?

# 40

## సత్సంకల్పము

సత్సంకల్పముతో విధ్వంసక శక్తులను నిర్జించుట శంబళ చూపు నైపుణ్యము. విధ్వంసమును విధ్వంసముతో నెదుర్కొనుట పూర్వపద్ధతి. సత్సంకల్పముతో, మైత్రీ భావముతో నిర్జించుట అధునాతనము, నూతనము అగు పద్ధతి. కలియుగమున శత్రుత్వ మును మిత్రత్వముతో గెలుచుటయే ఉపాయము. కలియుగ అవతారములగు  గౌతమబుద్ధుడు, ఏసుక్రీస్తు అహింస, ప్రేమ మార్గములద్వారా హింసను నిర్జించిరి. పూర్వ యుగములలోని అవతా రములగు రామకృష్ణాదులకు యుద్ధము తప్పలేదు. కలియుగమున యుద్ధము తప్పనిసరి కాదని గౌతమబుద్ధుడు, ఏసుక్రీస్తు నిర్వర్తించి చూపినారు. ఈ యవతారముల వైశిష్ట్య మదియే.

ప్రతిఘటన శాంతియుతమై నిర్వర్తింపబడుటకు జ్ఞాన మావశ్యకము. ఇటీవలి కాలమున మహాత్మాగాంధీ యిట్టి శాంతియుత మార్గమున భారతదేశమునకు స్వాతంత్ర్య మేర్పరచుట కారణముగ మహాత్ముడై నిలచినాడు. యావత్ ప్రపంచమునకు శాంతి మార్గము యుద్ధమార్గము కన్న బలమైనదని నిరూపించినాడు. మైత్రీభావముతో

శత్రుభావమును నిర్వీర్యము గావించుట ఒక దివ్య ప్రక్రియ. అట్టి ప్రక్రియను మహాత్మాగాంధీ నిర్వర్తించి, మానవ జాతికి దిశానిర్దేశము గావించినాడు. ఈ దిశానిర్దేశము గాంధీ మహాత్మునకు శంబళ నుండియే లభించినది.

శంబళ యుక్తియుక్తముగ అనేక యుద్ధములను వారించిన దనుటలో అతిశయోక్తి లేదు. కుజశక్తి కన్న బుధశక్తిని ప్రయోగించుట మిన్నయని శంబళ సందేశ మిచ్చుచున్నది.

41

## సేవ చేయుట

కలిని నిర్జించుటకు శంబళ నూతనమగు ఉపాయమును లోకమున ప్రవేశ పెట్టినది. శంబళ, దైవారాధనము కన్న జీవుల సేవ మిన్నయని బోధించును. మానవునియందలి మరియు ఇతర జీవుల యందలి మాధవుని దర్శించుచు వారికి సేవ చేయుట, హితము కూర్చుట ఆరాధన కన్న ఉత్తమ ఫలితము నిచ్చునని శంబళ బోధించును మరియు నిర్వర్తించును.

దైవమును చేరుటకు జీవులకు సేవ చేయుట సూటియగు మార్గమని శంబళ బోధించును. ఆరాధన చేయు చేతులు కన్న, ఇతరులకు సహాయము చేయు చేతులు ఎక్కువ దివ్యత్వమును పొందునని శంబళ భావము. జీవకారుణ్యము, జీవోద్ధరణము నిజమగు ఆరాధనములని, ఆలయమును నిర్మించుటకన్న నిర్వాసితులను స్థిరపరచుట ఉత్తమ మని శంబళ తెలిపెను. సంఘ పునర్నిర్మాణము నకు, దుర్వ్యసనముల నిర్మూలనకు చేయు కృషి అగ్ని కార్యములకన్న పవిత్రములని శంబళ బోధించు చున్నది. మూగ జంతువులను చేర దీయుట; వికలాంగులను, మానసిక వికలాంగులను రక్షించుట,

పోషించుట; అనాథల కాశ్రయ మిచ్చుట, పంచభూతములను పవిత్రీకరించుట నిజమగు యజ్ఞములుగ శంబళ భావించును. జీవ సంఘమునకు స్వస్థతను అందించు కార్యములు ఆరాధనములకన్న మిన్నయైనవని, కార్యరూపము దాల్చు సద్గుణములు అర్థవంతములని శంబళ దృక్పథము. స్వాధ్యాయముకన్న సహాయము, సహకారము ప్రధానమని; ధ్యానముకన్న త్యాగము దైవము కడకు చేర్చునని; పరహితమే పరమధర్మమని, నూతనమగు మార్గములు ఆత్మానుభూతికై శంబళ నేర్పరచుచున్నది.



## 42


# శ్రేయస్సు

దివ్య ప్రణాళిక నిర్వర్తింపబడుటకు దివ్య సంకల్పమే ప్రధాన మగు సాధనము. దివ్య సంకల్పము, స్వభావము దివ్యమైనపుడే స్ఫురించగలదు. మానవ స్వభావమునందు అరిషడ్వర్గములు, ఆవేశ కావేశములు, ఉద్వేగపూరితమగు ఆశయములు, అస్థిరత యున్నపుడు దివ్య సంకల్పము స్ఫురించుటకు అవకాశ ముండదు. మురికి నీటి యందు శుద్ధము, స్వచ్ఛము అగు విషయము భాషింప నేరవు. కనుకనే దివ్య సంకల్పములు బడయుటకు పరిశుద్ధ జీవనము, నిర్మలమగు మనస్సు, జిజ్ఞాసువగు చిత్తము... ఇత్యాది సద్గుణము లావశ్యకములు. యోగమందలి యమ నియమములు సిద్ధించని వానికి దివ్య సంకల్ప మవతరించుట అసంభవము.

సత్య ధర్మములయందు పరిపూర్ణ విశ్వాసము, సద్గుణముల యందు సహజమగు రుచి, స్వభావమున కున్నచో అట్టి స్వభావము దైవీ స్వభావముగ మారు అవకాశమున్నది. కేవలము మొండి పట్టుదల, దీక్ష రూపమున తన్నుతాను హింసించుకొనుట వలన సత్సంకల్పము

సిద్ధించదు. స్థిరమగు సంకల్పము, సత్యధర్మములు లోపించనిచో జయము శాశ్వతమై యుండును.

సత్సంకల్ప మనగా వ్యక్తిగత సంకల్పము కాదు. అది ఒక బృందమునకు, ఒక వర్గమునకు, ఒక ప్రదేశమునకు, ఒక కాలమునకు మాత్రము పరిమితమై యుండజాలదు. ఎట్టి భేదము లేక సమస్తము నుద్దేశించి, శ్రేయస్సుకై నిర్వర్తింపబడునది శాశ్వతమై నిలచును. ఏది లోకమునకు శ్రేయస్సో దానినే నిర్వర్తించుట యందు శంబళ దీక్ష వహించి యున్నది. కనుకనే రెండవ ప్రపంచ యుద్ధమున సంయుక్త దేశములకు తన బలమును సున్నితముగ అందించి విజయము కూర్చినది.



# 43

## లోకహితము

మహాత్ములు ప్రేమ సిద్ధాంతములను ఎన్ని వచించినను, ఎంత నిర్వర్తించినను మానవ జాతియందు ప్రేమతత్త్వము స్థిరముగ అంకురించుట లేదు. ఎక్కువమంది యందు ప్రేమ ఒక సిద్ధాంతము గనే మిగిలియున్నది. బడుగు వర్గముల యెడల, బలహీనుల యెడల దయచూపుటయే ప్రేమయని కొందరు అపోహ చెంది యున్నారు. నిజమగు ప్రేమ నేటివరకును ఎక్కడను అవతరింపలేదు. సమస్తమును తానుగనే భావించి, ఆదరించి, ఇతరమును చూడని స్థితి నిజమగు ప్రేమని మైత్రేయ మహర్షి నిర్వచించు చున్నాడు. మంచి చెడులను గుర్తించు మార్గమున ప్రేమ నిలబడదు. అందరి యందలి దైవమును దర్శించుట వలననే ప్రేమ నిలబడునని, కేవలము సానుభూతి, సహాయ సహకారములు ప్రేమ కానేరదని పరమగురువుల అభిమతము.

నిజమగు ప్రేమను పొందుటకు నిశ్చలమగు సంకల్పశక్తి ఆవశ్యకము. స్థిరమగు సంకల్పముతో తనను తాను పవిత్రీకరించు కొనుచున్నచో “తాను –ఇతరములు” అను భేద భావము తగ్గుచు, సారూప్యము పెరుగుచు నుండును. ఇట్టి సాధన జరుగనిచో ప్రేమ

సిద్ధింపనేరదు. కనుక సంకల్పశక్తి ఆవశ్యకత ప్రాథమికముగనే అవసరము. సంకల్పశక్తితో కల్మషములను నిర్మూలించుకొను చుండగ, అహింస, త్రికరణశుద్ధి, బ్రహ్మచర్యము, దొంగబుద్ధి లేకుండుట, భావ శుచి, బాహ్యశుచి, సద్విషయములందాసక్తి- యిత్యాదివి సహజముగ అబ్బును. ఏ శక్తివలన దివ్యప్రణాళిక నిర్వర్తింపబడగలదో ఆ శక్తియే ప్రాథమిక స్థితి నుండి ఆరోహణ క్రమమున సదా అవసరమై యుండును.

కాలమును నిర్దిష్టముగ పాటించు వారియందు సంకల్పశక్తి యుద్భవించు సదుపాయ మున్నది. అట్టి శక్తిని స్వశుద్ధి కొరకు, లోకహితము కొరకు కూడ నిర్వర్తించుకొనుట శంబళ అందించు సందేశము.

44

## విశిష్టుడు

పదార్థమున (ప్రపంచమున) బంధింపబడకుండుటకు సంకల్ప మవసరము. తోటి జీవులతో సత్సంబంధములను ఏర్పరచుకొనుటకు సంకల్ప మవసరము. దేహమును స్వచ్ఛందముగ పరిత్యజించుటకు కూడ సంకల్ప మవసరము. ఈ మూడు సంకల్పములు నిర్వర్తింపబడి నపుడే మానవుడు కృతకృత్యుడగు చున్నాడు.

జన్మించినది మొదలు జీవుని చుట్టును పదార్థము చేరుచునే యుండును. జన్మించుటకు పూర్వము కూడ తల్లి గర్భమున పంచ కోశముల పదార్థములు చేరుచు నుండును. తాను శుక్రముగ జ్యోతి స్వరూపుడగ నున్నను, తనచుట్టును సప్తధాతువులు ఆవరణలు కట్టుకొనును. అటుపైన జన్మించిన వెనుక పదార్థ స్వీకరణ, సేకరణ సాగుచు నుండును. ముప్పది సంవత్సరములకు పదార్థములతో లోపల వెలుపలగూడ పరివేష్టితుడై సాలెగూడు యందలి సాలెపురుగువలె బంధితుడగును. ఇట్టి బంధము తొలగవలెనన్నచో పదార్థము నందాకర్షణ పరమార్థము వైపునకు మరల్చవలెను. కేవలము ఆకర్షణ

చేతనే జీవుడు పదార్థమున బంధింపబడి యున్నాడు. ఆకర్షించునది పదార్థము కాదు. జీవుని దృక్పథమే.

అందమగు వస్తువు గోచరించునపుడు చూచి ఆనందించుటతో సరిపెట్టుకొనక, దానిని ముట్టుకొనుట, పొందుటకు ప్రయత్నించుట వంటివి వస్తు గుణములు కావు. జీవుని స్వభావమందలి రజోగుణము. రజస్తమస్సులు, సత్వము కూడ బంధింపగలవు. దీనినుంచి బయల్పడుటకు సంకల్పశక్తియే ప్రధానమగు సాధనము. ఆకర్షించు వస్తువునందు దైవమును చూచుట నేర్చినచో అన్నింటిని మన్నించుటయే యుండునుగాని 'మనవి' చేసుకొనుట యుండదు. శరీరమందు గూడ యుండుటయేగాని మనది అనిపించుట యుండదు. అట్లు పదార్థమునందు వసించువాడు విశిష్టుడు. అతడే వరిష్టుడు, విశిష్టుడు.

ఇట్టి సంకల్పము శంబళ బలముతో నిర్వర్తించుకొనుము.

## 45

# సర్వహుత యజ్ఞము

శంబళ స్పర్శ కారణముగ అత్యంత స్ఫూర్తి చెందిన ఏసు సర్వహుత యజ్ఞమునకు సంకల్పించెను. సర్వహుత యజ్ఞ మనగ, పురుషమేధ యజ్ఞమే. తననుతాను సంపూర్ణముగ ప్రాణములతో సహా ఒక దివ్యప్రయోజనము కొరకై అర్పణము చేయుట.

పూర్వమట్టి యజ్ఞము పరాశర మహర్షి కావించినాడు. పురాణ పురుషుని అవతరణ కొరకై అప్రాకృత శరీర నిర్మాణ యజ్ఞమున తననుతాను ప్రాణములతో సహా సమర్పించుకొని అపురూపము, అపూర్వము అగు అప్రాకృత శరీర సిద్ధికి తోడ్పడినవాడు పరాశరుడు. మహర్షి వలన ఈ ఘట్టము యొక్క వివరములు తెలిసిన ఏసు తాను కూడా దివ్య ప్రయోజనమునకై ప్రాణములను సమర్పింపవలెనని భావన చేయుటకు కారణము శంబళ స్పర్శయే.

గెత్‌శమని తోటలో ఏసు సంచరించు చున్నపుడు పూర్వము తనకు కలిగిన సంకల్పము హృదయమున ఆవిర్భవింపగ, ఏసు మనసు తల్లడిల్లెను. తనను తాను బలిచేసుకొనుటయా లేదా తనను

తాను రక్షించుకొనుటయా? తనను తాను రక్షించుకొను సమర్థుడే కాని రోమను సైనికులచేత చిక్కి, శిలువ వేయించుకొనుటలో ఒక ప్రయోజన మున్నది. తాను పునరుత్థానము చెంది మరల అనుయాయి లకు గోచరించినచో మరణము లేదు అను శాశ్వత సత్యము వెల్లడి యగును. దానివలన పాశ్చాత్య భూఖండమున మరణమును గూర్చిన ఒక అజ్ఞానపు పొర తొలగింపబడును. ఒక దివ్య ప్రయోజనము ఆవిష్కరింపబడును. ఈ కార్యమును నిర్వర్తించుటయా లేదా అని తటపటాయించుచున్న ఏసునకు దైవమే శరణ్య మనిపించినది. అందువలన మోకరిల్లి 'తండ్రీ! నీ సంకల్పమే నా సంకల్పమగు గాక!' అని ప్రార్థించెను. దానివలన శంబళ సంకల్పము సిద్ధించినది. నూతన శక మారంభమైనది.



46

## లోకశ్రేయస్సు

తనను తాను నిర్దేశించగలవాడే యితరులను నిర్దేశించుటకు అర్హుడు. తనను తాను పరిపాలించుకొనలేనివాడు, యితరులను పరి పాలింపజూచుట హాస్యాస్పదము. శంబళ స్వయంపాలనమును ఆదరించును, పోషించును. తన స్పర్శ నిచ్చును. అట్టి స్పర్శను పొందుటకు స్వయం పాలకుడైన వ్యక్తి లోకశ్రేయస్సుకు సమర్పణ చెందవలెను.

లోకశ్రేయస్సే జీవన ప్రయోజనముగ నుండు వారందరును స్వయం పాలకులైనచో శంబళ స్పర్శను పొందు అవకాశము కలదు. శంబళ స్పర్శ వలన సత్సంకల్పము ద్విగుణీకృతమై తదనుగుణమగు జీవుల నాకర్షించును. అట్టి సమయమున స్వయంపాలకుడగు లోకహితుడు వారిని సమీకృతము గావించవలెనేగాని వారిపై అధికారము చూపరాదు. దరిచేరిన వారిని సోదరులవలె ఆదరించి సమష్టిగ వారితో సంకల్పమును నిర్వర్తింపబూనవలెను. స్వప్రయోజ నమునకై వానిని వినియోగించకుండ లోకహితమునకే వినియోగించ

వలెను. అపుడు బృందమంతయు ఒక చక్కని సైనికదళమువలె నిర్దిష్టమగు కార్యమును సమష్టిబలముతో నిర్వర్తించుట జరుగును.

అట్టి బృందమునందు కార్యశూరత్వము ప్రధానముగను, ఒకరి యందొకరికి ప్రేమ అంతర్హితముగను వర్ధిల్లును. ఇట్లు ప్రేమశక్తి, సంకల్పశక్తి కూడి కార్యములను నిర్వర్తింపబడునపుడు శంబళచే గుర్తింపబడి బృందము వృద్ధిచెందుచు, భౌగోళిక సేవాబృందము కాగలదు.

శంబళ అనుగ్రహము పొందవలెనన్నచో అష్టాంగ యోగ అభ్యాసము బృందములుగా సాగవలెను. సోదరభావముతో కలిసి హితకార్యముల నొనర్చుచు సోదరభావముతో మెలగుట ప్రధానము.



47

## మానవుడే వాహిక


కరుడుగట్టిన స్వార్థమును ధ్వంసము చేయనిదే జీవులకుగాని, సంఘమునకుగాని, జాతికి గాని పురోగతి యుండదు. శంబళ అవసర మగునపుడెల్ల జాతి పురోగతి నుద్దేశించి కొన్ని యుద్ధములను, కొన్ని ప్రకృతి విధ్వంసకర కార్యములను సంకల్పించు చుండును.

విధ్వంసకర కార్యములకు కూడ మానవుడే వాహిక. శ్రేయో దాయకమగు కార్యములను మానవుని ద్వారా యెట్లు శంబళ నిర్వర్తించునో అట్లే విధ్వంసకరమగు కార్యములు కూడ మానవులు వాహికగ నిర్వర్తించిన సందర్భము లున్నవి.

శంబళ సంకల్ప శక్తియందు వృద్ధి, విధ్వంసము రెండును యిమిడి యున్నవి. ప్రాణములు కాపాడుటకు అవసరమగుచో వైద్యుడు శస్త్రచికిత్సకూడ చేయును గదా! శస్త్రప్రయోగము ఈ సందర్భమున శ్రేయస్సు నుద్దేశించియే గదా! అట్లే కుళ్ళిపోయిన సమాజమును పునర్నిర్మాణము చేయుటకు శంబళ యుద్ధములను కూడ సంకల్పించును. రెండు ప్రపంచ యుద్ధములతో ఐరోపా

ఖండము కొంత తేటపడినది. కాని మరల స్వార్థ భావములే అధిక మగుట వలన మునుపటి స్థితి ఏర్పడుచున్నది.

అమెరికా భూఖండము మానవజాతి పురోభివృద్ధికి ఒక నూతన శకముగ శంబళ సంకల్పించినది. అచ్చుట ఏర్పరచిన లిబర్టీ స్టాట్యూ శంబళ చక్రమే. భూమిపై నాలుగు దిక్కులనుండి మానవజాతిని ఆ ఖండమునకు చేర్చి, నూతన యుగ మారంభింప చేయవలెనని భావించినది. కనుకనే ప్రాథమికముగ అన్ని జాతులకును అమెరికా చేరుట కాహ్వానమున్నది. క్రమముగ స్వార్థశక్తులు బలీయమై ఆంక్ష లేర్పరచు చుండగ, శంబళ ప్రయత్నమునకు అవరోధము లేర్పడు చున్నవి. స్వేచ్ఛా స్వాతంత్ర్యములకు అడ్డుకట్ట లేర్పడుచున్నవి. పరహితార్థమునకై కృషిచేయు శంబళకు స్వార్థశక్తుల ప్రతిఘటన అవరోధమై నిలచియున్నది.



## 48

# ప్రేమ మార్గము

శంబళ పరహితార్థ సంకల్పము, మానవజాతి స్వార్థపూరిత సంకల్పము ఒకదానితో నొకటి ప్రతిఘటన యందున్నవి. పరహిత భావన జీవులలో పెంచు కార్యక్రమము పరమగురువులు నిర్వర్తించు చున్నారు. పరహిత కార్యములు కూడ కలి ప్రభావమున మెలికపడి స్వార్థమునకై ముగిసినవి.

ఎన్నో సంఘములు సదాశయములతో ప్రారంభింపబడినవి వృద్ధి చెందుచుండగ, కలి ప్రభావముచే వక్రత చెంది ఆశయసిద్ధిని పొందలేక పోవుచున్నవి. ఇట్టి నిర్బంధనమును శంబళ సంకల్ప మాత్రముచే ఛేదించగలదు. స్వార్థమును దహించగలదు. కాని అట్టి దహనకాండయందు ప్రాణనష్ట మధికమై యుండును. జీవుల యందు ప్రేమ కారణముగ శంబళ ఉపేక్షించుచు, ప్రేమ మార్గమున మార్పు నందించు పరమగురువుల సంఘముతో సహకరించుచున్నది. శంబళ ఓర్పు, సహనము అనిర్వచనీయము.

49

## సేవానిరతి

శంబళ ప్రజ్ఞ బృందమును స్థిరపరచుటకు, బలపరచుటకు కూడ అత్యంత ఉపయోగకరమగు ప్రజ్ఞ. నిత్య ప్రార్థన యందు శంబళను, సనత్కుమారుని స్మరించినచో పై ఆశయము సిద్ధించును.


బృందమనగా శ్రేయోదాయకమైన ఆశయముతో కూడిన సభ్యుల సంఘము. ఇందు సభ్యులందరు కూడ సేవానిరతికి కట్టుబడిన వారై యుండవలెను. స్వహితముకన్న పరహితమే ప్రయోజనకరమను భావము, వర్తనము నిశ్చయముగ కలవారే బృందమున సభ్యులై యుండవలెను. పరాధీనులు, పరాన్నభుక్కులు, బృంద వసతులను సొంతమునకై వాడుకొనువారు బృందమును చేరినచో శంబళను ప్రార్థించుట వలన అమితమగు ఘర్షణము కలుగును.

అవగాహన, అర్హత, సమర్థత లేకుండ ఆవేశపరులు ఆత్మ సాధనకై బృందములుగ 20వ శతాబ్దమున వేలకు వేలు ఏర్పడి యున్నారు. పరమగురువుల బోధనలచే ప్రచోదన మొంది, వారిచ్చిన శిక్షణను అనుసరింపక, అర్హత సమర్థత  లేక ఆవేశకావేశములతో

అనేక బృందములు సంఘశ్రేయస్సుకై పనిచేయు ప్రయత్నమున, సామూహికముగను, వ్యక్తిగతముగను ఘర్షణలకు లోనగుచున్నారు.

ఆర్థిక స్వయం ప్రతిపత్తి, బహిరంగ జీవనమున తృప్తి, ధర్మానుష్ఠానమున ఆసక్తి, యజ్ఞార్థ జీవనమునకు సంసిద్ధత లేని వారిని బృందమునందు సభ్యులుగ చేర్చుకొనరాదు. అట్లు చేసుకొనినచో, ఆ సభ్యులు ఆశయ నిర్వహణమునకు అడుగడుగున అడ్డంకిగ నిలుతురు.

శంబళ నిస్వార్థమగు బృందములకు అండగ, కొండంత బలముగ ఎప్పుడునూ నిలచియే యున్నది.



50

## ప్రతినిధులు

మానవ జాతియందు మూడు రకముల మానవులు గోచరింతురు. అందు మొదటి రకము వారు పశుప్రాయులై వర్తించు చుందురు. వారు తాము నమ్మినదే సత్యమని, తాము చెప్పినదే సిద్ధాంత మని, తాము చేయునదే ధర్మమని భావించుచు, ఇతర జీవులను కష్టనష్టములకు గురిచేయుదురు. తమ వలన ఇతరులు యిబ్బంది పడుచున్నారని భావింపరు. ఎల్లప్పుడును తమనుతాము సమర్థించు కొనుచు జీవింతురు.

రెండవ తరగతివారు కొంత ధర్మాధర్మ విచక్షణ గలిగి, సత్యా సత్యములను పరిశీలించుకొనుచు, తమ స్వభావమందలి మంచిని పెంపొందించుకొనుచు, లోట్లను సర్దుకొనుటకు ప్రయత్నించుచు, పొర పాట్లను సర్దుకొనుచు, చేసిన తప్పులకు పశ్చాత్తాప పడుచు తమ పరిణామమునకై కృషి చేయుచుందురు. ఇట్టి వారినుండి తప్పులు జరిగినపుడెల్ల వెనువెంటనే పశ్చాత్తాప పడుట, తమనుతాము సరిదిద్దు కొనుట చేయుదురు. వారి స్వభావమును వారుగ చక్కదిద్దుకొను ప్రయత్నము చేయుదురు.

ఇక మూడవ తరగతివారు తమను సమాజమునకు సమర్ప ణము గావించుకొని, సమాజ శ్రేయస్సుకై అహర్నిశలు కృషి చేయు చుందురు. వారికి తమ శ్రేయస్సుకన్న సంఘశ్రేయస్సే ప్రధానము. స్వహితముకన్న పరహితము ప్రధానమై యుండును. ఇట్టివారు త్యాగములకు సంసిద్ధత చూపుచు నుందురు.

ఈ మూడవ తరగతి మానవులకు శంబళ తన బలము నందించుచు నుండును. ఇట్టివారి నుండియే శంబళ సంకల్పము భూమిపై నిర్వర్తింపబడు చుండును. వీరే మానవులకాదర్శమై శాశ్వత కీర్తిని పొందియుండుటయేగాక, దివ్యప్రణాళికకు తోడ్పడు జీవులుగ నేర్పడి దైవీతత్త్వమునకు ప్రతినిధులుగ భూమిపై కార్యములు నిర్వర్తింతురు.

51

# ధీమంతులు

**జ**నసామాన్యము కోరునది శాంతిభద్రతలు. శాంతి భద్రతలను కోరునది కేవలము సామాన్యులే. వృద్ధి, ప్రయోజనము కోరువారు అసామాన్యులు. అందరును వృద్ధి చెందవలెనని, ప్రయోజకులై సమాజమును ఉద్ధరించవలెనని కోరుట ధీశక్తికి సంబంధించిన విషయము. ధీశక్తిని పెంచుకొనువారే ధీమంతు లగుదురు.

**ధీమంతుల కొరకే శంబళ.** ప్రయోజనకరమగు జీవనము, జీవుల స్థితిగతులను వృద్ధి చేయవలెనను ఆకాంక్ష గలవారు శంబళ స్మరణముతో శక్తివంతులు కాగలరు. సమాజమును ఉన్న స్థితినుండి ఉన్నత స్థితిలోనికి కొనివచ్చుటకు ప్రయత్నించువారు నిజమగు హితులు. స్వహితము మాత్రమే కోరువారు సామాన్యులు.

ప్రపంచ ఉన్నతికై గౌతముడు అహింసా ధర్మమును అనుష్ఠించి, బోధించి లోకమునకు కొంత హితము గావించెను. అట్లే ఏసు కూడ ద్వేషించువారిని కూడ ప్రేమించు మార్గమును నిర్వర్తించి బోధించెను. ఇట్టివారి కెప్పుడును శంబళ తోడుగనే యున్నది. జీవుల ఉన్నతికై సాహస కృత్యములు చేయు వారందరికిని తోడుగ నుండునది శంబళ.

శంబళకును చర రాసులకును అవినాభావ సంబంధమున్నది. చరరాసుల నుండియే దివ్యప్రణాళిక భూమిపై అవతరించు చుండును. అవతరించుచున్న ప్రణాళికను మొట్టమొదటగ శంబళయే స్వీకరించును. శంబళతో అనుసంధానము చెందవలసినవారు విషువత్పుణ్యదినముల యందు, ఉత్తరాయణ దక్షిణాయన పుణ్యదినముల యందు క్రమము తప్పక శంబళను, సనత్కుమారులను ధ్యానింపవలెను. అట్టి ధ్యానముల వలన సంకల్పమునకు చక్కని బలమేర్పడి జీవన ప్రయోజనము సిద్ధించుట సులభమగును.

52

## కలి ప్రభావము

హిమాలయము లందలి వైశాఖలోయ, టోకియో మహా నగరము, జనీవా నగరము, లండన్ మహానగరము, న్యూయార్క్ మహానగరము, ఆఫ్రికా ఖండమందలి లగ్జర్ నగరము– ఈ ఐదు కేంద్రములను ఒక పంచకోణ నక్షత్రముగ నేర్పరచి, శంబళ శక్తి ప్రసారము చేయుచున్నది. ఇందు వైశాఖలోయ తప్ప, ఇతర కేంద్రము లన్నియు కలి ప్రభావముచే చెదరియుండుట వలన అవతరణము అంతంత మాత్రముగ జరుగుచున్నది.

అమెరికాలోని రాజకీయములు అవినీతితో ముడిపడి యుండుట వలన, ఐరోపాలోని రష్యా పాలనా విధానమునందు వ్యక్తి స్వాతంత్ర్య మంతంత మాత్రముగనే యుండుట వలన, లండన్ మహానగరమున పలుజాతుల ఘర్షణము వలన శంబళ ప్రణాళిక నిర్వర్తింపబడుటకు జాప్యము కలుగుచున్నది. ఐరోపా ఖండము యొక్క నేతృత్వమున ఆఫ్రికా కేంద్రము, అమెరికా నేతృత్వము వలన జపాన్ యందలి కేంద్రము కూడ కలుషితము లగుట వలన శంబళ కార్యము ఆలస్య మగుచున్నది.

పై తెలిపిన పంచ కేంద్రములలో నాలుగు కేంద్రములు కాలుష్యము నుండి రక్షింపబడవలెను. కనుకనే పరమగురువుల పరంపర ద్వారా అందింపబడిన ఆశంసనమున ఈ కేంద్రముల ఉద్ధారణము నిక్షిప్తము చేయబడినది. వీని నుద్ధారణమున మానవ జాతికి అమితమగు శ్రేయస్సు కలుగగలదు. పరమగురువు పరంపర అంతయు ఈ విషయమున అప్రమత్తులై యున్నారు.

ప్రస్తుతము లండన్ మహానగరమును పరిశుద్ధము గావించుట శంబళ ప్రణాళికయందు ప్రాధాన్యత వహించి యున్నది. బ్రిటిష్ పరిపాలకులయందు సత్సంకల్పము చోటు చేసుకొనినచో, అటనుండి అమెరికాకు, ఆఫ్రికాకు, ఏషియాకు కూడ ఆశావాహ దినములు ప్రారంభము కాగలవు.



53

## సంకల్పబలము

అంగారకుడు, వృశ్చికరాశి, శారమేయ మండలము– ఈ మూడును శంబళ ప్రజ్ఞతో అనుబంధము కలిగినవి. పై తెలిపిన మూడు కేంద్రముల యందు సంకల్పబలము అధికమై యుండుట వలన శంబళకు అనువుగా నున్న కేంద్రములైనవి. జాతి పునర్నిర్మాణమునకుగాని, ఉద్ధారణమునకుగాని సంకల్పబలము అవసరము. మానవజాతి జీవన విధానమును ఉన్నతముగా తీర్చిదిద్దుటకు శంబళ చేయు కృషిలో శారమేయ మండల ప్రజ్ఞ (దత్తాత్రేయ ప్రజ్ఞ), వృశ్చిక రాశి ప్రజ్ఞ, అంగారక గ్రహము ఒక త్రిభుజముగ తోడ్పడు చున్నదని పరమగురువు జ్వాలాకూలుడు బోధించి యున్నారు.

కనుక త్రిమూర్త్యాత్మకుడగు దత్తాత్రేయుని ఆరాధనము, అంగారకునకు అధిదేవత అయిన సుబ్రహ్మణ్య ఆరాధనము, వృశ్చిక రాశి కధిపతియైన శివుని ఆరాధనము సాధకులకు అందించబడు చున్నది. ఈ మూడు ఉపాధుల ఆధారముగ మానవ సంకల్పము శివ సంకల్పముగ తీర్చిదిద్దబడవలెనని శంబళ ఆకాంక్ష మరియు దీక్ష అయి ఉన్నది.

మానవుని సంకల్పమునందు పరివర్తనము గొనివచ్చుటకే శంబళ నిరంతరము కృషి సలుపుచున్నది.

పై తెలిపిన త్రిభుజములన్ని వృశ్చికరాశి, సింహరాశి మరియు కుంభరాశితో కూర్చి మరియొక త్రిభుజము నేర్పరచి, మానవులను స్వయం పరిపాలకులుగ తీర్చిదిద్దు మరియొక ప్రయత్నము కూడ శంబళ గావించుచున్నది. పరమగురువుల సహాయ సహకారములతో ఈ బృహత్తరమగు కార్యమును శంబళ నిర్వర్తించు చున్నది. తన సంతానమును తీర్చిదిద్దుకొనుటకు అహర్నిశలు కృషి చేయు తల్లి దండ్రులవలె, మానవజాతిని గూర్చి శంబళ నిరంతర కృషి సలుపుచు నున్నది. అట్టి కృషియందు విరామము లేదు. విసుగు కూడ లేదు. మానవునియందు ఈ సత్యముచే స్పృశింపబడినవారు శంబళకు వాహికలై, యజ్ఞార్థ జీవనమును అలవరచుకొనుటలో ఇపుడిపుడే అక్షరాభ్యాసము చేయుచున్నారు.

స్మరణ మాత్రమున శంబళ సంకల్పములను శుద్ధి చేయగలదు.

## 54

## ధ్యానము

మీయందలి సహస్రారము నుండి మూలాధారము వరకు గల ప్రజ్ఞా కేంద్రములలో శంబళతో సంధించి ధ్యానము గావించినచో, మీ సంకల్పములందు శుభమగు పరివర్తన ప్రారంభమగును. దివ్య సంకల్పము లందుకొని భూమిపై జీవనమును నిర్వర్తించు కొనుటకు పై జ్ఞానము అత్యంత ఆవశ్యకము. మునులకు, ఋషులకు, యోగులకు శంబళయే గమ్యస్థానమై యున్నది.

వికాసమునకు, మానవ సోదరత్వమునకు, పరివర్తనకు శంబళయే కేంద్రమై యుండుట వలన ఆజ్ఞాకేంద్రము ముఖద్వారముగ శంబళ ప్రజ్ఞను సహస్రారము నుండి అందుకొను ప్రయత్నము చేయును. ఆజ్ఞ నుండి దిగువ కేంద్రములకు శంబళ ప్రజ్ఞను ప్రసరింప జేయుము. యజ్ఞార్థ బుద్ధితో యిట్లు నిత్యము నిర్వర్తించుకొనినచో నీవు లోకహితుడ వగుటకు వలయు ఉపాయములన్నియు ధ్యానమున లభింపగలవు. శంబళ స్పర్శ నీ జీవనగతినే మార్పు చేయగలదని తెలియుము.

55

# పంచరాత్ర దీక్ష

ఆస్తికులకు పూర్ణిమా ధ్యానములు అత్యావశ్యకములని అనాది నుండియు ఋషులు ఘోషించుచునే యున్నారు. పూర్ణిమ రాత్రి, పూర్ణిమకు ముందు రెండు రాత్రులు, తరువాత రెండు రాత్రులు భూమిపై అత్యంత రమణీయమగు వెలుగు ప్రసారము జరుగును. ఈ పంచరాత్రములు రాత్రి వేళలందు పూర్ణిమ వెలుగుతో అనుసంధానము చెందుట సంపూర్ణమగు పూర్ణిమ ధ్యానము కాగలదు.

పై తెలిపిన పంచరాత్రములు భూమికి ప్రభువైన సనత్కుమారుడు కూడ దీర్ఘము, గంభీరము అగు ధ్యానములో నుండును. సాధకుడీ సత్యమును గ్రహించి తాను కూడ ధ్యానమున నిలచిన, శంబళ స్పర్శను సులభముగ పొందవచ్చును.

ప్రస్తుతము భౌగోళికముగ సాధకులకు పూర్ణిమా ధ్యానము కొంత పరిచయమైనప్పటికిని, ఆ ధ్యానముల విశిష్టత ఆవగింజంతైనను తెలియుట లేదు. తెలిసి నిర్వర్తించుకొన్నవారికి పంచరాత్రముల ధ్యానములు పరివర్తనమునకు తోడ్పాటు గావింపగలవు.

పూర్ణిమా ధ్యానముల యందు సద్గురువుతోపాటు సనత్కుమారుని కూడ స్మరింపుడు. దానివలన నీ ధ్యానము ప్రభావితమగును.

# 56

## భూమి ఋణము

పరివర్తనమునకు శంబళయే కేంద్రమై యున్నది. మరణము కూడ పరివర్తనమే అను సత్యము శంబళ నుండియే ప్రాథమికముగ ఉద్భవించినది. భూమిపై మరణించినవారు మరల మరల భూమిపై అవతరించుచునే యుందురు. భూమి యందలి ఏ విషయమునందు మక్కువ లేకుండుట అరుదైన స్థితి. తమ యందలి కామమును దాటినవారు కూడ భూమిని దాటిపోలేరు.

కామము దాటినను కర్తవ్యములు దాటుట మిగిలియే యుండును. భూమి ఋణము తీర్చుకొనుట అంత సులభమగు విషయము కాదని, జ్ఞానము కలిగిన కొలదియు తెలియుచునే యుండును. పరమగురువులు కూడ భూమి ఋణము తీర్చుకొను కర్తవ్యమునందే భూమిపై నున్నారు.

దేహము మరణించుటవలన జీవులలో మార్పు రాదు. కామము కొరకై మరల మరల పుట్టుచునే యుందురు. కనుక దేహ మరణము మరణమే కాదని శంబళ బోధించును. కామము నందు మరణించి,

కర్తవ్యములందు జన్మించుట నిజమగు పరివర్తనము. అట్టి జన్మము ఉత్తమ జన్మము. కర్తవ్యోన్ముఖులై ఋషి ఋణము, భూమి ఋణము తీర్చుకొనుటకై దీర్ఘకాలము భూమిపై కార్యములు నిర్వర్తించవలసి యుండును.

కర్తవ్య నిర్వహణమున పరిపూర్ణముగ నిలచి, కామవాసన లంటని వారికి అంతఃకరణ శరీరము లేర్పడును. అంతఃకరణ శరీరము లాధారముగ కర్తవ్యము పరిపూర్తి గావించినపుడు ఆ శరీరమును కూడ విసర్జించు పరివర్తన మేర్పడును. ప్రస్తుతము పరమగురువు లందరును అట్టి అంతఃకరణ శరీరము ధరించి యున్నవారే. అట్టి వారందరికిని సనత్కుమార ప్రభువులు మార్గదర్శి.

సనత్కుమార ప్రభువు పూర్వకల్పమునందే అంతఃకరణ శరీరమును కూడ విసర్జించి బ్రహ్మమును చేరిన ప్రజ్ఞ. ఆయనకు నిజమునకు కర్తవ్య మేమియు లేదు. జీవోద్ధరణమునకు స్వచ్ఛందముగ భూమిపై వెలసిన ప్రజ్ఞ.

ఇట్లు మూడు రకముల మరణములను, తదనుగుణమగు జన్మములను శంబళ బోధించును. ఇందు మొదటి మరణము శరీర మరణము. రెండవ మరణము కామ్యకర్మల మరణము. మూడవ మరణము కర్తవ్య సిద్ధి వలన కలుగు నిర్వాణము. ఇట్లు మూడు మరణములను దాటి స్వచ్ఛందముగ భూమిపై అందుబాటులో యున్నది కేవలము సనత్కుమారులే యని పరమగురువు జ్వాలా కూలుడు బోధించుచున్నాడు.

57

## రూప మరణము

మరణము విషయమున శంబళ అవగాహన విశిష్టమై యున్నది. రూపముల మరణము శంబళ దృష్టిలో మరణమే కాదు. రూపమునందు వసించు జీవులకు మరణమే లేదు. మరణించునవి, నశించునవి రూపములే కాని జీవులు కాదు.

రూపము కాలగతిన నశించుట తప్పదు. రూపము పుట్టినది కనుక నశించును. జీవుడు పుట్టనివాడు కనుక చావడు. కనుక రూపములు నశించునపుడు బాధపడుట అజ్ఞానమని శంబళ బోధించును. భగవద్గీతయందు కూడ మున్ముందుగ పరమాత్మ ఈ విషయమునే బోధించెను.

భూమిపై యుద్ధములు జరుగుట, మూకుమ్మడిగ మానవ రూపములు నశించు విషయమున కూడ శంబళ అవగాహన విశిష్టముగ నున్నది. యుద్ధము నందు మరణము సామాన్య మరణము కన్న విశిష్టమైనదని శంబళ అవగాహన. సామాన్యముగ జీవుడు మరణించినపుడు భయముతో, బాధతో వదలలేక, వదలలేక

శరీరమును ఎట్టకేలకు వదలును. కాని యుద్ధమందు సామాన్య సైనికులు కూడ తాను మరణింతునని తెలిసియు వేగముగ ముందుకు నడచును. **మరణించుటకు సంసిద్ధత సైనికుని సహజ లక్షణము.** సామాన్యులకట్టి సంసిద్ధత యుండదు. కనుకనే ఒక యోధుని మరణము యోగి మరణముతో శంబళ సరిపోల్చును.

ఆధునిక కాలమున గురువులు, యోగులు అని కీర్తింపబడిన వారు కూడ అనాయాస మరణమును, స్వచ్ఛంద మరణమును నిర్వర్తింప లేకపోవు చున్నారు.

కనుక యుద్ధముల వలన జీవులకు మేలే కలుగుచున్నదని శంబళ భావన. మరణమునకు సంసిద్ధత ఒక ఉత్తమ సంస్కారము. అది ఆ సంస్కారము యుద్ధము నేర్పినట్లుగ యోగము కూడ నేర్పలేదని, మరణోపదేశము సులభముగ పొందదగినది యుద్ధరంగము నందేనని ఉద్ఘాటించునది శంబళ ఒక్కటియే.

## 58

## క్షాళణ చెందుట

ప్రపంచ యుద్ధములు శంబళ అనుమతితోనే జరుగును. అధర్మము పెచ్చుపెరుగు చున్నపుడు మానవుల మనస్సు మరింత భ్రష్టము కాకుండుటకై శంబళ యుద్ధముల ననుమతించును. మనస్సులను క్షాళనము చేయుటకు మరణము కూడ ఉపాయమేనని శంబళ భావించును. మూకుమ్మడిగ సంహారములు జరిగినపుడు యుద్ధమున పాల్గొనిన వారందరును క్షాళన చెందుట సత్యము. వారియందు చావును గూర్చిన భయము ప్రస్ఫుటముగ తగ్గుట సత్యము. అంతేకాక సూక్ష్మమగు దర్శన స్పర్శనములకు వారికి తెర తీయబడును.

ఉదాహరణకు రెండవ ప్రపంచ సంగ్రామమున నశించిన వారందరును సున్నితమగు ఇంద్రియ గ్రహణముతో మరల జన్మించి నారు. ఇతరులకన్న సూక్ష్మ విషయములయందు వారి గ్రహణశక్తి మిన్నగ ఏర్పడి యున్నది.

యుద్ధమున మరణము సామూహికమై యుండును. కలసి జీవించుట, కలసి పనిచేయుట, కలసి భుజించుట, కలసి ప్రార్థన

చేయుట, కలసి ప్రయాణము చేయుట యిత్యాదివన్నియు ఒక ఎత్తు. తెలిసి, కలసి మరణించుట మరియొక ఎత్తు. సామూహిక ప్రాణ త్యాగము, అదియును దేశము కొరకైనపుడు అట్టి జీవునిలో ఉన్నతోన్నతమైన మార్పులు సంభవించును. అట్టివారు పునర్జన్మమున లోకహితమున కుద్యుక్తులై జీవించుట సంభవించును. కేవలము శరీర పోషణమునకై జీవించు భీతి తొలగును.

యుద్ధమునందలి మరణము ఉన్నతమగు ఉపదేశ సిద్ధికన్న గొప్పది. అట్టివారు జన్మజన్మాంతర సంస్కారములను సులభముగ దాటి పురోగతి చెందుదురు.

మానవ పరిణామమునకు యుద్ధము కూడ ఒక సాధనముగ శంబళ గుర్తించును.

## 59

## ఉన్నతత్వము

ఒక ఉన్నతమగు ప్రయోజనమునకు జీవించుట విలువగు విషయము కాగా, ఒక ఉన్నతమగు ప్రయోజనమునకు మరణించుట పదిరెట్లు ఎక్కువ విలువగు విషయము.

సోక్రటీసు, ఏసుక్రీస్తు, పైథాగొరసువంటి వారు మరణమును కూడ ఒక ప్రయోజనమునకు వినియోగించినారు. అట్టి స్ఫూర్తి వారికి శంబళ నుండియే లభించినది. మరణ ద్వారమునకూడ వారు జీవులను ఉన్నతత్త్వము వైపు ఆకర్షించినారు. అట్టివారు ఉదాత్తమగు విలువలను ఆకాశమునకెత్తిన వారుగ పరిగణింప బడుదురు.

రూపముకన్న గుణమునకు, గుణములకన్న వెలుగునకు, అట్టి వెలుగు ప్రసారమునకు శంబళ ప్రాధాన్యత నిచ్చును. తానొకడు వెలిగిన అందు పదిమందికి మార్గము లభించి, వారును వెలుగు మార్గమున బడుదురు. త్యాగముల నభ్యసింతురు. ప్రాణములను కూడ త్యాగము చేయువారు వెలుగులో వెలుగులై వెలుగులను పంచుదురు. అట్టి వారికి శంబళ వెన్నుగ నిలచును.

మానవుడు రూపమునకు ప్రాధాన్యత యిచ్చినంత కాలము పదార్థములకు బానిసగనే యుండును. తమ్ము తామెరిగిన జ్ఞాను లెవ్వరును రూపమునకు ప్రాధాన్యత నీయలేదు. యజ్ఞార్థమగు కర్మ నిర్వహణమునకే ప్రాధాన్యత నిచ్చినారు. అంతఃకరణ శరీరములను నిర్మాణము గావించుకొని, వానితో అహర్నిశలు కృషి సలుపుతు, లీలాప్రాయముగ దేహములను ధరించుచు, విసర్జించుచు జీవించు చున్న ధీరులు శంబళ సభ్యులు. శంబళకు యజ్ఞకర్మయే ప్రాణము. దేహపోషణము కూడ వారికి యజ్ఞార్థమే. దేహమును సంరక్షించు కొనుట యందు శంబళకు ధ్యాస లేదు.

60

## లోకాంతర యానము

ఆకస్మిక మరణములు, సామూహిక మరణములు, ప్రకృతి వైపరీత్యముల వలన కలుగు మరణములు జరుగునపుడెల్ల సూక్ష్మ లోకము లందు నిర్మాణాత్మకమగు సర్దుబాట్లు జరుగుచుండును. కుటుంబమున ఒక వ్యక్తి మరణము కుటుంబ సభ్యులందరి యందును మనోమయ, ప్రాణమయ, అన్నమయ లోకములలో కల్లోలము సృష్టించి పునః సమీకరణము జరుగును. మరణించిన వారి కెట్లును తాత్కాలిక బంధమోచనము కలుగును. దేహము నుండి విముక్తి చెందిన జీవుడు ప్రాథమికముగ అనిర్వచనీయమగు సౌఖ్యమును గుర్తించును. దానికి కారణము అస్థిపంజరము నుండి వెలువడుటయే. అటుపైన ప్రాణమయ, అన్నమయ కోశములలో తన వారిని గూర్చిన భావము కొంత బాధించినను, ఆ లోకముల కాలమానమును బట్టి ఒక వారము (మన లోకమందు ఏడు నెలలు) బాధ చెంది విముక్తు డగును. కనుక మరణము కూడ జీవునకు ఒక విమోచనము. మరణానంతరము వుండు సుఖానుభూతి జనన మందుండదు.

భౌతిక దేహమొక పంజరము వంటిది గనుక, పంజరమందలి

చిలుక పంజరము నుండి బయల్వెడలి ఎట్లానందించునో, జీవ చైతన్యము కూడ అట్లే ఆనందించును.

శంబళయందు మరణమును గూర్చిన స్వరూప స్వభావములు జీవునకు కలుగు అనుభూతి, పరిణామము ప్రధానముగ బోధింప బడుచుండును. వారి దృష్టిలో జీవుల మరణము మరణమే కాదు. వారి దృష్టిలో మరణము రూపాంతరము చెందు విధానము.

శంబళ స్పర్శగల వారెవ్వరును మరణమును గూర్చి భయ పడుట యుండదు. వారు మరణము నాహ్వానింపరుగాని, మరణ మేతెంచినపుడు ధీరులై లోకాంతర యానమునకు సంసిద్ధులగు చుందురు. ఇది శంబళ ప్రత్యేకత.

61

## శాశ్వత సత్యము

జీవులకు రూపము నిచ్చునది ప్రకృతియే. జీవన ప్రయోజనము నిర్వర్తింపబడుటకు రూపమావశ్యకమై యున్నది. అట్టి రూపము ప్రేమతో నిచ్చినది తల్లి. రూపము యొక్క ప్రయోజనము నిర్వర్తింపబడినపుడు, రూపమును నిర్మూలించునది కూడ తల్లియే. తన కీయబడిన రూపమును తల్లికే (ప్రకృతికి) అప్పచెప్పుట సంస్కారము. తన శరీరము, ఇంద్రియములు, మనస్సు ప్రకృతివని తెలిసి ప్రకృతికి అనునిత్యము నిద్రకు పూర్వ మప్పజెప్పుట అభ్యసించవలెనని శంబళ నిర్దేశించును.

శరీరము కర్తవ్య నిర్వహణమునకు, ధర్మ నిర్వహణమునకు, యజ్ఞకర్మ నిర్వహణకు ప్రసాదింపబడినదిగ జీవులు భావింపవలెను. శరీరము భోగమునకు కూడ ఉపయుక్తమే అయినను దానిని ధర్మము తప్పక నియుక్తము  చేయవలెను. ధర్మము, కర్మము తప్పినపుడు శరీరమే బంధించగలదని కూడ తెలియవలెను. ప్రకృతి యిచ్చినది సౌకర్యమే అయినను, జీవుడు కర్మము తప్పినపుడు సౌకర్య మసౌకర్యముగ మారును. మనసేంద్రియ వినియోగము ఒక నిర్దిష్ట

మగు జ్ఞానము. ఈ జ్ఞానమును విద్యార్థి దశయందే పటిష్ఠము చేసుకొనవలెను. అట్లుకానిచో జీవునకు, శరీరమునకు చిక్కుముడులు పడును. తత్కారణముగ మరణము యాతనముగ నుండును. కనుక శంబళ జీవునకు శరీర జ్ఞానముండవలెనని, దాని వినియోగమున సవ్యాపసవ్యములు తెలిసి యుండవలెనని, లేనిచో మరణయాతన తప్పదని బోధించుచుండును.

ప్రతినిత్యము నిద్రించునపుడు ప్రకృతికి నమస్కరించి, తానిచ్చిన అష్ట ప్రకృతులను తానే స్వీకరించి, తనను విడుదల చేయమని సంకల్పము చేయవలెను. శరీరము ప్రకృతి దత్తమని జ్ఞప్తియందుంచుకొని, తాను ధర్మకర్తగ నుండుట నేర్వవలెను. జీవితమంతయు ధర్మ కర్తృత్వమేగాని తనకేదియు సొంతముగ లేదని తెలియుట శంబళ తెలుపు శాశ్వత సత్యము. ఈ సత్యము మరచుట వలననే జీవుడు అతిక్రమించి వ్యాధులు, మరణయాతనము పొందుచున్నాడని శంబళ ఘోషించును.



62

## పురుషోత్తమ ప్రాప్తి


ప్రతినిత్యము నిద్రించునపుడు నీవక్షర పురుషుడవని జ్ఞప్తి తెచ్చుకొని, పురుషోత్తమునితో అనుసంధానము చెందుచు నిద్రించుము. దినమంతయు నీవు క్షర పురుషుడవుగ జీవింతువు. అనగా నీ నామము, రూపము, కులము, గోత్రము, సంఘము అను తాత్కాలిక సత్యముతో వర్తింతువు. నిజమునకు నీవు నీ నామమూ కాదు, రూపము కాదు. కులమును గోత్రమును కూడ కాదు. ఏ దేశీయుడవు కాదు. కాని ప్రపంచమున ప్రవర్తించునపుడు యివి యన్నియు సత్యములై గోచరించును. స్త్రీ పురుష భేదముగాని, వయోభేదముగాని క్షర పురుషునకే పరిమితము. అక్షరుడవగు నీవు పురుషుడు కాదు, స్త్రీయును కాదు. అట్లే నీవు పిన్న వయస్కుడవు కాదు, వృద్ధుడవు కాదు.

క్షర పురుషుడుగ నీకు నామ మున్నది. రూప మున్నది. లింగభేద మున్నది. కులగోత్రము లున్నవి. సంఘమున స్థితిగతు లున్నవి. కాని ఇవి యేవియును నీవు నిద్ర కుపక్రమించునపుడు అక్కరకు రావు. అవి నిజమున కక్కరలేదు కూడ. పై తెలిపిన లక్షణములు క్షరునకు సత్యములు. నిద్రించునపుడు నీవు క్షరమునకు

నిద్రించి అక్షరమునకు మేల్కొంచుట జ్ఞానమై యున్నది. క్షరపురుష జీవనము ఒక పాత్ర ధారణము వంటిది. పాత్రధారుడు పాత్ర సంబంధిత విషయము లన్నింటిని ఎట్లు విసర్జించునో, నీవును ప్రతిరాత్రి నిద్రించునపుడు క్షరమగు సర్వమును విసర్జించి, నిన్ను నీవు అక్షరుడుగ భావించి, అక్షరుడుగ స్ఫురణ చెంది, పురుషోత్తము నితో కూడి నిద్ర కుపక్రమించు చున్నట్లుగ భావించుము.

నిద్ర యనగా క్షరపురుష నిమజ్జనమే. క్షరుని విసర్జించి, అక్షరుడుగ పురుషోత్తమునితో యోగము చెందుటకే నిద్ర. ఇట్టి భావనతో నిద్ర కుపక్రమించుట వలన పురుషోత్తమునితో యోగించుటకు పాత్రత కలుగును. ప్రయత్నశుద్ధి ననుసరించి పురుషోత్తముడు ప్రాప్తించును కూడ.

నిద్రను యోగమునకై నియోగించుట, వినియోగించుట శంబళ ప్రత్యేకత.



63

## దైవమే తాను

జీవునియందు దైవమున్నాడు. జీవుని అంటిపెట్టుకొని స్వభావ మున్నది. జీవుడు స్వభావము నంటిపెట్టుకొని యున్నపుడు తన నిజస్థితిని మరచును. తన పేరు, తన గోత్రము, తన ఊరు, తన రాష్ట్రము, తన దేశము, తన వారు అను విషయములతో ముడిపడి యుండుట ప్రాపంచికత.


తనయందలి దైవముతో తాను ముడిపడుట సాధన. అట్టి సాధన సిద్ధించినపుడు సహజముగ దైవమే తానుగ నున్నాడని జ్ఞప్తి యుండును. 'సోహం' అనునది సత్యమై నిలచును. దైవమే తానుగ నున్నపుడు తన స్వభావము కూడ క్రమముగ ప్రాపంచిక స్థితి నుండి బయల్పడును. దైవమే తానని తెలియుట జ్ఞానము. తనను గూర్చి ఏర్పడిన ప్రాపంచిక నిర్వచనములు అట్టి సాధకుని స్పృశించవు.

దైవమే తానుగ నున్నాడని సాధన చేయు సాధకుడు ధ్యానమున తనయందలి దేవునితో కూడును. జీవితమున స్వభావము నధిష్ఠించి ప్రపంచమున కర్తవ్య కర్మలను నిర్వహించును. దైవ సంకల్పమును

స్వభావము ద్వారా భూమిపై నిర్వర్తింపచేయును. ప్రపంచమున మునగడు. స్వభావమును మన్నించునే గాని, స్వభావమునకు లొంగడు.

తన స్వభావమునకు తానుగ లొంగినచో, తాను ప్రాపంచికు డగును. తన స్వభావమును తా నధిష్ఠింపవలె నన్నచో తనలోని దైవముతో ముడిపడవలెను. దైవముతో ముడిపడుట స్థిరపడుచుండగ, స్వభావపు ముడి విడిపడుచుండును. దైవముతో కూడి స్వభావము నధిష్ఠించి జీవించుట నేర్చినచో పరమగురు బృందమున సభ్యుడు కావచ్చును.

పరమగురువు సభ్యులందరు కూడ శంబళతో ముడిపడి మానవజాతి ఉన్నతికి కృషి చేయుచున్నారు. మన స్వభావము మానవ జాతి ప్రతీక. జీవులుగ మనము పరమగురు బృందమునకు ప్రతీక. మనయందలి దైవము శంబళకు ప్రతీక. ఈ సామ్యము నెరిగి శంబళను చేరుటకు యత్నింపుము.




64


## దివ్యసాధన

భూమిపై అవతరించియున్న దివ్యత్వమునకు శంబళ ప్రతీక. అట్టి దివ్యత్వమునకు అనుసంధానము గావించునది గురుపరంపర. గురుపరంపర సభ్యులందరును స్వభావము నధిష్ఠించి యున్నవారే. వారికి వారి స్వభావము దివ్య స్వభావముగ నేర్పడి యుండును. దివ్యసాధన ద్వారా స్వభావమును దివ్య స్వభావముగ వారందరును పునర్నిర్మాణము గావించుకొనినారు. దివ్య స్వభావము ఆధారముగ వారు మానవులలోని స్ఫూర్తిమంతులకు ప్రచోదనము గావించు చున్నారు.


వారి స్వభావము దివ్య స్వభావమై యున్నను వానియం దిమడక శంబళతోనే ముడిపడి యుందురు. అనగా వారియందలి దైవముతో ముడిపడి యుందురు. దైవముతో ముడిపడి, దివ్య స్వభావముతో దివ్యప్రణాళికను చిరంజీవులై నిర్వర్తించుచు నుందురు. వారికి వారి స్వభావము ప్రపంచముతో వర్తించుట కొక సౌలభ్యమే కాని మరియొకటి కాదు. వారు, వారి యందలి స్వభావముతో కూడి యుండు స్థితిని సంకేతపరముగ గ్రంథములందిట్లు తెలిపిరి.




వారు దైవముతో కూడి స్వభావమును ప్రవేశించుట యిట్లు సంకేతించిరి.



వారు ప్రపంచమున దివ్య కార్యములను నిర్వర్తించు స్థితిని యిట్లు సంకేతించిరి.



ప్రపంచమున వారు సత్కార్యములను నిర్వర్తించుటను యిట్లు సంకేతించిరి.




పై సంకేతములను అవగాహన చేసుకొని శంబళను చేరు మార్గమును గుర్తింపుడు.

65

## స్వభావ విసర్జన

స్వభావము ననుసరించి వర్తించు జీవులు ప్రపంచమున నుందురు. స్వభావమును దైవీ స్వభావముగ మలచుకొని, దాని నధిష్ఠించి హితకార్యములు చేయువారు ప్రపంచమున చిక్కుపడక, ప్రపంచమునకు యితోధికముగ మేలు చేయుదురు. ఇట్టి వారికి సూక్ష్మలోకము లందలి పరమగురు పరంపర సహకారము లభించును. స్వభావము పట్టు సడలిన సాధకులకే పరమగురువుల ఆశ్రమ ప్రవేశ ముండును. సంకల్ప మాత్రమున వ్యక్తిగత స్వభావమును విసర్జించగల సాధకుడు పరమగురువుల ఆశ్రమమునందు యథేచ్ఛగ విహరించ వచ్చునని జ్వాల్‌కూల్ మహర్షి తమ బోధనల యందు తెలిపి యున్నాడు.

స్వభావమందుగల తరంగములు పరిసరములపై ప్రభావము చూపుచు నుండును. స్వభావము దివ్యమైనపుడు కూడ, ఆశ్రమము నకు, ఆశ్రమమునకు నడుమగల సున్నితమగు వైవిధ్యము వలన తరంగములకు అంతరాయ మేర్పడును. కనుక ఆశ్రమముల ప్రవేశించుటకు జీవుడు స్వభావమును విసర్జించవలెను. తనదైన

స్వభావము ఎంత దివ్యమైనదియైనను దానిని విసర్జించుట వలన ఆశ్రమ ప్రవేశము సులభతరము.

"ఆశ్రమ ప్రవేశము నగ్నముగ జరుగవలెను" అను సూక్తి యొక్క రహస్యమిదియే. ప్రతి జీవునికి అతని స్వభావమే మొదటి వస్త్రము. దానిని విసర్జించినపుడు జీవుడు శుద్ధ చైతన్య స్వరూపుడై ప్రకాశించును. అట్టి వానికి యెట్టి ఆశ్రమము నందైనను ప్రవేశము అనుమతింపబడును.

"నా వద్దకు చేరువారు నగ్నులై యుండవలె"నని కృష్ణుడు పలికిన వాక్యమున కర్థమిదియే. శంబళ చేరుటకు కూడ యిదియే రహస్యము.



66

## బృంద సహకారము

శంబళకును, సూక్ష్మము దివ్యము అయిన లోకములకును నడుమ స్థిరమగు సహకారమున్నది. ప్రాణమయ లోకములతో శంబళకు చక్కని అనుబంధమున్నది. ప్రాణమయ లోకము లందలి దేవతల ఆనుకూల్యత శంబళ సభ్యులు పొందియుందురు. ఇటీవలి కాలమున మాస్టర్ సి.వి.వి. అట్టి సహకారమును తనయందు స్థిర పరచుకొని, తన యోగము ననుసరించు మీడియంలకు కూడ అట్టి అర్హతను కలిగించినారు. వైద్య నిర్వహణమున స్వస్థత కూర్చుటకు దేవతా సహకారము కోరుట ప్రస్తుతమున గుర్తింపబడుచున్నది. పరి శుద్ధమగు హృదయము, నిర్మలమగు మనసు గల సాధకులు ప్రాణ మయ కోశ సేవలకు జీవిత మర్పించుకొన్నచో శంబళ అట్టి వారికి ఒక దేవతా సహకారము అమర్చగలదు. అట్లమర్చినపుడు అతీతమగు కాయకల్ప చికిత్స జరుగగలదు. మాస్టర్ సి.వి.వి. యోగమున అతీత కాయకల్ప చికిత్సకు ప్రత్యేకస్థాన మున్నది. మాస్టర్ సి.వి.వి. గారు శంబళతోను, సూక్ష్మము దివ్యము అగు లోకములతోను ఒక ఒప్పందము నేర్పరచుకొని, అతీతమగు చికిత్సలను నిర్వర్తించినట్లుగ చరిత్రకారులు సూచించిరి. ప్రాణమును సరిదిద్దుట ఒక ప్రత్యేక యోగసిద్ధి.

శంబళ సభ్యులందరును ప్రాణమును సరిదిద్దగల వారే. సత్సాధకులకు ప్రాణమయ దేవతల సహకారమును కూడ ఏర్పాటు చేయగలవారే. నవయుగ ఆధ్యాత్మిక బృందములందు స్వస్థతకై కృషి చేయు వారికి శంబళ దేవతా సహకారమును కుదుర్చును. అట్టివారు ప్రార్థనా మార్గమున చికిత్సను కొనసాగించుచున్నారు. ఔషధమును నిమిత్తమాత్రముగ నిచ్చుచు, సంకల్పబలముచే ప్రాణములను చక్కదిద్దుచు, స్వస్థత చేకూర్చుట ఒక విధానముగ నూతన యుగమున శంబళ పరమగురువుల బృందసహకారముతో నిర్వర్తించుచున్నది. ఇది ఒక రహస్యము.



67

## పరిణామక్రమము

భూమి జీవుల పరిణామము జీవుల సంకల్పబలముపై ఆధారపడి యున్నది. సంకల్పబలమునకు ప్రతీకగ శంబళ యున్నది. శంబళ యందు పరిణామమునకు సంబంధించిన రెండు మార్గములు యున్నవి. ఒక మార్గమున పరిణామము, పురోభివృద్ధి సాధారణముగ సాఫీగ సాగుచు నుండును. పరిణామము "నత్తనడక"గ సాగును. మరియొక మార్గమున పరిణామము శీఘ్రగతిని సాగును. ఈ రెండు మార్గములును యెంచుకొనువారు జీవులే. పరిణామమున కొంత దశవరకు నెమ్మదిగ సాగి, అటుపైన వేగమును పెంచుకొనుట కూడ జరుగవచ్చును. వేగమా, నిదానమా అని నిర్ణయించుకొనునది జీవుడే. జీవునకు దైవము స్వతంత్రము నిచ్చెను. (జీవు డనగ ఈ సందర్భమున మానవుడని గుర్తించవలెను.) అతని సంకల్పమును ఎవ్వరును మార్చు ప్రసక్తి సృష్టిలో లేదు. ఇతరుల సంకల్పములను తమ ఇష్ట ప్రకారము మలచుట ఆధ్యాత్మిక నేరము. తెలిసిన వారెవ్వరును అట్టిపని చేయరు.

జీవుడు తన పరిణామ వేగమును తానే నిర్ణయించుకొనును. పరిణామ క్రమమున అతనికి అంతరాత్మ ప్రబోధముగ వేగము

హెచ్చుట, తగ్గుట యుండును. దాని ననుసరించి శంబళ తగురీతిని ప్రోత్సహించును.

ఉదాహరణకు గౌతముడు శీఘ్రగతిని అనుసరించి బుద్ధుడై నాడు. కారణ మంతరాత్మ బోధనయే. అట్లే ఏసుకూడ శీఘ్రగతి నవలంభించెను. తత్ఫలితముగ క్రైస్తుగ ఆరాధనీయుడైనాడు. పరిణా మము చెందవలెనను ఆకాంక్ష జీవునియందు కలిగినపుడు అంతర్లోక ముల నుండి శంబళ గుర్తించి సహకరించును. జీవుని సంకల్పమును అనుసరించి శంబళ తగు ప్రోద్బలము నిచ్చుచు నుండును.

# 68

## సన్నివేశములు

జీవుని సంకల్పముపై తమ ప్రభావము చూపకున్నను, శంబళ జీవులు త్వరితగతిని పరిణామము చెందుటకై అవసరమగు సన్ని వేశములను కాలము రూపమున చొప్పించుచు నుండును. గత రెండువందల (200) సం॥లలో శంబళ అట్టి సన్నివేశములను ఏర్పరచినది. అది ఈ క్రింది విధముగ జరుగుచున్నది.

1. మానవుని జీవన సన్నివేశములలో శీఘ్రగతిని చొప్పించి, మానవునికి ఒత్తిడి పెంచుచున్నది. ఒత్తిడిని తట్టుకొనుటకు మానవుడు కృషి సలుపుచున్నాడు.

2. విద్యాభ్యాసమునకు శీఘ్రగతిని కలిగించి చిన్నతనముననే అనేకానేక విషయములయందు పరిజ్ఞానము కలుగుట జరుగుచున్నది.

3. మానవుని విజ్ఞానము నూతన పోకడల నడచుచు అనేక విధములగు పరిశోధనలు, అంతరిక్షయానములు జరుగుచున్నవి.


4. అంతర్జాతీయమగు ఒత్తిడి ఆర్థికముగ పెరుగుచున్నది. యుద్ధ వాతావరణమున మానవ జీవితము గడుచు చున్నది. ప్రకృతి

ఉపద్రవములు కూడ ఒత్తిడి పెంచి జీవన సరళియందు మార్పులు కొనివచ్చు చున్నది. జీవనమొక నడకగగాక పరుగెత్తుటగ ఏర్పరచినది.

5. జీవన పరుగు పందెమున మానవులు అవలోకనము గావించి పరిగిడుటలోని ప్రయోజకత్వమును గుర్తింపజేయుచున్నది. అవలోకనా మార్గమున జీవులు తమ సంకల్పమును ఊర్ధ్వగతి పట్టించునట్లుగ యుద్ధ వాతావరణము ఏర్పరచినది.

6. పరిస్థితులయందు దిక్కుతోచక దేవుడే దిక్కనుచు మానవ సంకల్పములు తమకు తాముగ ఊర్ధ్వగతి పట్టుచున్నవి.

ఇది యంతయు శంబళ గావించుచున్న చమత్కృతియే.



69

## దండోపాయము

మానవజాతి వైవిధ్యమగు చైతన్య ప్రవాహముల నడుమ బందీకృతమై యున్నది. రెండు ప్రవాహములు ఊర్ధ్వగతికై ప్రయత్నించు చుండగ మరిరెండు ప్రవాహములు అధోగతి యందు బంధించు చున్నవి.

ఎంతమంది దైవదూతలు, ప్రవక్తలు, అవతార పురుషులు, ఋషులు మానవులయందు నూతన చైతన్యము నింపుటకై కృషి సల్పినను, మానవుని ప్రజ్ఞ పదార్థము నందు, స్త్రీ పురుష కాంక్షయందు, ఒకరిపైనొకరు ఆధిక్యము పొందుటయందు ఆకాంక్ష కలిగి యున్నది. ఆత్మబోధనములు, జ్ఞానబోధనములు కేవలము వినుటకే గాని ఆచరణకు నోచుకొనుట లేదు. దీనివలన జాతి పరిణామము కుంటు పడుచున్నది.

మరియొక దురదృష్ట మేమనగ, మానవజాతి తమ ఏకత్వమును దర్శించలేక, వివిధత్వముతో కూటములుగను, వర్గములుగను విడి పోయినది. మరియు మతముల పేరున, కులముల పేరున, భాషా మూలమున, దేశీయత కారణమున కూడ విడిపోయి యున్నది. ఎన్ని

విధములుగ విడిపడగలదో అన్ని విధములుగను విడిపడి యున్నది. వైవిధ్యమును పెంచుకొనుచు విరోధమును కూడ పొందుచున్నది.

పై రెండు విధములగు అవగాహన మానవులను అజ్ఞానమున స్థిరపరచినది.

ఇట్టి మానవజాతి నుద్ధరించుటకు పరమగురువులు అహర్నిశలు నిర్విరామముగ కృషి సల్పుచున్నను, ఊర్ధ్వగతికి దిశానిర్దేశము చేయు చున్నను ప్రయోజన మంతంత మాత్రముగనే యున్నది. ఇట్టి సమయ మున శంబళ యొక్కటియే పరిష్కారము చూపగలదు. శంబళ పరిష్కారము భౌగోళికమగు మార్పులు తెచ్చును. మొగమాటము లేక అజ్ఞానమును శిక్షించుట, జ్ఞానమును పరిరక్షించుట శంబళ చూపు పరిష్కారము. పూర్వమున, మానవజాతిని శంబళ యిట్లే శిక్షించి రక్షించినది. తత్కారణముగ పసిఫిక్ మహా సముద్రము, అట్లాంటిక్ మహా సముద్రములు ఏర్పడినవి. జలప్రళయములు, అగ్నిప్రళయ ములు శంబళ నిర్వర్తించు సర్దుబాట్లు. అట్టి సర్దుబాటు జరుగకుండ మానవులు తమను తాము సర్దుబాటు చేసుకొను ప్రయత్నము చేయవలెను. లేనిచో మరియొక ప్రళయము తప్పనిసరి యగును.

ఈ భూమి భవిష్యత్తు శంబళ అధీనమున యున్నది. దండోపాయమే శంబళ చూపు పరిష్కారము.

70

## వెలుగు వంతెన


నిత్య ప్రార్థనల యందు శిరస్సున శంబళ ప్రజ్ఞను, హృదయము నందు గురుపరంపరను, కంఠమునందు మానవజాతిని ధరించి– శిరస్సునుండి దిగువకు, హృదయము నుండి ఎగువకు ఇచ్ఛా జ్ఞానము లను ప్రసరింపజేయవలెను. ఇట్లు నిర్వర్తించుట భౌగోళిక పౌరునకు (World Citizen) కర్తవ్యమై యున్నది.

కంఠమున దర్శింపబడు మానవప్రజ్ఞ ఉదరవితానము క్రిందుగ నుండు లోకములకు ప్రతీకయై నిలచి యున్నవి. ఓంకారము నుచ్చారణము చేయునపుడు కంఠమున ఏర్పడు శబ్దతరంగములను గమనించినచో మూలాధారము, స్వాధిష్ఠానము, మణిపూరకము లందు వ్యాప్తిచెందియున్న మానవప్రజ్ఞ కంఠమును చేరును. కంఠమందలి ప్రజ్ఞను హృదయమందలి గురుపరంపరతోను, శిరస్సు నందలి శంబళ తోను అనుసంధానము చేసినచో మానవప్రజ్ఞ దిగువ కేంద్రము నుండి ఉద్ధరింపబడును.

పై కారణముగనే ధ్యానమునకు హృదయము, కంఠము, శిరస్సును అనుసంధానము చేయుట రాజయోగ మార్గముగ ఏర్పడినది.

సాధకుడు కంఠమునగాని, భ్రూమధ్యమునగాని స్థితిగొని సహస్రారము తోను, అనాహతముతోను వెలుగువంతెనను ఏర్పాటు గావించుకొని ఇచ్ఛా జ్ఞానములను పొందవలెను.

పై ధ్యానమున దైవేచ్ఛ, దివ్యజ్ఞానము లభించి సాధకులు లోకహితులుగ వర్తించవచ్చును. పరమగురువు జ్వాలాకూలుడు నవ యుగమున సాధకులకు యిట్టి ధ్యానము నిర్దేశించినాడు. ఇట్టి ధ్యానము నిత్యము చేయు లోకహితునకు గురుపరంపరనుండి, శంబళ నుండి సూక్ష్మముగ, సున్నితముగ సహకారము లభింపగలదు. అట్టి సాధకుడు లోకహితము గావించుచు వ్యక్తిగతముగ ఉన్నత లోకముల లోనికి ఉద్ధరింపబడును. న్యాసపరమగు ఈ ధ్యానము సాధకులను ఉద్ధరించును గాక!



71

## దివ్య క్షేత్రములు

శ్వేతద్వీప వాసులకు, రాజర్షి బృందములకు భూమిపై శంబళయే ప్రధాన కేంద్రము. శంబళ నుండియే దివ్య ప్రణాళిక నిర్వర్తింపబడుచు నుండును. మానవజాతి భూమిపై స్థిరవాస మేర్పరచు కొని, స్థిరమగు దేహములతో వసించుట ఆరంభించిన సమయము నుండి శంబళ యున్నది. మానవుల మనోవికాసములకు, పరిణామము నకు తోడ్పాటు కావించుటకు ఊర్ధ్వలోకముల నుండి దిగివచ్చి, కొన్ని దివ్యప్రజ్ఞలు మానవ రూపములు ధరించి, శంబళను చేరినవి.

శంబళ ఒక అద్భుతమగు గ్రామము. అది పదార్థ లోకములలో గాక, పదార్థము నధిష్ఠించియున్న సూక్ష్మ లోకమున నున్నవి. శంబళ వాసులు కూడ సూక్ష్మ శరీరధారులే. ఉత్తమ మానవులు సూక్ష్మ శరీరమును పరిణామ క్రమమున యోగవిద్య ద్వారా పొందుదురు. అట్టి వారికి ఆకాశగమనము, అవసరమును బట్టి సంకోచ వ్యాకోచ ములు నిర్వర్తింపగల సూక్ష్మశరీరము లుండును.

మానవజాతి భూమిపై దాదాపు ఒక కోటి ఎనుబది లక్షల సంవత్సరములనుండి వసించుచు నున్నవి. శంబళ ఒక కోటి డెబ్బది

లక్షల సంవత్సరముల నుండి ఏర్పడి యున్నది అని దివ్యజ్ఞాన గురువులు తెలుపుదురు. శంబళకు ప్రతీకగ ఇబెజ్ (IBEZ) అను కేంద్రమును శ్వేతబృందము దక్షిణ అమెరికాలోని అమేరు పర్వత ప్రాంతమున ఏర్పరచిరి. ఇబెజ్ ఆధారముగనే పశ్చిమ భూభాగమున మయా నాగరికత ఏర్పడినది. సూర్యారాధన ఏర్పడినది. తూర్పున ఆసియా ఖండములోను, పడమరన అమెరికా ఖండములోను భూమిపై అత్యంత దివ్య క్షేత్రములుగ శంబళ, ఇబెజ్‌లు కలవు. శంబళ ఆధారముగనే ఇండియా, చైనా, టిబెట్, ఛాల్డియా, బాబిలోనియా యిత్యాది ఆసియా భూభాగమంతయు శంబళచే ప్రభావితము చేయ బడినది. అట్లే ఇబెజ్ ఆధారముగ అమెరికా యందలి ఉత్తర దక్షిణ ఖండములు ప్రభావితము చేయబడినవి.

శంబళ యందుగాని, ఇబెజ్ నందుగాని కార్యములు నిర్వర్తించు మహాత్ములు సనత్కుమారుని ఆదేశములను అనుసరింతురు. సనత్కుమారుని చుట్టును ఒక సమకోణ త్రిభుజముగ ముగ్గురు బుద్ధులుందురు. కాలము, దేశమునుబట్టి వారు భౌతిక దేహధారులు కూడ అగుచుందురు.



72

## మనో పరిణామము


అమేరు పర్వత ప్రాంతమున గల ఇబెజ్ ఆశ్రమమున సనత్కుమారుడు వృద్ధిచేసినది మాయా విజ్ఞానము. ఇందు ప్రధానముగ మహత్తును నిర్వర్తింపగల శబ్దశాస్త్రము, కాలజ్ఞానము, క్రతువిద్య పరమగురువులచే బోధింపబడెను. దివ్య మహిమను భూమిపై అవతరింప జేయుటకు మరియు మానవుని యందలి దివ్యత్వమును అనుభూతి చెందుటకు పై తెలిపిన శాస్త్రములను బోధించెడివారు. మనస్సు, వివేకము, విచారము, విచక్షణ యిట్టి వాటితో సంబంధము లేక కేవలము గురువును విశ్వసించి, అతని అధికారము పూర్తిగ అంగీకరించి, అతడెట్లు చెప్పిన అట్లు చేయుటయే యుండెడిది. స్వతంత్ర ఆలోచనలకు తావు లేదు. పూర్ణమగు విశ్వాసమే ప్రాతిపదిక.

ఇట్టి విధానమును ప్రవేశపెట్టుటకు కారణము అప్పటి మానవజాతికి వలసిన మనోవికాసము లేకుండుటయే. పెద్దలు చెప్పుట, పిన్నలు విశ్వసించి అనుసరించుట విధానముగ నుండెడిది. నాటికిని నేటికిని మానవజాతి మనోవికాసమును పోల్చి చూచినచో మనోపరిణామము తెలియగలదు.

పూర్వకాలమున పెద్దలు చెప్పినట్లు పిల్లలు అనుసరించెడివారు. మనోవికాసము కారణముగ నేటిపిల్లలు స్వతంత్రభావములు కలిగి యుండుట, పెద్దలను ప్రశ్నించుట, తెలుసుకొని నిర్వర్తించుట చేయు చున్నారు. ఇదివరకు శాసించుట, అనుసరించుట యుండెడిది. నేడు బోధించుట, ఎవరి నిర్ణయములు వారికి వదలివేయుట మాత్రమే చెల్లును. కనుక గ్రుడ్డిగ నమ్ముట, సమర్పణము చేసుకొనుట అరుదుగ నుండును.

పూర్వము దైవమునకు సంఘమున నొక కేంద్ర మేర్పరచి, అచ్చుటనే ఆరాధనలు, దానములు, ధర్మ కార్యములు నిర్వర్తించుట జరిగెడిది. నేడు దైవమును తమయందే దర్శించుచు, తామే ఒక దేవాలయముగ మారి ధర్మ కార్యములు, దానములు నిర్వర్తించుకొనుట పరమగురువులు నేర్పుచున్నారు.

మానవజాతి పరిణామమును బట్టి వారి యుద్ధారణమునకు అనుగుణముగ బోధనల యందు తగు విధమగు మార్పులు శంబళ నిర్దేశించును.



73

## అమృతత్వ స్థితి

శంబళ ప్రధానముగ కోరునది మానవు లందరును జీవాత్మలుగ దైవాంశలే అని తెలియుట. దైవమే జీవాత్మలుగ నేర్పడగా, జీవులు సృష్టియందు ఏర్పరచుకొను సంబంధమున వారి వారి స్వభావములను వృద్ధి చేసుకొనినారు. స్వభావపరముగ వైవిధ్యము చెందినారు. జీవపరముగ అందరును సోదరులే. తమ స్వభావమే తాముగ వికృతి చెందినారు. తమ స్వభావము తమనుండి ఏర్పడినదే. తాము దైవాంశయే. స్వభావము బట్టి వైవిధ్యమును సంతరించు కొనినారు. అంతేకాక తమ స్వభావమునకు తామే బానిసలైనారు.

ఈ స్థితినుండి ప్రతి మానవుడు తన నిజస్థితి నెరుగవలె ననునది శంబళ ఆశయము. మానవు లందరును సోదరభావము కలిగి, దైవాంశలుగ భూమిపై చరించవలెనని వారి ఆశయము, ఆకాంక్ష.

మానవులలో తమ నిజస్థితి నెరిగి, తమకు దైవమునకు గల అనుబంధమెరిగి, భూమిపై దివ్యత్వమును అవతరింపజేయు

వారందరిని శంబళ గుర్తించి, వారి మాధ్యమమున మానవజాతి నుద్ధరించుట శంబళ ప్రధాన కార్యక్రమము.

శంబళ మానవుని యందలి సూక్ష్మలోకములను మానవులకు యోగవిద్య ద్వారా పరిచయము చేయుచు, భౌతికదేహము, భౌతిక లోకము యొక్క పరిమితత్త్వమును మానవునకు విశదపరచుచు నున్నది. ఈ ఆశయమే సిద్ధించిననాడు మానవునకు తన శాశ్వతత్వము, అమృతత్వ స్థితి తెలియగలదు. భావములు, కోరికలు, రాగద్వేషములు ఇత్యాది అలజడితో కూడిన లోకముల నధిగమించి, సమస్తము నందలి దివ్యత్వమును దర్శించుటకు తెర తొలగింపబడును.

ఇది ఒక మహత్తరమగు యజ్ఞము. ఇందు సుశిక్షితులు కావలసిన మానవజాతి యింకనూ పసితనముననే యున్నది. తమ శరీరమే తామనుకొన్న వారికి, తాము జ్యోతి స్వరూపులమని, మనసేంద్రియ శరీరము తాము తొడుగుకొనిన వస్త్రములని తెలియుటకు క్షణకాలము చాలును. కాని అనంతకాలము పట్టుచున్నది. ఇదియొక విచిత్రము. దీనిని ఛేదించుటయే శంబళ సంకల్పము.



74

## ప్రేమతత్త్వము

"భూమి నాలుగు దిశలయందు నాలుగు దివ్యాశ్రమములు ఏర్పడియున్నవి. అవియన్నియు సిందూర వర్ణముచే పరిశుద్ధమై యుండును. లేత గులాబీలవలె సున్నితముగ నున్నను అత్యంత బలిష్ఠములు. లోపొరలలో హిరణ్యవర్ణము, అందులోపల ఆకాశ నీలము యిమిడి యున్నవి. నాలుగు వర్ణములకు నాలుగు శబ్దములు అమర్చబడి యున్నవి. నాలుగు అక్షరములుగ అవి ఉచ్చరింపబడుచు నుండును. ఈ నాలుగు అక్షరముల మంత్రము ఆశ్రమవాసులకే జ్ఞాతమై యున్నది. ఆ నాలుగక్షరములు పరమాత్ముని నాలుగు అవతారములకు సంకేతమై యున్నవి.

"నాలుగు దిక్కులనుండి నాలుగు తరంగములు భూమిపైకి ప్రసరింపజేయబడు చుండును. ఉత్తరము నుండి పవిత్రత, దక్షిణము నుండి సమర్పణ, తూర్పునుండి సమర్థత, పశ్చిమము నుండి బలము ప్రసరించు చుండును. సత్సాధకులు ఆయా దిక్కులనుండి వానిని గ్రహించుచు, సత్సంకల్పముతో పురోగమించుట శంబళ కోరుచున్నది. లేతగులాబి వర్గము వారు, సిందూర వర్గమువారు ప్రపంచమందలి

శిష్యులను గమనించుచు, వారికి మార్గదర్శకత్వము వహించుచు, శంబళకు దారిచూపుతు నుందురు. ఈ వర్గము వారు ప్రధానముగ దీర్ఘ దృష్టి కలవారై, లోకులను పర్యవేక్షించుచు, సత్పురుషులను దివ్యమార్గమున కాకర్షింతురు.

"లేత గులాబి, సిందూర వర్ణములు మేమేర్పరచిన ప్రాథమిక ఆశ్రమమునకు సంబంధితము (మేము అనగా శంబళవాసులు). శంబళ అంతర్గత విషయములందు పాల్గొనువారు హిరణ్యము, ఆకాశనీల వర్ణములకు సంబంధించినవారై యుందురు. ఎచ్చట ప్రేమ తత్త్వ మధికముగ నుండునో అచ్చట పురోగతి త్వరితముగ నుండును. ప్రేమలేక జరుగు సేవవలన సాధకునకు పురోగతికాక తిరోగతి యుండగలదు. అధికారము ప్రేమ అనునవి పరస్పర విరుద్ధ భావములు. అధికారము గతించిన కాలమున ఒక విలువగ యుండెడిది. ప్రస్తుత కాలమున ప్రేమకే పెద్దపీట. ప్రేమతో కూడిన సమర్థత, పవిత్రత, సంసిద్ధత, సమర్పణ శంబళకోరు కళ్యాణ గుణములు."



# 75

## ఈశ్వర దర్శనము

దూరశ్రవణము, దూరదర్శనము శంబళ వాస్తవ్యులకు వెన్నతో పెట్టిన విద్య. వారి ప్రభావము వలననే ఆకాశ తరంగములను వినుట (రేడియో), కనుట (దూరదర్శన్) భౌతిక లోకమున సాధ్యపడినది. భవిష్యత్తున పరికరముల సహాయముతో కాక స్వయముగ మానవుడు దూరశ్రవణము, దూరదర్శనము చేయగలడని శంబళ భవిష్యవాణి తెలుపుచున్నది. పరమగురువులచే సుశిక్షితులగు సాధకులు నేటికిని ఈ సౌకర్యములను సద్వినియోగము చేయుచునే యున్నారు. మానవుడు తనలోని ఈశ్వరుని దర్శించుట సాధ్యపడినపుడు యిట్టి సిద్ధులు సహజముగ వారి కబ్బునని ఋషులు తెలుపుచునే యున్నారు.

ప్రస్తుత కాలమున సిద్ధులకొరకు తాపత్రయపడువారు మెండు. సాధన చేయువారు మాత్రము అరుదు. సాధకులు సుశిక్షితులు కావలసిన అగత్యమున్నది. మానవజాతికి అదియే పరిష్కారమని శంబళ నిశ్చయముగ తెలుపుచున్నది.

ప్రతివారును తమ గురువుయొక్క దివ్యరూపమును దర్శింపవలెనని అభిలషింతురు. తమయందలి ఈశ్వరునకు తాము చేరువ అగుటయే దీనికి ఉపాయము.

హృదయమునకు, మనసునకు, మెదడునకు నడుమ వారధి నిర్మించుకొనిన ప్రతివానికిని దూరదర్శనము వీలగును. దాని నేర్పరచుటకే శంబళనుండి క్రతువిద్య (Masonry) పుట్టినది. అట్టి క్రతువిద్యను ప్రస్తుత కాలమున అత్యంత సమర్థవంతముగ నిర్వర్తించుచున్న పరమ గురువు కౌంట్ సెయింట్ జెర్మెయిన్ (Count Saint Germain). వారి ఆధ్వర్యమున ఉత్తర అమెరికా ఖండములో అనేకానేకమగు పరిశోధనలు సఫలీకృత మగుచున్నవి. ఊహాజనితమగు భావములను పెంపొందించుచు, వానికి వైజ్ఞానికమగు బలమును చేకూర్చుచు, అనేకానేకమగు సూక్ష్మవిషయములను సాకారము గావించుచున్నారు. సూక్ష్మలోకములతో అనుసంధాన మొనర్చుకొని, అనేక విషయములను దర్శించుచు లోకమునకు అందించుచున్నారు.

పరమగురువు లందరును యిట్లే శంబళతోగల సంబంధమున ఏడు కిరణముల తత్త్వమును భూమిపై అవతరింపజేయు చున్నారు. ఇందు ఆరవ కిరణమగు భక్తి, రెండవ కిరణమగు జ్ఞానము పొందు జీవులకు తరచు శంబళ స్పర్శ లభించుచున్నది. ఇతర కిరణములవారు అందివచ్చు కర్తవ్యములుగ శంబళ ప్రణాళికను నిర్వర్తింతురు. వారు ప్రార్థనా పరమగు అనుబంధము శంబళతో పెంచుకొనుటకన్న, ఆచరణాత్మకమగు సంబంధమున కిచ్చగింతురు. శంబళ వాస్తవ్యులకు ధ్యానము ఆరాధనము ఒక కన్ను కాగా, జ్ఞానము కర్మాచరణము మరియొక కన్నుగ నున్నది.

76

## మూడు సూత్రములు

పరమగురువు లందరును శంబళ సంకల్పమున భూమిపై వర్తింపజేయు ప్రయత్నమున అహర్నిశలు కృషి సలుపుచు నున్నారు. వారికి  వలసినది ఒక అనుయాయుల బృందము. అట్టి బృందమునకు ప్రధాన అర్హత ఈ క్రింది మూడు సూత్రములపై ఆధారపడి యున్నది.

1. ఆవేశకావేశములు లేని సమతుల్యమగు మనసు.
2. పరమగురువుల సాన్నిధ్యము గూర్చి వ్యామోహము చెంద కుండుట.
3. జీవితమున అన్ని రంగములయందు ఉన్మాదము, ఉద్వేగము లేకుండుట.

జిజ్ఞాసువులకు పై తెలిపిన మూడు అర్హతలు చాలా ముఖ్యము. అట్టి వారినే ఒక పరమగురువు సున్నితముగ ప్రచోదనము చేయగలడు. పై అర్హతలు లేనివారిని  పరమగురువు తన బృందమందలి సభ్యులుగ స్వీకరించడు.

సభ్యులు అనుదినము ఈ క్రింది భావములను గమనింప వలెను.

1. ఈ రోజు నేను నిర్వర్తించవలసిన సేవ ఏమైయున్నది?
2. నా దినచర్యయందు అనవసర విషయములు ఏమైనా ఉన్నవా? ఉన్నచో వాని నుండి నేనెట్లు బయల్పడవలెను?
3. ఈ నాటి నా బాధ్యత లెట్లున్నవి?
4. ఈ రోజున నేను సహకరించవలసిన వారెవరున్నారు?
5. నా వలన ఈ రోజు పరమగురువులకు కలుగు ప్రయోజన మేమి?

ప్రతి సభ్యుడును తాను పరమగురువులకు, శంబళకు చెందిన వాడనని, ఈ లౌకిక జీవితమున తత్సంబంధము గలవారే తనకు లభించవలెనని కూడ కోరుకొనవలెను. వ్యక్తిగత జీవితమును తోటి మానవుల ఆవశ్యకతకు లోబడి, పరమగురువుల ఆలోచనలకు లోబడి నిర్వర్తింపబడవలెనని ఆశింపవలెను. స్వచ్ఛందముగ తనను తాను శంబళకు సమర్పించుకొనవలెను.

పై విషయము లన్నియు దీక్షగ నిర్వర్తించుకొను వారికి తమ సంకల్పమున, దివ్యసంకల్పము చోటు చేసుకొని మార్గమునకు, గురువునకు చేరువుగ చేర్చును.

ఇటీవలి కాలమున శ్రీ శంకరాచార్యులు, శ్రీ గౌతమబుద్ధుడు, పైథాగొరస్ భూమిపై బోధనచేసి, శిక్షణ నిచ్చి, అనేకులగు శిక్షితులను పరమగురువు బృందమునకు బలముగా కూర్చిరి. వారందరును నేడు శంబళతో అనుసంధానము కలిగి యున్నారు. ఏసుక్రీస్తు ద్వారా కూడ జ్ఞానులైన భక్తులు పరమగురువు బృందమున చేరిరి.

పరమగురువులను, శంబళను చేరు మార్గమునకు పరిచయ మగుటకు వలసినది సమతుల్యమగు స్వభావము కలవారే అని తెలియవలెను.

77

## దివ్య విషయములు

జిజ్ఞాసువులు పరమగురువు అంతేవాసులతోను, అంతేవాసులు పరమగురువుతోను, పరమగురువు జగద్గురువుతోను, శంబళతోను అనుసంధానము చెందుటవలన శంబళ ప్రజ్ఞ బహిర్గతమగుచు నుండును. ఈ అనుసంధానము అనుదినము జరుగుచు నుండును. సృష్టికర్త ఏ విధముగ పరతత్త్వముతోకూడి సృష్టి నిర్మాణము చేయు చుండునో, అట్లే ఒక పరమగురువు సరియగు వాహికలను ఏర్పరచు కొనుచు, దివ్య ప్రణాళికను భూమిపై అవతరింపజేయు ప్రయత్నమున నుండును.

భూమిపై దివ్యత్వము నవతరింపజేయు కార్యక్రమము 5 వేల సం॥ల నుండి సాగుచునే యున్నది. ఇది ఒక మహాయజ్ఞము. ఈ యజ్ఞమునకు కేంద్రము శంబళ. ఈ యజ్ఞములో అంతర్భాగము గనే భూమిపై నిక్షిప్తమైయున్న అనేక దివ్య విషయములు బహిర్గతము చేయబడుచున్నవి.

ఒక పరమగురువు, అతని అంతేవాసులు పరిపూర్ణ దీక్షా యుతమగు జీవితములను గడుపుచు నుందురు. వారితో నిత్యము

అనుసంధానము చేయు పరిశ్రమ జిజ్ఞాసువులు నిర్వర్తించుచు నుండ వలెను. ఆ బాధ్యత జిజ్ఞాసువులదే. ఇచ్చట మార్జాల కిశోర సంబంధము వర్తించదు. మర్కట కిశోర సంబంధము వర్తించును. జిజ్ఞాసువులే మార్గము నంటిపెట్టుకొని యుండవలెనుగాని, వానిని పసిపిల్లలవలె సంరక్షించుట జరుగదు.

గోవులకాపరి, గొఱ్ఱెల కాపరివలె కాక పరమగురువు, పురాణ పురుషుడు తమ ననుసరించు వారినే నడిపింతురు. పరిణామ క్రమమున జిజ్ఞాసువులకు బాధ్యత పెరుగుచుండును. అంతకంటె వందరెట్లు బాధ్యత అంతేవాసుల కున్నది. వారికంటె వందరెట్లు బాధ్యత పరమ గురువుల కున్నది. కనుక ఎవరో తమను రక్షింపవలె ననెడి భావన నుండి తామే రక్షకులుగ వర్తించుట అంతేవాసుల కర్తవ్యము. ప్రస్తుతము శంబళ అట్టి శక్తివంతులను, ధీమంతులను ఏర్పరచు కార్యక్రమమున యున్నది.

అందరును శంబళతో సంబంధము ఏర్పరచుకొని, ఇనుమ డించిన శక్తితో, ధీరతతో కార్యములు నిర్వర్తింపజేయ వలెనని శంబళ ఆశించుచున్నది.



## 78

# నవ శ్రేణులు

శంబళను చేరు సాధకులు తొమ్మిది శ్రేణులలో నున్నారు. అవి ఈ విధముగ నున్నవి.

1. క్రమశిక్షణ, ఆస్తిక్యబుద్ధి కలిగి యుండువారు. వీరిని 'శిశువు' లందురు.

2. తోటి జీవుల ఆవశ్యకతను గుర్తించి, వారి కొరకు తమ కాలము, శక్తి, వనరులు వినియోగించు బుద్ధి కలిగి యుండుట, మరియు దీనుల యందు స్పందించుట స్వభావముగ గలవారు. వీరిని 'బాలు' రందురు.

3. ప్రపంచమందలి మానవులలో పై తెలిపిన శ్రేణులలోని స్వభావముతోపాటు, గురుపరంపర అనుసంధానము కలిగియున్న వారితో సంబంధ మేర్పడుట. వీరిని 'ఉపనీతు' లందురు.

4. అట్టి వారి సంబంధమున అంతరంగ సాధనా విషయముల నెరిగి, వాని ననునిత్యము ఆచరించుటకు ఉద్యుక్తులగుట. వీరిని 'కౌమారు' లందురు.

5. అంతరంగసాధన, బహిరంగ సేవా తత్పరత ప్రాతిపదికగ విశిష్టమగు స్వప్నానుభూతులు కలుగుట, బోధనలను తెలియుట, స్వప్నము నందు ధ్యానము నందు ఒక పరమగురువు స్పర్శ అనుభవించుట వంటి అనుభవములు కలుగుట. వీరిని 'కుమారు' లందురు.

6. కార్యములందు జ్ఞానమును చొప్పించి, చేయుచున్న పనులతో ఇతరులకు స్ఫూర్తిదాయకముగ నుండుట, పరమగురువు కార్యము నైపుణ్యముతో నిర్వర్తింపజేయుట, ధ్యానమున పరమగురువు సాన్నిధ్యమును సంకల్ప మాత్రమున పొందగలుగుట, పరమగురువు హృదయము నెరిగి, అతని కార్యములు నిర్వర్తించుచు చేదోడు వాదోడుగ పరమగురువుల కందుబాటులో నుండుట. ఇట్టి వారిని 'మార్గానుయాయు'లని, 'సూత్రధారు'లని పిలుతురు.

7. ధ్యానమునందు, నిద్రా సమయమందు పరమగురువుతో ముఖాముఖీ సంభాషించుట, పరమగురువు కార్యములకు వ్యక్తిగత జీవనము ఎట్టి అవరోధము కల్పించకుండుట వంటి స్థితి ఏర్పడుట. అట్టివారిని 'అంతేవాసి' అని పిలుతురు.

8. పరమగురువుతో సామీప్య, సాలోక్య, సాయుజ్య అనుభూతిని పొందుచు, పరమగురువు యొక్క హృదయమును చూరగొనుట. ఇట్టి వారిని 'హృదయవాసి' అని పిలుతురు.

9. గురు శిష్యు లొకటి యగుట, శిష్యుడు సారూప్య స్థితి నొందుట కారణముగ శంబళ ప్రజ్ఞ సూటిగ గురువుతో పాటుగ

శిష్యుని కూడ ప్రచోదనము చేయుట. ఇట్టి వారిని శంబళ సేవకుడు అని పిలుతురు.

పై విధముగ ప్రాపంచిక జీవుడు శంబళ సేవకుడుగ పరిణతి చెంది, అనంతకాలము భూమిపై దివ్యకార్యములు నిర్వర్తించుచు మనుగడ సాగించగలడు. ఈ నవశ్రేణులు జిజ్ఞాసువులకు తెలియ జేయుట కూడ శంబళ సేవకుల కర్తవ్యమై యున్నది.

# 79

## ముందు చూపు

శంబళ యందు అతి ప్రాచీన సభ్యులు కూడ యున్నారు. హైపర్ బోరియన్లు, లెమోరియన్లు, అట్లాంటియన్లు, ఆర్యులు. అన్నిటికి మించి శ్వేతద్వీప వాసులు శంబళ యందున్నారు.

మూడుకోట్ల సంవత్సరముల భూమి చరిత్ర, కోటీ ఎనుబది సంవత్సరముల మానవ చరిత్ర సంపూర్ణముగ తెలిసినవారే శంబళ వాస్తవ్య లందరును.

శంబళ సభ్యులే మానవజాతిని అనుగ్రహించి ఉపనిషత్తులను, పురాణములను, ఇతిహాసములను మానవుల కందించినారు. కపిలుని బోధలు, సనత్కుమార బోధలు, పరాశర సంహితల వంటి అనేక ప్రాచీన బోధలను మానవజాతి ఉద్ధరణకై అందించినారు. పశ్చిమ భూగోళమున కూడ IBEZ ఆధారముగ అనేక ప్రాచీన విద్యలను, పరిజ్ఞానమును అందించినారు.

ఇటీవలి కాలమున శంబళ నుండి అందిన పరిజ్ఞానమే మేడమ్ హెచ్.పి.బి. తన ఉద్గ్రంథముల యందు చేర్చినది.

భవిష్యత్తునకు సరియగు పునాదులను వేయుట శంబళ ప్రత్యేకత. భూత మాధారముగ ప్రస్తుతము వర్తించుచు నుండును. ప్రస్తుత మాధారముగ భవిష్యత్ ఏర్పడుచున్నది. ప్రస్తుతము సూర్యాస్త సమయ మగుటచే, చీకటులు వెలుగుల నాక్రమించును. కనుక మరల వచ్చు సూర్యోదయమునకు సంసిద్ధులగుట తెలివి. శంబళ అట్టి తెలివి నిచ్చును.

రేపు సూర్యోదయమునకు నిర్వర్తించవలసిన కర్తవ్యములకు నేటి రాత్రియే సంసిద్ధులగుట శంబళ చూపు "ముందు చూపు". జీవులు వెనుక చూపుతో అధికముగ నుందురు. ముందుచూపు గలవారే విజయవంతు లగుదురు. రాబోవు పరీక్షా కాలమునకు నేడే సంసిద్ధు లగుట శంబళ స్ఫూర్తి. పరీక్షా సమయమున సంసిద్ధు డగువాడు పరీక్ష యందు విజయము పొందుట అంతంతమాత్రముగనే యుండును.

మానవులు రేపటి విషయము నాలోచింతురు. శంబళ రాబోవు యుగమును గూర్చి ఆలోచించును. మనకు రేపెట్లో, శంబళకు 432 సం॥ల పిమ్మట రేపుగ భావింతురు. మనకొక రోజనగా 24 గంటలు. శంబళకు ఒక రోజనగా 432 సంవత్సరములు. అంతటి ముందు చూపుతో భూమి జీవులను నడిపించు వీర్యవంతము, అప్రమత్తము అగు శక్తితో శంబళ వర్తించుచున్నది. ప్రస్తుతమున 1992 సం॥ము నుండి 2424 సం॥ము వరకు 432 సం॥లు ఒక దినముగ శంబళ ప్రణాళిక రచించి యున్నది.

## 80

## పురుషమేధము

"తమ సౌఖ్యం, తమ భాగ్యం, తమ శ్రేయస్సు, తమకు ముక్తి, మోక్షము- ఇత్యాది అస్వస్థతా భావముల నుండి మానవజాతిని సంఘ సౌఖ్యం, సంఘ సౌభాగ్యం, సంఘశ్రేయస్సు, సంఘపరమగు విశృంఖలములను ఛేదించుట" అను అంశములపైకి మానవ భావము మళ్లింపజేయుట శంబళ ప్రయత్నము, శంబళ సంకల్పము మరియు శంబళ ఆశయము.

పదార్థము నుండి ప్రజ్ఞ వైపునకు దృష్టిని మరల్చుట కూడ శంబళ ఆశయము. పదార్థాసక్తి హానికరమని, శంబళ నిత్యము హెచ్చరించు చుండును.

ప్రస్తుతమున మానవజాతికి ప్రేమ అనునది యిచ్చి పుచ్చు కొనుటకై వినియోగపడు చున్నది. ఇచ్చుటయేగాని, పుచ్చుకొనుట లేని ప్రేమ అంతుబట్ట లేదు. కనుక వంటబట్ట లేదు. ప్రేమ వ్యాపార ముగ సాగుచున్నది. ప్రేమ ధర్మము తెలియజేయుటకు అపుడపుడు మహాపురుషు లవతరించినను, అతని ననుసరించువారు అరుదుగ

నుందురు. మానవజాతి యిచ్చి పుచ్చుకొను కర్మయందు బద్ధమై యున్నది. అట్టి బద్ధత నుండి విముక్తికి ప్రేమ ధర్మ మొక్కటియే మార్గము. అట్టి మార్గమునకు సూర్యుడే ప్రత్యక్ష గురువు.

మానవుడు సూర్యుని ఆరాధించుట నేర్చినాడు. సూర్యుని నుండి ప్రాణము, ప్రజ్ఞ పొందుట నేర్చినాడు. కాని సూర్యునివలె తన ప్రజ్ఞా ప్రాణములను ఇతరులకు ఉచితముగ పంచుట నేర్వలేదు. సూర్యునివలె పోషించుట నేర్వలేదు. సూర్యునివలె సూటిగ వర్తించుట నేర్వలేదు. నిజమునకు ప్రతి మానవుని ఒక సూర్యునిగ ప్రకృతి తీర్చిదిద్దినది. ప్రతి మానవుడు సూర్యపుత్రుడే. సూర్య వంశీయుడే. సూర్యునివలె ప్రకాశించు, పోషించు స్ఫూర్తి కలిగిన మానవులకై శంబళ కృషి చేయుచున్నది.

అందరి మేలు కోరుచు, వర్తించుచు తమను తాము మరచు వారు శంబళకు చేరువగుచు నుందురు. తమ ఆత్మోద్ధరణకై ప్రార్థనలు, పూజలు, పుణ్యక్షేత్రములు, తీర్థములు తీరుబడిలేక నిర్వర్తించువారు స్వార్థపరులగుటచే మోక్షమనెడి వ్యామోహమున పడి యున్నారు. తమకు ఆత్మోద్ధరణము అను భావము స్వార్థమేగాక, అహంకార పూరితమై యున్నది. ఇతరుల శ్రేయస్సుయందు, తమను తాము మరచినవారు సహజముగనే మోక్షస్థితి యందున్నారు. జీవుల శ్రేయస్సు, తమ శ్రేయస్సుగా గావించువారు నిజమగు యజ్ఞమున పురోగతి చెందుచున్నారు. అట్టి యజ్ఞమున పురుషమేధము పరాకాష్ఠయై యున్నది.

81

## మార్గదర్శకత్వము

శంబళ ప్రధానముగ 1, 2, 7 కిరణముల మార్గమున ప్రపంచమున తన ప్రభావము చూపుచు నున్నది. ఈ కిరణముల కధిపతులైన పరమగురువులు మరువు, దేవాపి మరియు రాకోజి (సి.యస్.జి.). ఈ ముప్వురు గురువుల ఆశ్రమములు ప్రస్తుతమున ప్రపంచమున అత్యంత ప్రభావముతో పనిచేయుచు నున్నవి. నిజము నకు మానవజాతి భవిష్యత్తు ఈ మూడు ఆశ్రమముల యందే నిర్ణయింపబడుచు నున్నది. శంబళ అవతరణమునకు పై తెలిపిన పరమగురువులే త్రిభుజముగ నేర్పడి, శక్తిపాతము చేయుచునున్నారు. ఈ ఆశ్రమముల యందలి అంతేవాసులు ధ్యానమార్గమున పొంద వలసిన స్ఫూర్తిని, ప్రణాళికను పొందుచు, నిశ్శబ్దముగ శంబళ ఆశయములను మానవజాతియందు ప్రవేశింప జేయుచున్నారు. ఈ ఆశ్రమవాసులు ధ్యానమున నిత్యము శంబళను స్మరించుచు, తమ కార్యములను గత 344 సం॥లుగ నిర్వర్తించుచున్నారు.

శంబళ భూమిపై సంకల్పశక్తికి ప్రతీక. ఆ సంకల్పమును ప్రేమ జ్ఞానముల ద్వారా క్రతుబద్ధముగ నిర్వర్తింపజేయుట పై తెలిపిన

మూడు ఆశ్రమముల బృహత్తర బాధ్యత. శంబళ యందు ప్రధానముగ సనత్కుమారునితో పాటు జగద్గురువు మైత్రేయులు, తథాగత బుద్ధుడు, ఆదిశంకరులు దీక్షతతో ఊర్ధ్వలోకములనుండి దివ్య సంకల్పమును అందుకొనుచు, గురుపరంపరకు వలసిన మార్గదర్శకత్వమును నిర్వర్తించుచున్నారు. పై నలుగురును భూమిచుట్టును గల ఏడు వెలుగు వలయముల నుండి సందేశము లందుకొనుచు, భూమిపై బాధ్యత వహించుచున్న పరమగురువుల పరంపరకు అందించుచున్నారు.


పరమగురువుల బోధనల ననుసరించు వారందరు గోళము నందు తమను కేంద్రముగ జేసుకొని, శంబళను పరిధిగ భావించి, నడుమ సమస్త గురుపరంపరను స్మరించుట వలన, తమ తమ సహస్రారముల యందు శంబళ ప్రజ్ఞను ప్రచోదనము కావించుకొనుట ఒక ధ్యాన విధానమని పరమగురువు జ్వాలాకూలుడు ఆధునిక యుగమునకు ఒక నిర్దేశము నిచ్చినాడు.

## 82

# లోకసేవ

శంబళ కేంద్రముగ, మానవజాతి పరిధిగ, పరమగురువుల ఆశ్రమములు కేంద్రము చుట్టూ ఏర్పడిన ఆవృత్తులుగా భావించి, ధ్యానించుట భావమయలోకమున చేయవలసిన సాధనలలో ఒకటి. శంబళ చుట్టును సనత్కుమారుడు, మైత్రేయుడు, గౌతమబుద్ధులను ఒక త్రిభుజముగ నూహింపుము. వీరు మువ్వురు చుట్టును మరియొక త్రిభుజముగ మరువు, దేవాపి, రాకోజిలను ఊహించుము. ఆ త్రిభుజ బిందువులనుండి వారి అంతేవాసులు తొమ్మిది శ్రేణులలో గలవా రందరు ఏర్పడినట్లు భావింపుము. వారు వరుసగా శిశువులు, బాలురు, ఉపనీతులు, కౌమారులు, కుమారులు, సూత్రధారులు, అంతేవాసులు, హృదయవాసులు, శంబళ సేవకులు అని ముందు తెలిపిన వ్యాసము లలో పేర్కొనబడిరి. వారిచుట్టునూ వృత్తాకారముగ ప్రాపంచిక మానవుల నందరిని భావింపవచ్చును.

ఈపై తెలిసిన ధ్యానము నిర్వర్తించుట ఒక లోకసేవగ శంబళ నిర్వహించినది.




పై చిత్రపటమును నిత్యము నిదురకు ముందు స్మరించుట సాధకుల కుపయుక్తమగును.

## 83

# ప్రజ్ఞావతరణము

ద్వాదశ రాశులన్నియు కూడ ద్వాదశాత్మకుడగు వాసుదేవుని సాన్నిధ్యము భూమికి, భూమి జీవులకు అందించే ప్రధాన ప్రయోజన ముగ పనిచేయుచున్నవి. వాసుదేవుడు మన సూర్యమండలము ద్వారా ద్వాదశ రాశుల సాన్నిధ్యమందించి భూమి నుద్ధరించు ప్రయత్నములో నున్నాడు. అట్టి ప్రయత్నమును భూమిపై సిద్ధింపజేయుటకు సనత్కుమారులు శంబళ కేంద్రము నందున్నారు. సనత్కుమారుడు, సూర్యదేవుడు, వాసుదేవుడు ఒక త్రిభుజముగ దివ్య సాన్నిధ్యమును భూమికందజేయు చున్నారు. ద్వాదశరాశుల నుండి వైవిధ్యముతో ప్రజ్ఞావతరణము జరుగుచున్నది.

చరరాశులు అగు మేషము, కర్కాటకము, తుల, మకరము వాసుదేవుని యొక్క చతుర్భుజములుగ జ్యోతిర్విద్య తెలుపుచున్నది. మేషరాశి భూమిపై జీవుల అవతరణమునకు సంకల్పించగ, కర్కాటక రాశి జీవులకు మనోదేహముల నేర్పాటు చేసి, జీవ అవతరణము, అవరోహణము ప్రారంభము చేయును. ప్రాధానమగు సంకల్పము మేషమున జరుగగా, దేహాదులు జీవులకు కర్కాటకమున ఏర్పాటు

చేయబడును. ప్రధాన సంకల్పమే దేహ మాధారముగ జేసుకొని, అనుభవమును అనుభూతిని పొందుచు నుండును. దేహము లందు అవతరించుట ఒక వంతు. ప్రపంచమున ప్రవేశించి, అనుభవము అనుభూతి పొందు ప్రయత్నమున జీవులు అజ్ఞానమునబడి, తమకు తాముగ బంధము లేర్పరచుకొనుట రెండవ వంతు. అటుపైన బంధ విమోచనము కొరకై భక్తి జ్ఞాన వైరాగ్యములను పొందుటకు చేయు ప్రయత్నము మూడవ వంతు. సంకల్పము సిద్ధించి జన్మ పరంపరలను దాటి ఊర్ధ్వగతి చెందుట చివరి వంతు. ఈ నాలుగు భాగముల కథ వరుసగా కర్కాటకము, తుల, మకరము, మేషము లందు నాలుగు భాగములుగ, నాలుగు భుజములుగ సంవత్సరమున నిర్వర్తించుట వాసుదేవుని వ్యూహము. అట్టి వ్యూహము భూమిపై నిర్వర్తింప జేయువారు శంబళ నివాసులు. వారి ప్రభువు అగు సనత్కుమారుడు భూమిపై వసించు విష్ణుదేవుడే.

ఇట్టి అవగాహన సాధకులు పొందుట పురోగతికి సహకరించును.



84

## మోక్షద్వారము

మేషరాశి యందుగాని, వృశ్చిక రాశియందుగాని, మీనరాశి యందుగాని మరణించిన సిద్ధులు శంబళను గాని, పరమగురువుల పరంపరనుగాని, జాతిశ్రేయస్సు కలిగించు బృందముల యందుగాని జన్మింతురని పరమగురువు జ్వాలాకూలుడు బోధించు చున్నాడు. మేషరాశి – చైత్రమాసమందు మరణించిన సిద్ధులు సరాసరి శంబళ చేరుదురని బోధించినాడు.

పై తెలిపిన రాశుల యందు మరణించు సిద్ధులకే యిది పరిమితము. శంబళ, శ్రావస్తి, కులూలోయ వరుసగా సనత్కుమారు నకు, మైత్రేయాది పరంపరలకు, మానవజాతి శ్రేయో కేంద్రమునకు వర్తించును. కనుక సిద్ధుల మరణము నందు కూడ కాలము మార్గమును నిర్దేశించును. ఉత్తమ సంస్కారములతో మరణించిన వారు ఉత్తరాయణమునందు గాని, శుక్లపక్షమునందు గాని, పగలుగాని మరణింతురని భగవద్గీత సూచించుచున్నది.

మానవులు జీవితమందలి సన్నివేశముల నన్నిటికిని ముహూర్తము నిర్ణయించుకొని కార్యములను ప్రారంభింతురు. ప్రయాణమునకు కూడ

తిథి వార నక్షత్రములు పాటింతురు. మరణము మహా ప్రయాణము వంటిది. దానికి కూడ ముహూర్తమును నిర్ణయించుకొనువారు సిద్ధులు. మరుజన్మలో తాము నిర్వర్తించబోవు కార్యములకు అనుకూలమగు కాలమును, దేశమును నిర్ణయించుకొని దేహము విడుతురు. ఇట్టి దేహత్యాగ విషయమున ఉత్తమోత్తమమగు కాలము మేషరాశి లేక చైత్రము అని తెలుపబడుచున్నది. సిద్ధులకు గూడ ఇది అత్యంత ముఖ్యమగు విషయము.

ఇటీవలి కాలమున పునరుత్థానము నిర్వర్తించి చూపిన మహా సిద్ధులలో ఏసుక్రీస్తు ఒకరు. ఈ మహా పురుషుడు చైత్రమాసముననే పునరుత్థానము కార్యక్రమము నిర్వర్తించినాడు. యూదు సంప్రదాయ మున పరలోక గమనమునకు చైత్రమే అత్యంత ప్రధానమని తెలుప బడినది. అందున పౌర్ణమి తరువాతి శుక్రవారముగ వారు గుర్తించి, 'గుడ్ ఫ్రైడే' అను ఉత్సవము నిర్వర్తింతురు. భారతీయ సంప్రదాయ మున వసంత ఋతువంతయు అట్టిదే అని తెలుపుదురు. సిద్ధులు భూమిపై సమస్త కార్యములు నిర్వర్తించిన వెనుకే శంబళ చేరుట కిత్సగింతురు. శంబళ చేరిన మహాత్ములకు శుక్ర గ్రహమునకు ద్వారములు తెరువబడును. ఆ ద్వారము నుండే సనత్కుమార మహర్షి శుక్రుని నుండి భూమిపైకి అవతరించెను. అదే మార్గమున శుక్ర వ్యూహమును గూడ అపుడపుడు దర్శించి వచ్చుచుండును. శంబళ భూమికి, భూమి జనులకు మోక్ష ద్వారము. కనుక శంబళను స్మరించుట జీవుల ఉన్నతికి తోడ్పడును.

85

## బహుమతులు

కుంభ యుగమున శంబళ అందించు బహుమతులు 1. అవకాశము, 2. వికాసము, 3. సోదరత్వము. మానవులు ఎవరికి వారుగ తమ నుద్ధరించుకొను మార్గమున శనైశ్చరుని ఆశ్రయించి, క్రమశిక్షణము పొందవలెను. శని ఆశయమున కోరికలు నశించి కర్తవ్యమే తమ ప్రధానమైన పనిముట్టుగ నేర్వవలెను. శనైశ్చరుని అనుగ్రహము లభించినవారు పతనము చెందు అవకాశముండదు. క్షమ, ఓర్పు, వేచియుండుట, ఆశించకుండుట, కర్తవ్యోన్ముఖులు మాత్రమే అయి ఉండుట, క్రతుబద్ధముగ జీవితము నిర్వర్తించుట, మనస్సున లోతులు పెంచుట, భావములకు స్థిరమేర్పరచుట ఇత్యాది సద్గుణములు శనైశ్చరుని అనుగ్రహముననే లభ్యమగును. అట్టివారు జీవితమందలి సమస్తమగు అవకాశములను సద్వినియోగము గావించుచు సాగుదురు.

అటుపైన బుధ గ్రహ ప్రభావమున వలసిన వికాసమును, జ్ఞానమును పొందుదురు. విలువల నాశ్రయించి, విచక్షణతో వికాసము

చెందుచు నుందురు. అట్టివారికి శుక్ర గ్రహము వైభవము, దివ్యాను భూతులకు ద్వారములు తెరుచును.

పై విధముగ పురోగతి చెందు మానవునకు నిత్యస్ఫూర్తి, వికాసము ఆధారముగ మానవ సోదరత్వము అవగాహన అగును. సిద్ధాంతపరముగ గాక, ఆచరణాత్మకముగ సోదరత్వమును నిర్వర్తించుట, అనుభూతి చెందుట ఉండును. కుంభయుగమున ఈ విధమగు పురోగతి శని, బుధుడు, శుక్రుల ద్వారా జీవులకు శిక్షణ నిచ్చి మానవుల నుద్ధరించవలెనని శంబళ ప్రయత్నము. ఈ దిశగా సాధకునకు శిక్షణ నిచ్చి, సంసిద్ధులను గావించి, వానిని దివ్యప్రణాళిక లోనికి మరల కొనివచ్చుటకు శంబళ, శ్రావస్తి యందలి పరమ గురువులు అనునిత్యము కృషి సలుపుచున్నారని, శంబళ అందించు కానుకలు మానవజాతి పొందుట, పొందకుండుట అనునది మానవజాతి నిర్ణయమునకే శంబళ స్వేచ్ఛ నిచ్చినది. స్వతంత్రము అనునది ఊర్ధ్వలోకమునందు అత్యంత పవిత్రముగ భావింతురు. మానవుడు కాని, మానవజాతిగాని స్వతంత్రముతోనే, స్వేచ్ఛతోనే పురోగతి సాధించవలె ననునది శంబళ ఆశయములలో నొకటి.

86

## శంబళ ప్రవేశము

శంబళ ద్వారములు మేషమాసమున తెరువబడును. అందులకై చేయు సాధన వృషభరాశి యందు, మకరము నందు సూచింపబడి యున్నది. వృషభరాశికి ద్వారములు తెరచుటకు సంబంధించిన సాధన మిథునము, సింహరాశుల యందున్నది. అనగా సింహమున సాధకుడు హృదయమును చేరి, మిథునమున ద్వంద్వముల నధిష్ఠించి, వాక్కును జయించి మేషమును చేరవలెను. ఇదియంతయు అంతర్గత సాధనయే. సాధకుడు శ్వాసద్వారా అంతర్ముఖుడై, అటుపై స్పందనము సూక్ష్మ స్పందనము చేరి, సుషుమ్న మార్గమున ఊర్ధ్వగతి చేరవలెను. విశుద్ధి దాటుసరికి ద్వంద్వములను సమన్వయించుకొను శక్తి, వాక్కుపై నియమము పొందవలెను. అపుడే భ్రూమధ్యమును చేరుట సంభవించును. అట్టివానికి క్రమముగ గురు పరంపరాగతమైన సనాతనమగు జ్ఞానము, ధర్మము తెలియును. క్రమముగ భూమిపై నిర్వర్తింపబడుచున్న దైవప్రణాళిక అవగతమై వృషభమున వైశాఖ ప్రజ్ఞను దర్శించుట జరుగును. వైశాఖ ప్రజ్ఞ సనత్కుమారుని యొక్క ప్రజ్ఞయే. అనంతకాలము దైవ ప్రణాళికనందు

సమర్పణతో జీవించిన వారికి అరుదుగ శంబళ ప్రవేశము జరుగును. ఇది జ్యోతిషపరమగు ఒక మార్గము.

మరియొక మార్గము కన్య, వృశ్చికము, మకర రాశుల ద్వారా యున్నది. ఇదియును అద్భుతమగు మార్గము. కన్యయందు సేవా తత్పరతను అవగాహన చేసుకొని, జీవుల సేవకు తమను తాము సమర్పణ చేసుకొనువారు అంతర్హితులగుట సులభము. వీరు కొంత కాలము అదృశ్యులగుదురు కూడ. అదృశ్య ప్రదేశము లందు, అంత రంగమున తపస్సు చేసుకొనుటవలన సాధకుని యందు వలసిన మార్పులన్నియు నిర్వర్తింపబడును. వీరికిని అంతరంగమున దర్శన జ్ఞానము లభించును. ఇట్టివారు వృశ్చిక రాశి ప్రభావమున గరుడ పక్షివలె శీఘ్రముగ, ఊర్ధ్వముగ చనుదురు. ఈ మార్గమును కన్య నుండి వృశ్చికము చేరుటగ తెలుపుదురు. ఇట్టి వారికి మకరమున సర్వ సమర్పణ అను యజ్ఞము సిద్ధించును. అట్టి సమర్పణ స్థితిలో వీరును అనంతకాలము దివ్యకార్యములు నిర్వర్తించి, శంబళ ప్రవేశమును పొందుదురు.

ఇట్లు సింహము నుండి, వృశ్చికము నుండి రెండు మార్గములు శంబళకు చేర్చునని పరమగురువు జ్వాలాకూలుడు తెలిపియున్నాడు.

## 87

# శంబళ మార్గము


చరరాశి చతుర్భుజ మొకటి శంబళ మార్గమును అనాదిగ అందించుచున్నది. పూర్వకాలము అధికముగ ఈ మార్గమునే అనుసరించెడివారు. మేష, తులలో విషువత్పుణ్యదినములు, మకర కర్కాటకములలో ఉత్తరాయణ, దక్షిణాయన సంక్రమణ పుణ్య దినములు కలిగిన చరరాశి చతుర్భుజము దివ్యమగు చతుర్భుజము. ద్వాదశరాశులను జ్యోతిర్విద్య మూడు చతుర్భుజములుగ వివరించును. అవి వరుసగ చరరాశి చతుర్భుజము, స్థిరరాశి చతుర్భుజము, ద్విస్వభావ రాశి చతుర్భుజము.

కర్కాటకమందు జీవులు మనసును ధరించి మానవులుగ భూమిపై యాత్ర సాగింతురు. మానవజాతి కార్యకలాపములు భూమిపై అత్యధికముగ నిర్వర్తింపబడు చుండును. పురోగతికై అవతరించిన మానవజాతి తమకు తాముగ అల్లకల్లోలము చెంది, పరిష్కారము లేని కర్మలను సృష్టించుకొనుచు, పరిణామము లేక స్తంభించి యున్నారు. జాతి సమస్య కర్కాటకమందలి అహంకార మమకారములే. గుంపులు

గుంపులుగ జీవించు మానవజాతి మకరరాశి ప్రభావమున ఏకాంతము నేర్వవలెను.

ఏకాంతత మకరరాశి ప్రత్యేకత. వృశ్చికమున కూడ ఏకాంతత యున్నను అది తీవ్రమగు ఏకాంతత. మకరమందలి ఏకాంతత, ఆత్మ పరిశీలనమునకు, ఆత్మ విమర్శకు, పునః సమీక్షణమునకు అవకాశమును అందించును. మానవులు మహాత్ము లగుటకు ఏకాంతత ఒక తప్పనిసరి దీక్ష. మకరమందలి ఏకాంతత దిశా నిర్దేశము గావించి, మానవుని దివ్య ప్రకృతి వైపునకు మళ్లించును. ప్రకృతి బలము, గుణము క్రమముగ నవగాహన చేసుకొనుటలో మానవుడు తులారాశి కాకర్షింపబడును.

తులారాశి యందు ప్రకృతి ఆకర్షణల నధిగమించ గలిగిన మానవుడు ప్రకృతిని గౌరవించుచు, ప్రకృతిని ఆరాధన చేయుచు, ప్రకృతి అనుగ్రహముగ ప్రకృతి రహస్యములను తెలియును. అట్టివారు జగన్మాత కరుణా కటాక్షములతో సరాసరి శంబళ మార్గమున ప్రవేశింతురు.



88

## తత్త్వ వికాసము

శంబళ దైవము యొక్క స్వరూప స్వభావములను మానవ జాతికి నిత్యనూతనముగ అందించు ప్రయత్నమున నున్నది. కలియుగమున దైవము యొక్క అవగాహన చిన్నాభిన్నమై అనేక దైవములను సృష్టించుకొని మానవజాతి అత్యంత మూర్ఖముగ పోరాడుకొను చున్నారు. మా దైవము గొప్పదని, కాదు మా దైవమే గొప్పదని, మా నమ్మకమే సత్యమని, ఇతర నమ్మకములు సత్యము కాదని ఎవరికి వారుగ, వారి బుద్ధి మేరకు దైవమును నిర్వచించుకొని, వారి వారి విశ్వాసములను ప్రచారము చేయుచు, ఇతరుల విశ్వాసము లను మూర్ఖమని ఖండించుచు, తీరుబడిలేక మారణ హోమములు సాగించుచున్నారు. సంకుచితత్త్వమునబడి, ఇతరులను కూడ సంకు చితులుగ తయారుచేయు ప్రయత్నమున నున్నారు. బలవంతముగ తన విశ్వాసమును ఇతరులపై రుద్దుచున్నారు. ఇది ఒక దీన స్థితి.

అంధ విశ్వాసములు, మూఢ నమ్మకములు, వివిధాచారములు పెంచుకొనుచు చీకటి యందు ప్రవేశించి యున్నారు. ఒకరికొకరు సహకరించుకొనుట మాని, ఒకరినొకరు ద్వేషించుచు నున్నారు.

నిజమునకు దైవము సర్వవ్యాపి. సర్వజ్ఞుడు. సర్వశక్తిమంతుడు. అతనికి నామము లేదు. రూపము కూడ లేదు. అతడన్ని కాలము లందు యుండువాడు. అన్ని దేశములయందు ఉండువాడు. ఆకాశము వంటి వాడు. అతడు పురుషుడూ కాదు, స్త్రీయూ కాదు. వృద్ధుడూ కాదు, బాలుడూ కాదు. మనిషియు కాదు, దేవతయూ కాదు. ఇవియన్నియు మూలతత్త్వము నుండి అనేక రకములుగ ఏర్పడుచు, వృద్ధి చెందుచు, నశించుచు నుండును. ఈ మొత్తమంతయు ఆ తత్త్వమునుండి ఏర్పడి, వృద్ధిచెంది, ఆ తత్త్వములోనికే లయమగు చుండును. అట్టి తత్త్వము తెలిసినపుడు సమభావము, సమదర్శనము, సహకారము, ప్రేమ, పరిపూర్ణ వికాసము, సమర్థత ఏర్పడును. అట్టి వారిని జ్ఞానులందురు. వారికి ఏ మతముతోను సంబంధము లేదు. తత్త్వముతోనే సంబంధము కలిగి యుండును. తనవద్దకు వచ్చిన వారికి కూడ తత్త్వ వికాసమే కలిగింతురు. ఇట్టి జ్ఞానులద్వారా శంబళ నూతన అధ్యాయమును రచించు చున్నది. వరుణ గ్రహ సహకారముతో సంకుచిత భావము లన్నిటిని మట్టుపెట్ట నున్నది. కృతయుగము యొక్క అవగాహనను ఆవిష్కరింప నున్నది.

89

## నూతన విధానము

మానవుల సంకల్పబలమును వృద్ధిచేయుట శంబళ కార్యక్రమములలో నొకటి. పెరిగిన సంకల్పబలము యజ్ఞార్థము సమర్పించుట మరియొక అంశము. గత వంద (100) సం॥లలో మానవజాతి సంకల్పబలము పదులరెట్లలో పెరుగుచు నున్నది. ఈ బలమును ప్రస్తుత కాలమున యజ్ఞార్థమునకు కాక, స్వార్థము కొరకై జాతులు వినియోగించుచు నున్నవి. ఎచ్చట స్వార్థము బలమగు చున్నదో అచ్చట ప్రకృతి వైపరీత్యములు, యుద్ధములు జరిగి కొంత సమతుల్య మేర్పడుచు నున్నది.

రెండవ ప్రపంచ యుద్ధమునకు కారణము అమితమగు రాజ్య కాంక్ష. అగ్రరాజ్యము లన్నియు కూడ భూమిపై సామ్రాజ్యము లేర్పరచు కొని ఇతర దేశములను, జాతులను, వారి వనరులను వశము చేసుకొని కొల్లగొట్టుకొను పైశాచిక చర్యకు యుద్ధమే పరిష్కారముగ శంబళ పావులను కదిపినది. యుద్ధానంతర పర్యవసానము సామ్రాజ్య ధోరణికి చరమగీతము పాడినది. సామంత దేశము లన్నిటికిని స్వాతంత్ర్యము లభించినది. భూగోళమున నేడు సామ్రాజ్య ధోరణి లేదు. ఏ దేశమూ

అగ్రరాజ్యమునకు బానిస కాదు. ఏ దేశమున కాదేశము స్వయం పరిపాలన ప్రారంభించినది. అనుభవ లేమి కారణముగ తిప్పలు పడుచున్నను తమను తామే పరిపాలించుకొను ప్రయత్నమున నున్నారు.

దేశమందలి వివిధ ప్రాంతములు కూడ స్వయం పరిపాలనకై ధారణ సాగించి, వివిధ రాష్ట్రములు సంయుక్తముగ నున్నవి. ఇది మానవజాతి యందు గుర్తింపవలసిన మార్పు. ఇట్టి మార్పునకు వంద సంవత్సరముల ముందు ఉద్యమించినది శంబళ.

స్వయం పరిపాలన విధానము వ్యక్తిగతముగ ప్రతి మానవుడు కూడ కోరుచున్నాడు. ఒకరిపై ఆధారపడకుండ, తనంతట తానుగ వృద్ధి చెందవలెనని ఆకాంక్షించు యువతర మొకటి ఏర్పడుచున్నది. వారి సమర్థతలు కూడ ముందు తరము కన్న మిన్నగ యున్నవి. స్వార్థచింతన యున్నను, స్వావలంబనము పెరుగుట ఒక ఉత్తమ లక్షణము.

సద్గురువులు కూడ శంబళ మార్గమున అనుయాయులను స్వతంత్రులను చేయుట కూడ ఒక నూతన విధానము.

90

## ప్రజ్ఞా మార్గములు

ద్వారకా పట్టణము శ్రీకృష్ణుని ఆజ్ఞగ విశ్వకర్మచే నిర్మింపబడిన దివ్యనగరము. శ్రీకృష్ణుని అవతార ప్రయోజనము పరిపూర్తి అయిన తరువాత, భౌతికమగు నగరము సముద్రగర్భము కాగా, మంద్రమయ మగు ద్వారక శంబళను చేరి, శంబళకు అదనపు తేజస్సు కలిగించి నది.

శ్రీకృష్ణుని అనుయాయులైన మైత్రేయుడు, ఉద్ధవుడు, విదురుడు, మనువు, మరువు, దేవాపి మహర్షులు శ్రీకృష్ణ స్ఫూర్త్యార్థము సంవత్సర మున కొకమారు శంబళను దర్శించుట ఆచారమై నిలచినది. క్రమముగ వసుధ యందు అన్ని ప్రాంతముల వారికి శంబళ తలమానికమై నిలచినది. సిద్ధులు, యోగీశ్వరులు పూర్ణ జ్ఞానముతో శంబళను సహస్రారమున దర్శించుట, సాన్నిధ్యమును పొందుట సాగుచునున్నవి. అన్ని మతముల వారికి, అన్ని ప్రాంతముల వారికి భూమిపై శంబళయే ప్రప్రథమ దివ్యక్షేత్రము. భూగ్రహమునకు కూడ శంబళయే ఆధారము. శంబళనుండియే అంతరిక్షమందలి ఇతర కేంద్రములకు ప్రజ్ఞా ప్రసారము జరుగుచు నుండును. సప్తర్షి

మండలము, కృత్తికా మండలము, శారమేయ మండలము, ఇతర తారకా మండలములు, గ్రహ మండలములకు శంబళ నుండి ప్రజ్ఞా మార్గము లున్నవి.

ఈ సందర్భమున చెప్పబడుచున్న భూమి అనగా అది భౌతిక భూగోళము మాత్రమే కాదు. సప్త ద్వీపములతో కూడిన భూగోళము. దీనిని వసుంధర అని పిలుతురు. మన భూగోళము సప్త ద్వీప భూమండలమున ఘన పదార్థముగ ఏర్పడిన అతి చిన్న గోళము. మొత్తము భూకమల మందు అరువది నాలుగవ (64) భాగముగ తెలుపుదురు. ఈ మొత్తము భూ కమలమునకు ప్రధాన క్షేత్రము శంబళయే. దీనిని శ్వేత ద్వీపమని, పుష్కర ద్వీపమని అందురు. దివ్యదృష్టి కలవారికే ఇది దృగ్గోచరము.

ప్రస్తుత కాలమున దీనిని గూర్చి వివరముగ ప్రస్తావించినవారు దివ్యజ్ఞాన వ్యవస్థాపకురాలగు మేడమ్ హెచ్.పి. బ్లావెట్‌స్కీ. అటుపైన ఆమె అనుయాయి అగు ఏలిస్ ఎ. బెయిలీ అను పుణ్యమూర్తి. ఇందు ఒకరు రష్యాదేశపు యోగిని కాగా, మరియొకరు ఆంగ్లదేశమునకు సంబంధించిన దివ్యజ్ఞాన సభ్యురాలు. వీరి ద్వారా భౌగోళికముగ ఏర్పడిన ఆధ్యాత్మిక బృందములలో అందరికిని శంబళ పరిచయ మైనది. శంబళను చేరవలెనని ఉత్సాహము భౌగోళికమున యినుమ డించినది.

# 91

## ధారణ స్థితి

ఆధునిక యుగమున హిమాలయ గురుపరంపర నుండి శంబళ పరిచయము విస్తారముగ జరుగుచున్నది. మరువు, దేవాపి మహర్షుల ప్రబోధములలో శంబళ ప్రకటింపబడుచున్నది. అటులనే పరమగురువు జ్వాలాకూలుని బోధలయందు కూడ శంబళ పరిచయము పెరుగుచున్నది. శంబళ గ్రామమును కనుగొనుటకై ఎందరో ఉత్సహించి గోబి ఎడారియందు అన్వేషించినవారు, పరిశోధన చేయుచున్నవారు గలరు. కాని చర్మ చక్షువులకు కనపడని నగరము శంబళ.

దివ్యజ్ఞానమును అనుసరించుచు, అనుష్ఠించుచు, తమను తాము సుశిక్షితులను చేసుకొను సత్సాధకులకు సూక్ష్మలోక దర్శనములు జరుగుట సహజము. అట్టి సూక్ష్మ దర్శకులకు శంబళ దర్శనము సంభవము. భవిష్యత్తున శంబళను చూడగలుగువారు అధికముగ నుందురని పరమగురువులు తెలుపుచున్నారు. భక్తి, జ్ఞాన, యోగ, వైరాగ్య సాధనలో ఉత్తీర్ణులగుచున్న వారికి శంబళ దర్శనము సాధ్యపడును. క్రమముగ శంబళ భౌతిక లోకమున కూడ ఒక సత్యమై

నిలువగలదని, అందులకై అష్టాంగ యోగము భూమికగ నిలబడునని పరమగురువులు బోధించుచున్నారు.

సాధనయందు ప్రాణాయామ ప్రత్యాహార స్థితులను అధిగ మించి, ధారణయందు నిలబడు యోగసాధకునకు శంబళ దర్శన మగుటకు అవకాశము మెండుగ నుండును. సరాసరి శంబళ చూడవలె నని ఆకాంక్షించక, అష్టాంగ యోగమందలి ఆరవ అంగమును ధారణ స్థితిని చేరు ప్రయత్నము కర్తవ్యమై యున్నది.

శంబళ ఐదు రకముల కర్మలను క్షాళనము చేయుటకై నిరంతరము కృషి సలుపుచున్నది. అవి ఈ క్రమమున యున్నవి.

1. వ్యక్తిగత కర్మ, 2. సంఘ కర్మ, 3. దేశ కర్మ, 4. జాతి కర్మ, 5. ప్రపంచ కర్మ.

92

## త్రిగుణములు

మానవుల త్రిగుణ ప్రవృత్తికి మార్గదర్శకులై ముప్వురు సిద్ధులున్నారు. వారు ఉన్ముఖులైన మానవుల ఇచ్ఛా జ్ఞాన క్రియా శక్తులను సరిదిద్ది, మానవుని వృద్ధికి తోడ్పడగలరు. సాధకులు వీరితో ముడి పడి యుండుట జరిగినచో ఈ ముప్వురును, సాధకుని స్వభావము నందు తగిన మార్పులను చేకూర్చుదురు. సాధకుని స్వభావము అతని క్షర పురుషత్వము. సాధకుడు అక్షరుడు. వారి త్రిగుణములను సరిదిద్దినచో అక్షరుడగు సాధకుడు తనయందలి ఈశ్వరునితో అనుసంధానము చెందుట సులభమగును. అపుడు సాధకుడు దివ్య ప్రణాళికకు చేరువై, దివ్య కార్యక్రమములందు నియుక్తుడగును.

సాధకుని స్వభావమునందు ప్రాంతీయము, దేశీయము, జాతీయము అగు కట్టుబాట్లు కొన్ని అతనిని పరిమితి చేయుచునుండును. ఇట్టి పరిమితులను కూడ పై తెలిపిన ముప్వురు సిద్ధులును దాటింప జేయుదురు. శంబళ అనుయాయులకు కులము, జాతి, దేశీయత అను పరిమితులుండవు. విశ్వమానవ భావమే యుండును. అట్టి సాధకులు నిత్యము శంబళను స్మరించి, తదనుగుణమగు స్ఫూర్తితో

నిత్య జీవితమును సత్సంకల్పములకు కైంకర్యము చేయుదురు. వారి కట్టు, బొట్టు, వేషధారణము నందు కూడ మత చిహ్నము లేవియు గోచరించవు. వారికి సనత్కుమారుడు, మైత్రేయుడు, మరువు, దేవాపి ఆదర్శమూర్తులు. వారు ధ్యానమున ఈ పవిత్రమూర్తులను స్మరించుచు తమయందలి ఈశ్వరునితో అనుసంధానము చెందుటకు ధ్యానింతురు. ఇట్టి వారికి ప్రపంచమున లౌకిక సంబంధములు తరగిపోవుచు నుండును.

## 93

## ఈశ్వర లక్షణము

సనత్కుమార ప్రభువు సప్తద్వీప భూకమలమును పర్యవేక్షించి యుండును. సమస్తమును గమనించుచు నుండును. జీవుల యందు ఈశ్వరు డేవిధముగ జీవులను పర్యవేక్షించునో, భూమండలము నంతను అట్లు పరిరక్షించుచు నుండును.

జీవులందరు ఈశ్వరునికి సంబంధించిన వారే. వారియందలి ఈశ్వరుడు మౌనముగ దక్షిణామూర్తివలె యుండును. పిలచిన పలుకును. లేనిచో మిన్నక యుండును. సనత్కుమార ప్రభువు కూడ అట్లే యున్నాడు. తానెప్పుడు మౌనముగ ధ్యానములో నుండును. భూదేవత, ఋషులు, సిద్ధులు అతనితో అనుసంధానము చెంది దివ్య సంకల్పమును గ్రహించి, భూమిపై పనులను చక్క చేయుచున్నారు. అతని ప్రభావము భూమి అంతటను వ్యాప్తిచెంది యున్నది.

సంవత్సరమున కొకసారి మాత్రము భూ నిర్వహణ బాధ్యత వహించుచున్న దేవతలను, సిద్ధులను అనుగ్రహించుటకై హిమాలయ మందలి వైశాఖలోయలో అందరికిని దర్శనమిచ్చి, కర్తవ్యమును తెలిపి మరల శంబళకు నిష్క్రమింతురు.

ఇటీవలి కాలమున రెండవ ప్రపంచ యుద్ధమున, యుద్ధము తీవ్రమై జాతి వినాశనము దిశగా యుద్ధము మలుపు తిరిగిన సందర్భ మున సనత్కుమార ప్రభువు తన ప్రభావముతో, ఆ వైపరీత్యమును తప్పించినాడని పరమగురువు జ్వాలాకూలుడు తన రచనలలో తెలిపినాడు. అట్టి నిర్ణయములను స్వచ్ఛందముగ తానే చేయుననియు, అట్టి సమయములలో ఎవ్వరితోను సంప్రదింపులు జరుపడనియు తెలిపినాడు. గౌతమబుద్ధునకు, జగద్గురువు మైత్రేయునకు కూడ తెలుపకయే భూమి సంక్షేమము వహించి, సనత్కుమార మహర్షి నిర్ణయము చేసిన సందర్భము లున్నవని తెలియవలెను. తరచు అన్ని విషయములందు సంప్రదింపు లున్నను అపాయకర సందర్భములలో తానే సంకల్పించి నిర్వర్తించును. ఇది సనత్కుమారుని ఈశ్వర లక్షణము.

94

## అమృతత్త్వ సిద్ధి

సనత్కుమార ప్రభువును బైబిల్ గ్రంథమున 'సనాతనుడు' అని పిలుతురు. అతడే శంబళ యందుండు 'శ్యామ బాలుడని' హిందూ గ్రంథములు కొనియాడు చున్నవి. అతనినే 'లోకసాక్షి' అని క్రతువిద్యా తంత్రము సంబోధించుచున్నది. సప్త ద్వీప భూమండలము నకు అతడే ప్రభువు. అతని ననుసరించియే వైవస్వత మనువు, జగద్గురువు మైత్రేయులు, నాగరికత నిచ్చు జ్ఞానులు భూమి యందలి అన్ని ద్వీపముల యందు పనిచేయుచున్నారు. సనత్కుమార ప్రభువు భూమి నధిష్ఠించి యుండుట ఒక మహత్తర త్యాగముగ సమస్త దేవతలు, మహర్షులు, యోగులు భావింతురు. అంతర్లోకములలో భూమండలమునకు రక్షకుడనగా, కేవలము సనత్కుమారుడే. అతడే భూమిపై నిలచిన ఏకైక రక్షకుడు. అతని ఆజ్ఞానుసారమే భూమియందు పరిణామము జరుగుచున్నది. భూమియందలి అంతర్గత ప్రభుత్వము నకు అతడు రాజు. అతడే అందరి నియామకుడు. పరమగురువులకు, జ్ఞానులకు, యోగులకు, సిద్ధులకు అతడే కార్యాచరణ పథకము లేర్పరచును.

సనత్కుమారుడు సంవత్సరమున ప్రధానముగ నాలుగు సమావేశము లేర్పరచును. అందు మూడు సమావేశములు అంతర్గత సమావేశములు. ఒక సమావేశము మాత్రమే బహిర్గతము. అది వైశాఖ పౌర్ణమినాడు విశాఖలోయలో జరుగును. సాధకులకు అమరత్వ సిద్ధి నిచ్చున దతడే. భూమిపై ఆత్మసాధన నొనరించి, అమృతత్త్వ సిద్ధికై అర్హత పొందిన జీవికి, ఆ సిద్ధిని ప్రసాదించువాడు సనత్కు మారుడే. సాధకుని గురువు, పరమగురువు సాధకుని సిద్ధికొరకు అతనిని సనత్కుమారుని సాన్నిధ్యమున నిలబెట్టుదురు. సనత్కు మారుడు సాధకుని పరీక్షించి, సిద్ధిని ప్రసాదించును. ఆ సమయమున సనత్కుమారుడు తన యోగదండము యొక్క స్పర్శ సాధకున కిచ్చును. అట్టి సమయమున సనత్కుమారునితో పాటుగ సాధకుని గురువు, పరమగురువు, సనత్కుమారుని ఇరువురు అనుచరులు యోగ దండమును స్పృశింతురు.

95


## యోగదండము

సనత్కుమారుని యోగదండమున అతని తపశ్శక్తి యంతయు నిండి యుండును. అనాదికాలము నుండి సనత్కుమారుడు తపస్సు చేయుచునే యున్నాడు. ఆదియోగి శివునివలె సనత్కుమారుడు కూడ పూర్ణ తపోధనుడు. శివుని శూలము సృష్టియందు ఎట్లు అప్రతిహత శక్తి కలిగి యుండునో, సనత్కుమారుని యోగదండము కూడ అట్లే అమిత శక్తివంతము. అతని యోగదండ శిఖరమున ఊర్ధ్వ అగ్ని శిఖలను ఎగజిమ్ము వజ్ర మొకటి స్థాపితమై యుండును. ప్రతిమారు జగత్తునకు ఒక జగద్గురువును నియమించు సమయమున సనత్కుమార ప్రభువు తన యోగదండ ప్రభావమును జగద్గురువు ధరించు యోగ దండమున ప్రవేశింపజేయును. అపుడు జగద్గురువు జగత్ప్రభువునకు ప్రతీకగా ఏర్పడి పరస్పర మిత్రత్వమున కార్యములు చక్క చేయుదురు.

సనత్కుమారుని యోగదండము శంబళ పొలిమేరలు దాటి నేటివరకు ఎన్నడును నిర్వర్తింపబడలేదు. యోగదండ దర్శనము, స్పర్శనము కేవలము శంబళయందే జరుగును. సనత్కుమారుడు గూడ శంబళ ఎల్లలు దాటడు. కేవలము కారుణ్యమే కారణము. శంబళ

మాత్రమే సనత్కుమారుని తేజస్సు, అతని యోగదండ శక్తి భరింప గలదు. జగద్గురువు, ఇతర పరమగురువులు వలసినపుడు శంబళ కేగుదురు. శంబళ శంబళయే. శంబళతో తుల్యమగు ప్రదేశము సప్తద్వీప భూగోళమున మరియొకటి లేదు.

సనత్కుమారుని యోగదండము వారు ధరింపనపుడు శంబళ యందు తూర్పు పడమరలుగ నున్న ఒక మణిమయ పేటిక యందు నిక్షిప్తము చేయబడి యుండును. ఆ పేటికను సహితము ఎవ్వరునూ స్పృశింప లేరు. ఈ దండ మెప్పటికప్పుడు సూర్యకాంతితో, తనను తాను పోషించుకొను చుండును. దీని ఉనికి సనత్కుమారునకు, అతనిచే అనుమతింపబడిన సిద్ధులకు మాత్రమే తెలిసియుండును.



96


## యోగదండ స్పర్శనము

సృష్టి యందు ప్రధానముగ నాలుగు దండము లున్నవని జ్వాల్‌కూల్ మహర్షి బోధించినాడు. అందొకటి ఆదిత్య మండలమున, రెండవది సవితృ మండలమున, మూడవది సూర్య మండలమున, నాలుగవ దండము భూమండలమున యున్నవట.

ఆదిత్య మండలమున ఈ దండము శ్రీమహాదేవుడు ధరించి యుండును. సవితృ మండలమున ఈ దండము సవితృమూర్తియగు శ్రీమహావిష్ణువు ధరించి యుండును. సూర్యమండలము కొరకై మూడవ దండము దత్తాత్రేయునిచే ధరింపబడి యుండును. నాలుగవ దండము భూమండలమున సనత్కుమార ప్రభువుచే ధరింపబడి యున్నది.

ఇట్లు ఈ నలుగురు దండధారులను యోగమునకొక పరంపరగ భావింపవచ్చును. వారు వరుసగా సనత్కుమారుడు, దత్తాత్రేయుడు, శ్రీమహావిష్ణువు, శ్రీమహాదేవుడు. ఈ నాలుగు దండములు సృష్టి నిర్మాణ దశలో బాగుగ వినియోగపరచుట జరిగినది. అది కారణముగ సృష్టి యందు చతుర్భుజములు, చతుర్యుగములు, నాలుగు స్థితులు, చతుర్వర్ణ ములు, చతుర్ముఖములు ఏర్పడినవి. జీవునికి ఉనికి, ఎరుక,

భావన, క్రియ స్థితులు ఏర్పడినవి. ఈ యోగదండముల ప్రభావము దివ్య జ్ఞానమున ఒక ప్రత్యేక అంశమై నిలచినది. భూమిపైగల ఈ యోగదండము స్పర్శ పొందినవారే భూవలయము నుండి తరింప గలరు. ఈ యోగదండము ప్రజ్ఞా వికాసము కలిగించి దేహమందలి సప్తకేంద్రములను సంధించి, సమన్వయ పరచును. అందులకే యోగ సాధనలన్ని. ఇట్టి కృషి యందున్నవారు క్రమముగ మతములు, ఆచారములు, అలవాట్లు, మూఢ నమ్మకముల వంటి పరిధులను దాటి, తమయందలి ఈశ్వరునితో అనుసంధానము చేయు ప్రయత్నమున యుందురు. వారి శ్రద్ధాభక్తులు, గురు అనుగ్రహము తోడుకాగా కాలక్రమమున సనత్కుమార దర్శనము, యోగదండ స్పర్శనము కలుగ గలదని పరమగురువు జ్వాల్‌కూల్ మహర్షి సూచించి యున్నారు.



97

## చైతన్యశక్తి

సనత్కుమారుడు గాని, అతని అనుమతిచే జగద్గురువు కాని ఈ యోగదండముతో కనీసము నలుగురు సిద్ధుల సమక్షమున ఎన్నుకొనబడిన సాధకునకు స్పర్శ నిచ్చుదురు. తత్కారణముగ, సాధకుని యందు చైతన్య శక్తి యినుమడించును. తత్ఫలితముగ ప్రాథమికముగ శరీరము వేడిమి హెచ్చుగ నుండును. ఈ వేడిమి అనుభవపూర్వకమేగాని పరికరములతో కొలువ వీలుపడదు.

అన్నమయ ప్రాణమయ మనోమయ కోశములతో మెలకువ, కదలిక హెచ్చును. ఐహిక జీవితమున ఒత్తిడి హెచ్చగును. పలు పను లొకమారుగ చేయవలసి యుండును.

దేహమందలి అవాంఛిత వాసనలు వెలికి తీయబడును. దేహమునకు కొంత అస్వస్థత కూడ కలుగవచ్చును. కాని అస్వస్థత కర్తవ్యముల కడ్డురాదు. దేహ అణువుల యందు క్రమముగ శుచి పెరిగి ప్రాణమును, ప్రజ్ఞను అధికముగ గ్రహింపబడును.

నడవడికయందు, వాక్కునందు, పనితీరుయందు కూడ

క్రమముగ నిపుణత పెరుగును. మెదడు చురుకుగ పనిచేయు చుండును. జీవితమున కాలము, ధనము, పరిశ్రమ వృథాగా వ్యయమగుట తగ్గుచు నుండును. త్రికరణశుద్ధి సిద్ధించును.

చేపట్టిన కార్యములు సిద్ధించువరకు కొనసాగునే గాని, మధ్యంతరముగ ఆగవు. కార్యము లన్నిటియందు కృతకృత్యులగుట సంభవించును.

ఇట్టి సాధకునకు ప్రపంచమున ప్రత్యేకమగు హితకార్యము ఒక బాధ్యతగ ఒసంగబడును. ఆ కార్యసిద్ధికొరకై పరిశ్రమింపవలసి యుండును. మూడు దశాబ్దములపాటు ఏకదీక్షగ లోకోపకార కార్యములు నిర్వహింపవలసి యుండును.

పై పరిశ్రమ కారణముగ సాధకునకు తనయందలి ఈశ్వర సాన్నిధ్యము శాశ్వతముగ లభించును. నిర్దిష్టముగ ఒక జిజ్ఞాసువు సిద్ధుడగుటకు శంబళ కృషి సలుపుచు నున్నది.



# 98

## సప్త సోపానములు

శంబళ యందు జిజ్ఞాసువులకు మొత్తము ఏడు ఉపదేశములు జరుగును. అట్టి ఉపదేశములు పొందినవారు సూర్య సమానులై భూమిపై ప్రకాశింతురు. ఈ ఉపదేశము లన్నియు సిద్ధించుటకు ఒక జిజ్ఞాసువునకు శతాబ్దములు పట్టును. ఒక్కొక్క ఉపదేశమునకు జిజ్ఞాసువు చైతన్యము ఇనుమడించుచు అతనియందు అరువదినాలుగు (64) రెట్ల కాంతి పెరుగును.

1×1, 2×2, 4×2, 8×2, 16×2, 32×2 చైతన్యమిట్లు ప్రతి ఉపదేశమునకు రెండు రెట్లు కాగా, అరువదినాలుగు కళలతో స్థూల, సూక్ష్మ, కారణ శరీరములతో ఒక సిద్ధుడుగా జిజ్ఞాసువు పెంపొందును. అట్టి సిద్ధులే భూమండలమును దాటగలరు. భారతీయులు సామాన్యముగ మరణించిన ఆస్తికులందరు ముక్తి పొందినారని భావింతురు. అది కేవలము భ్రమే. భూమండలము నధిష్ఠించుటకు అనంత ప్రయాణమున్నది. అమితమగు కృషి యున్నది. అది ఒక గౌతమబుద్ధుని కృషి వంటిది.

ఒక నిర్దిష్టమగు యోగశిక్షణ, లోకరక్షణ కార్యక్రమములు నిర్వర్తించకయే సిద్ధి పొందినామని భావించు వారనేకులు గలరు. నిజమగు సిద్ధి పొందినవారు తమయందు స్థూల, సూక్ష్మ, కారణ దేహములను నిర్మించుకొని అమరులై, ధర్మకాయులై భూమిపై యింకనూ సేవ చేయుచున్నారు. భూమినుండి తరించువారు సిద్ధులై శంబళ అనుమతితోనే యితర మండలములకు చనగలరు.

భౌతిక లోకమున గల వస్తు సంపదతో అసంగత్వము మొదటి సిద్ధి. దేహ సంబంధమున కలుగు బంధు మిత్ర సంబంధములు బంధములై యుండకుండుట రెండవ సిద్ధి. మనో భావములపై ఆధిపత్యము, అసంగత్వము మూడవ సిద్ధి. జ్ఞాన విజ్ఞాన పరమగు విషయములు తెలిసియుండుట, నిరంతర లోకసేవయందు నిమగ్నమై యుండుట నాలుగవ సిద్ధి. నిష్కారణమగు ఆనందమును శాశ్వతముగ అనుభవించుట ఐదవ సిద్ధి. కాలజ్ఞానము కలిగి, ధారణయందు నిలచి భగవదైక్యమును నిత్య తపస్సున రుచి చూచుట ఆరవ సిద్ధి. దైవముచే అనుగ్రహింపబడి, తాను దైవముగ సారూప్యమందుట, దైవమే తన రూపమున భూమిపై సంచరించుట ఏడవ సిద్ధి.

ఇట్లు సప్త సోపానములతో జీవుని ముక్తికార్యము కూర్పబడి యున్నది. దీనిని నిర్దిష్టముగ నిర్వర్తించుటకే శంబళ యున్నది. భ్రమలు, భ్రాంతులు, ఆవేశకావేశములు, మూఢ విశ్వాసములు, ఆడంబరమగు బహిరంగ దైవకార్యక్రమములు శంబళ మార్గమున వర్జనీయములు.

99

## మహా సిద్ధులు

భూమిపై మహత్తునకు ప్రధాన కేంద్రము శంబళయై యున్నది. శంబళ దేవతానగరము. భూమండలమున అత్యంత పవిత్రమగు ప్రదేశము. సమస్త విద్యలకు మూలము. నిత్య నిశ్శబ్ద శబ్ద తరంగములతో అలరారు చుండును. అనాహత శబ్దము శంబళకు మార్గము. శబ్ద తరంగముల జ్ఞానము కలవారే శంబళ యందు వసించగలరు.

శంబళయందు సూర్యమండలములోనికి కూడ ద్వారములు తెరువబడి యున్నవి. కనుక ఇతర గ్రహములను చేరుటకు ద్వారము లున్నవని వేరుగ చెప్పనవసరము లేదు. శంబళ వాసులు వారి వారి జీవలక్షణమును బట్టి గ్రహాంతర ప్రయాణములు శంబళ నగరము నుండి చేయుచునుందురు. ఆ ప్రయాణము లన్నియు దివ్యప్రణాళికా బద్ధములే. ఇట్టి మహాసిద్ధులు శబ్ద తరంగ శాస్త్రము నందు, భూగణిత శాస్త్రమునందు, ఖగోళ గణిత శాస్త్రమునందు సిద్ధహస్తులై యుందురు. అవసరమునుబట్టి ఆయా గ్రహ మండలములలో నివాసములు కూడ ఏర్పరచుకొందురు.

ఉదాహరణకు సనత్కుమారుడు శుక్రగ్రహమునకు, మైత్రేయ మహర్షి ఇంద్రగ్రహమునకు, మరువు మహర్షి సూర్య, కుజగ్రహములకు, దేవాపి మహర్షి సూర్య, బుధగ్రహములకు రాకపోకలు చేతురని దివ్యజ్ఞాన గ్రంథములలో గలదు.

మానవజాతికి శంబళ స్మరణమునకు కూడ అందుబాటులో లేనిదై యున్నది. కారణము భూమిపై జరుగుచున్న మతకోలాహలము. మతముల పేరున ప్రచారము, చప్పుడు విపరీతముగ పెరిగి గందరగోళములు చేయుచుండగ, నిర్మల నిశ్శబ్ద తరంగములతో అలరారు శంబళ ఎట్లు గుర్తుకు రాగలదు! శంబళ గూర్చి ఎన్ని వివరములు తెలుసుకున్నను నిర్దిష్టమగు సాధన లేనిచోట శంబళ అను శబ్దము మస్తిష్కమున స్థిరమై యుండదు. మతముల యందు అంతరిక్షమున అందరాని కేంద్రము లన్నియు సూచింతురేకాని, ఆ కేంద్రమును చేరుటకు భూమి యందేర్పడిన శంబళను సూచింపరు. ఆకాశమును చూపుట వేరు, ఆకాశము చేరుటకు నిచ్చెనల నందించుట వేరు. అట్టి నిచ్చెన శంబళ యందు మాత్రమే యున్నది. పూర్వకాలమున శంబళ జిజ్ఞాసువులకు ఎరుక యందుండెడిది. నేడు ఆ ఎరుకను మరల మైత్రేయాది గురుపరంపర వ్యక్తము చేయుటకు పూనుకొనినది.

# 100

## పూర్ణిమా ధ్యానములు

ప్రతి మాస పౌర్ణమి యందు చంద్రునియందు కాంతి పూర్ణమై యుండును. పౌర్ణమి తిథికి రెండు రాత్రులు ముందు, రెండు రాత్రులు తరువాత కూడ చంద్రకాంతి అత్యంత ఆహ్లాదము కలిగించును. సనత్కుమార ప్రభువు భూమిపై ప్రసరించుచున్న అమితమగు చంద్ర కాంతిని భూమి కొరకు, భూమి జీవుల కొరకు సంతరింప జేయుటకై ధ్యాన నిమగ్నుడై యుండును. పాంచరాత్ర దీక్షగ ఈ ధ్యానము సాగును. భూమి సూక్ష్మ కక్ష్యల యందు, సాధకుని సూక్ష్మ కక్ష్యలయందు ఈ చంద్రకాంతి ఆధారముగ, సనత్కుమార ప్రభువు కొన్ని సర్దుబాట్లు చేయును. ప్రతిబింబిత సూర్యకాంతియే చంద్రకాంతి యగుటచే మనోబుద్ధులను రెంటిని సరిదిద్దుటకు పూర్ణిమ కేంద్రముగ పంచరాత్ర క్రతువు నిర్వర్తించును. ఇట్లు ప్రతి పూర్ణిమ సందర్భముగ క్రతువు నడుచును. సంవత్సరమున శంబళ యందు ఈ ద్వాదశ క్రతువులు అనాదిగ నిర్వర్తింపబడుచున్నవి.

సనత్కుమారుడు, అతని సన్నిహిత సిద్ధులు చేరి ఈ క్రతువు భూమికిని, భూమిపై సాధకులకును ఎంతయో దోహదము చేయు

చున్నారు. సాధకుల మనసునందు చక్కని పరిణతి ఏర్పడుటకు వారు పూర్ణిమా ధ్యాన సమయమున శంబళతో తమ ప్రజ్ఞను సంధింప వలెను. తాను, శంబళ, చంద్రబింబము ఒక త్రిభుజముగ నేర్పరచు కొని ధ్యానము సాగించవలెను. శంబళ నుండి, చంద్రుని నుండి తమ షట్చక్రములలో వెన్నెలకాంతి ప్రవేశించుచున్నట్లు భావింపవలెను.

నేటి చంద్రుడు ఒకప్పుడు భూమియే. అపుడు కూడ సనత్కు మారుడే ప్రభువుగ నున్నాడు. కనుక చంద్రునికి, సనత్కుమారునికి అత్యంత సన్నిహిత సంబంధమున్నది. తత్కారణముగ చంద్రుడు సనత్కుమారునితో సహకరించి, ద్వాదశ పూర్ణిమా కాంతులను ప్రస్తుత భూమికి, అందలి జిజ్ఞాసువులకు పంచిపెట్టుటలో సహకరించును.

పై తెలిపిన అవగాహనతో పూర్ణిమా ధ్యానములు చేసినచో సాధకుని కాంతిశరీరము క్రమముగ వృద్ధిచెంది, దివ్య శ్రవణము, దివ్య దర్శనము, దివ్య స్పర్శనము వంటి అనుభూతులకు అర్హత ఏర్పడును. ఇట్లు సత్సాధకులు శంబళ నుండి అందివచ్చు బలమును పూర్ణిమా ధ్యానముల ద్వారా పొంది, వృద్ధి చెందవలెనని శ్రీ సనత్కుమార ప్రభువు ఆకాంక్ష.

**సమస్త యోగీ జనతారకం తం । సనత్కుమారం శరణం ప్రపద్యే ॥**

*ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః ॥*



భూమిపైగల అత్యుత్తమము, అత్యంత పవిత్రము అగు కేంద్రము శంబళ. భూమికి అపాయకరమగు శక్తుల నన్నిటిని నిర్వీర్యము చేయుట, భూమిని కాపాడుట శంబళ ప్రధాన కర్తవ్యము. భూమిని రాజు పాలించునట్లు శంబళరాజగు సనత్కుమారుడు భూగోళము మొత్తమును విధ్వంసక శక్తులనుండి కాపాడుచు నుండును.

ధనిష్ఠ

ISBN 978-81-89467-49-4